


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 214

బుధవారం 26-10-2022




**'స్పెషల్' టీచర్**

600 మంది స్పెషల్ చిల్డ్రన్‌కు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న దీప్‌మాలా - 11లో



**ఆస్ట్రేలియా బోణీ**

రెండో లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకపై 7 వికెట్ల తేడాతో గెలుపు - 12లో

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

## కనువిందు చేసిన పాక్షిక సూర్యగ్రహణం

భారత్‌తోపాటు పలు దేశాల్లో మంగళవారం పాక్షిక సూర్యగ్రహణం కనువిందు చేసింది. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

- వివరాలు 10లో



పోలండ్‌లోని వర్సాలో..



ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో..



రాజస్తాన్‌లోని పుష్కర్‌లో..



తెలంగాణలోని సంగారెడ్డిలో..



నెల్లూరులోని స్వర్ణాల చెరువు వద్ద..

కాళహస్తీశ్వర ఆలయం మినహా..

### అన్ని ఆలయాలు మూత

- సూర్య గ్రహణ సమయంలోనూ శ్రీకాళహస్తి ఆలయంలో రికార్డు స్థాయిలో రాహు–కేతు పూజలు
- ఉదయం 8 గంటలకు తిరుమల శ్రీవారి ఆలయం మూత.. రాత్రి 7 తర్వాత దర్శనాలు ప్రారంభం

5లో

## న్యూస్‌రీల్

### శ్వేతసౌధంలో ఘనంగా దీపావళి వేడుకలు



అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో దీపావళి వేడుకలు వైభవంగా జరిగాయి. బైడెన్ దంపతులు, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ సహా పలువురు పాల్గొన్నారు. అమెరికా అభివృద్ధికి సహకారం అందిస్తున్నారంటూ బైడెన్ ధన్యవాదాలు తెలిపారు.

వివరాలు 10లో ▸

### దళిత కుటుంబంపై కాల్పులు



మధ్యప్రదేశ్‌లోని దామోహ్ జిల్లాలో తన భార్య వైపు చూస్తున్నాడనే ఆగ్రహంతో ఓ వ్యక్తి జరిపిన కాల్పుల్లో ఓ దళితుడు, అతని తల్లిదండ్రులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు సోదరులు గాయపడ్డారు.

వివరాలు 10లో ▸

### 'డర్టీ బాంబ్' కలకలం

అణు ధార్మికత కలిగిన డర్టీ బాంబ్‌ను తమపై ప్రయోగించి రెచ్చగొట్టేందుకు ఉక్రెయిన్ ప్రయత్నిస్తోందంటూ రష్యా ఆరోపించగా.. ఉక్రెయిన్ ఖండించింది. రష్యానే తమపైకి డర్టీబాంబ్‌ను ప్రయోగించేందుకు కుట్ర పన్నుతోందని ఉక్రెయిన్ మండిపడింది.

వివరాలు 10లో ▸

# బ్రిటన్‌లో రిషీరాజ్

## కొత్త చరిత్ర సృష్టించిన రిషి సునాక్

### బ్రిటన్ ప్రధానిగా ఏకగ్రీవంగా ఎన్నిక

- ఈ ఘనత సాధించిన తొలి భారత సంతతి వ్యక్తిగా, శ్వేతేతరునిగా రికార్డు
- అప్పుడే బాధ్యతలు స్వీకరించి రంగంలోకి..
- ఆర్థిక సవాళ్లను అధిగమిస్తానంటూ ప్రతిజ్ఞ
- ప్రపంచ సమస్యల పరిష్కారానికి రిషితో కలిసి పనిచేసేందుకు ఆసక్తితో ఉన్నా: ప్రధాని మోదీ



లండన్‌లోని బకింగ్‌హాం ప్యాలెస్‌లో రాజు చార్లెస్‌-3తో కరచాలనం చేస్తున్న బ్రిటన్ కొత్త ప్రధాని రిషి సునాక్

లండన్: నూటా యాభయ్యేళ్లకు పైగా మనల్ని పాలించిన బ్రిటన్‌ను ఇక మన వాడు పాలించనున్నాడు. దేశ మాజీ ఆర్థిక మంత్రి రిషి సునాక్ (42) సరికొత్త చరిత్ర లిఖించారు. సోమవారం పలు ఆసక్తికర పరిణామాల నడుమ అధికార కన్జర్వేటివ్ పార్టీ నేతగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తద్వారా బ్రిటన్ ప్రధాని పదవి చేపట్టిన తొలి భారత మూలాలున్న నేతగా రికార్డు సృష్టించారు. ఈ ఘనత సాధించిన తొలి శ్వేతేతరుడు కూడా రిషియే కావడం మరో విశేషం! అంతేగాక గత 210 ఏళ్లలో అతి పిన్న వయస్కుడైన బ్రిటన్ పీఎంగా కూడా రిషి మరో రికార్డు నెలకొల్పారు. ప్రధాన పోటీదారుగా భావించిన మాజీ ప్రధాని బోరిస్ సోమవారం అనూహ్యంగా తప్పుకోవడంతో ఆయనకు ఒక్కసారిగా లైన్ క్లియరైంది. మూడో అభ్యర్థి పెన్నీ మోర్డంట్ గడువులోపు 100 మంది ఎంపీల మద్దతు కూడగట్టడంలో విఫలమవడంతో

మిగతా 6వ పేజీలో ▶

> బ్రిటన్‌కు స్థిరత్వం, ప్రజలకు విశ్వాసం కలిగించడమే మా ప్రభుత్వ అజెండాలో ప్రధానాంశం. ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న మాట వాస్తవం. సమస్యను చూసి వెనకడుగు వేసే ప్రసక్తే లేదు. పూర్తి జవాబుదారీతనం, పక్కా ప్రొఫెషనలిజంతో కూడిన పాలన ఎలా ఉంటుందో చూపిస్తా. ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కిస్తా.
>
> - బ్రిటన్ ప్రధాని రిషి సునాక్

**రిచ్ రిషి | ఒకే ఒక్కడు | ముళ్లదారే** 6లో

# చిక్కులు చక్కదిద్దేలా

## నిషేధిత భూములపై సర్కారు కీలక ముందడుగు

- '22 ఏ' దరఖాస్తుల పరిష్కారానికి రిటైర్డ్ జడ్జిల నేతృత్వంలో కమిటీలు
- తొలుత విశాఖ, విజయవాడ, తిరుపతిలో ఏర్పాటు
- కమిటీల సిఫారసుల ఆధారంగా నిషేధిత భూములపై కలెక్టర్లకు నిర్ణయాధికారం
- విలువ రూ.50 కోట్లకుపైగా ఉంటే ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలి
- జీవో నెంబర్ 681 విడుదల
- దీర్ఘకాలిక కేసుల పరిష్కారానికి తొలగిన అడ్డంకులు



సాక్షి, అమరావతి: దీర్ఘకాలంగా నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న భూముల (22–ఏ) సమస్యలను పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఏళ్ల తరబడి పెద్దఎత్తున పేరుకుపోయిన 22 ఏ దరఖాస్తులను వేగంగా పరిష్కరించడమే లక్ష్యంగా రిటైర్డ్ జిల్లా జడ్జిల నేతృత్వంలో ప్రత్యేక కమిటీలను నియమించాలని నిర్ణయించింది. తొలుత విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి జిల్లాల్లో ఏర్పాటయ్యే ఈ కమిటీలు 22 ఏ దరఖాస్తులను

మిగతా 2వ పేజీలో ▶

## రేపు నెల్లూరు జిల్లాకు సీఎం వైఎస్ జగన్

2లో

నేలటూరులో జెన్‌కో మూడో యూనిట్‌ను జాతికి అంకితం చేయనున్న సీఎం



పోలవరం దిగువ కాఫర్ డ్యామ్‌లో వేగంగా జరుగుతున్న పనులు

# దిగువ కాఫర్ డ్యామ్ పనులు వేగవంతం

గోదావరిలో తగ్గుముఖం పట్టిన వరద

- ప్రవాహం లేనిచోట దిగువ కాఫర్ డ్యామ్ పనులు ప్రారంభం.. ఇప్పటికే 29 మీటర్ల ఎత్తున పూర్తి
- వరద తగ్గేకొద్దీ మిగతాది చేపట్టేలా ప్రణాళిక
- సంక్రాంతికి కాఫర్ డ్యామ్ పూర్తి చేయడమే లక్ష్యం

2లో

## వాట్సాప్ సేవలకు అంతరాయం

- మెసేజింగ్ యాప్ వాట్సాప్ సేవలు మంగళవారం ప్రపంచవ్యాప్తంగా అంతరాయం తలెత్తింది. దీంతో యూజర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు రెండు గంటల తర్వాత వాట్సాప్ మాతృ సంస్థ మెటా సమస్యను పరిష్కరించి, సేవలను పునరుద్ధరించింది. అంతరాయానికి దారి తీసిన కారణాలను వెల్లడించలేదు. 2021 అక్టోబర్ 5 తర్వాత వాట్సాప్ సర్వీసులు ఈ స్థాయిలో నిల్చిపోవడం ఇదే ప్రథమం.

13లో



## నాణ్యమైన విద్యుత్ కోసమే మీటర్లు



- పంపిణీ నష్టాలు తగ్గి, పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయి
- స్మార్ట్ మీటర్ల వల్ల మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవు
- వాడకం కచ్చితంగా తెలియడంవల్ల సరిపడా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- డీబీటీ వల్ల రైతులకు డిస్కంలను ప్రశ్నించే హక్కు లభిస్తుంది
- రూ.1,700 కోట్లతో ఫీడర్లు బలోపేతం
- కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 48 గంటల్లోపే కొత్తది ఏర్పాటు
- ఈనాడు కథనం అవాస్తవం
- ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, డిస్కంల సీఎండీలు

2లో

## రామోజీది దిగజారుడుతనం

- దమ్ముంటే మీరూ టెండర్లలో పాల్గొనవచ్చు
- అందరికంటే తక్కువ కోట్‌చేస్తే టెండర్ మీకే ఇస్తాం
- ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే 48 గంటల్లో పునరుద్ధరిస్తున్నాం
- కాలిపోతున్న వాటి మరమ్మతులకు రూ.102 కోట్ల ఖర్చు
- మీటర్ల కోసం రూ.1,150 కోట్లు ఖర్చుచేస్తున్నాం
- రాష్ట్ర విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

2లో



## క్లుప్తంగా

### రేపు నెల్లూరు జిల్లాకు సీఎం జగన్



**సాక్షి, అమరావతి/నెల్లూరు(అర్బన్):** సీఎం వైఎస్ జగన్ ఈ నెల 27న శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. ముత్తుకూరు మండలం నేలటూరులో ఏర్పాటు చేసిన ఏపీ జెన్‌కో ప్రాజెక్టు మూడో యూనిట్(800 మెగా వాట్లు)ను సీఎం జగన్ జాతికి అంకితం చేయనున్నారు. గురువారం ఉదయం 9.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయల్దేరి.. 10.55 గంటలకు కృష్ణపట్నం వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 11.10 గంటల నుంచి మధ్యాహ్నం 1.10 మధ్యలో నేలటూరులోని ఏపీ జెన్‌కో మూడో యూనిట్‌ను జాతికి అంకితం చేసి.. అక్కడ జరిగే బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 1.35 గంటలకు నేలటూరు నుంచి బయల్దేరి మధ్యాహ్నం 3.30 గంటలకు తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు.

### 230 మందికి ఎంపీడీవోలుగా పదోన్నతి

**సీనియారిటీ జాబితాలు సిద్ధం**

**సాక్షి, అమరావతి:** ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయాల్లోని ఈవోపీఆర్‌డీలుగా, జిల్లా పరిషత్, మండల పరిషత్ కార్యాలయాల్లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(సూపరింటెండెంట్)లుగా పనిచేస్తున్న 230 మందికి రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించబోతుంది. ఇందుకోసం జిల్లాల వారీగా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ల రాష్ట్ర స్థాయి సీనియారిటీ జాబితా ఇప్పటికే సిద్ధమైంది. బుధవారానికి జోనల్ వారీగా ఈవోపీఆర్‌డీల సీనియారిటీ జాబితాను ఖరారు చేయనున్నారు. ఈ జాబితాల ఆధారంగా వచ్చే 15 రోజుల్లో పదోన్నతుల కమిటీల్లో తుది ఆమోదం తీసుకోనున్నారు. అనంతరం పదోన్నతుల ఉత్తర్వులిస్తారు. రాష్ట్రంలో దాదాపు పాతికేళ్ల తర్వాత వైఎస్ జగన్ ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టులో ఒకేసారి ఎంపీడీవోలకు పెద్ద సంఖ్యలో పదోన్నతులు కల్పించింది. ఆ ఎంపీడీవో పోస్టులను ఈవోపీఆర్‌డీలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లకు పదోన్నతులు కల్పించడం ద్వారా ప్రభుత్వం భర్తీ చేస్తోంది.

### బంగ్లాదేశ్‌లో తీరం దాటిన 'సిత్రాంగ్'

**సాక్షి, విశాఖపట్నం:** సిత్రాంగ్ తుపాను తీరాన్ని దాటింది. సోమవారం రాత్రి 9.30 నుంచి 11.30 గంటల మధ్య బంగ్లాదేశ్‌లోని టింకోనా–సాండ్విప్ మధ్య బరిసాల వద్ద తీరాన్ని దాటినట్టు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. తీరాన్ని దాటే సమయంలో ఈ తుపాను గంటకు 56 కిలోమీటర్ల వేగంతో పయనించిందని, గంటకు 90–100 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచాయని వివరించింది. అనంతరం తుపాను క్రమంగా బలహీన పడుతూ మంగళవారం ఉదయానికి దక్షిణ అస్సాంలో అల్పపీడనంగా మారిందని పేర్కొంది. మంగళవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతం పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. రానున్న రెండు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో పొడి వాతావరణం నెలకొంటుందని, ఆ తర్వాత తేలిక పాటి వర్షాలకు ఆస్కారం ఉంటుంది.

### '27లోగా ఈ-క్రాప్ వివరాలను సవరించాలి'

**సాక్షి, అమరావతి:** రెవెన్యూ, ఉద్యాన శాఖల సహకారంతో ఈ–క్రాప్ ప్రక్రియ పర్యవేక్షణ తనిఖీని, పంట నమోదు వివరాల సవరణలను ఈ నెల 27లోగా పూర్తి చేయాలని అధికారులను వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ చేవూరి హరికిరణ్ ఆదేశించారు. అన్ని జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులతో ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పర్యవేక్షణ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి పాత్ర కీలకమని.. రికార్డులను ధ్రువీకరించాల్సిన బాధ్యత వారిదేనన్నారు. ముసాయిదా జాబితాను ఈ నెల 27 నుంచి 31 వరకు సామాజిక తనిఖీల్లో ఉంచాలని, తుది జాబితాను నవంబర్ 2న ఆర్బీకేల్లో ప్రదర్శించి ఖరీఫ్–2022 ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

### ఇదం జగత్



అయనకు మనం ఇచ్చిన షోకాజ్.. సార్!

# నాణ్యమైన విద్యుత్ కోసమే మీటర్లు

**పంపిణీ నష్టాలు తగ్గి, పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయి**

**ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, డిస్కంల సీఎండీలు**



**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలోని వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడంతోపాటు విద్యుత్ పంపిణీ నష్టాల తగ్గింపు, పారదర్శకత కోసమే స్మార్ట్ మీటర్లను ఏర్పాటుచేస్తున్నట్టు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మజనార్దనరెడ్డి తెలిపారు. 'రైతు చేనుకు కడప మీటరు' పేరుతో ఈనాడు దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనం వాస్తవానికి విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల ప్రాజెక్టులో వాస్తవాలతో వారు మంగళవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఆ వివరాలు..

## రైతుల ప్రయోజనానికే మీటర్లు

ప్రభుత్వ ఉత్తర్వుల (జీవోఎంఎస్ 22, తేదీ 01.09.2020) ప్రకారం పెడుతున్న ఈ మీటర్ల వల్ల మోటార్లు కాలిపోవు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందుతుంది. ఎంత విద్యుత్ వాడుతున్నారో కచ్చితంగా తెలియడం వల్ల సరిపడా కెపాసిటీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టేందుకు అవకాశం ఉంటుంది. లోడ్ సామర్థ్యాన్ని అంచనా వేసుకుంటూ భవిష్యత్ ప్రణాళికను రూపొందించుకోవచ్చు. మీటర్ల ఏర్పాటుకు రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. రైతులు ఎన్ని యూనిట్లు వినియోగిస్తారో.. దానికయ్యే చార్జీలను మొత్తం ప్రభుత్వమే నేరుగా రైతుల ప్రత్యేక ఖాతాల్లో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) కింద జమచేస్తుంది. ఆ డబ్బు నేరుగా రైతుల ద్వారా డిస్కంలకు బదిలీ అవుతుంది. ఈ ప్రక్రియల వల్ల పూర్తి పారదర్శకత ఉంటుంది. కరెంటు సరఫరా కంపెనీలను ప్రశ్నించేహక్కు రైతులకు లభిస్తుంది. కంపెనీలకు కూడా బాధ్యత పెరుగుతుంది.

## తగ్గుతున్న నష్టాలు

ప్రస్తుతం ఐఆర్‌డీఏ మీటర్లను మీటరు బోర్డుపై అమర్చాం. రీడర్లు ఐఆర్‌డీఏ పోర్టు ద్వారా రీడింగ్ తీయాల్సి ఉంది. ఈ వ్యవసాయ సర్వీసులు దూర ప్రాంతాల్లో విస్తరించి ఉండడం వల్ల ఈ పద్ధతిలో రీడింగ్ తీయడం కష్టంగా ఉంది. అందుకే స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ సంస్థలు సంకల్పించాయి. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం జిల్లాలో మీటర్లను ఏర్పాటుచేసిన తర్వాత ప్రయాస్ ఎనర్జీ గ్రూప్ (స్వతంత్ర గ్రూప్) సర్వే రిపోర్టు ప్రకారం నష్టాలు 15–20 శాతానికి తగ్గినట్లు నమోదైంది.

## ఆ టెండర్లు ఎప్పుడో రద్దు

విద్యుత్ సంస్థల్లో గ్రామీణ ప్రాంతాల్లోని త్రీఫేజ్ మీటర్లకు డీబీటీ విధానం కోసం ఐదేళ్ల కాలపరిమితితో టెండర్లను ఆహ్వానించాం. ఆర్‌డీఎస్ఎస్ కింద స్మార్ట్ మీటర్లను గడువులోపు పూర్తిచేస్తే 22.50 శాతం గ్రాంటు రూపంలో సమకూరుతుంది. మొదటి రీడింగ్ తీసిన తర్వాత కాంట్రాక్టర్‌కు ఒక్కో మీటరుకు కెపెక్స్ కింద రూ.1,800 చొప్పున చెల్లిస్తాం. తర్వాత మిగిలిన మొత్తంతోపాటు ఆపరేషన్, మెయింటెనెన్స్, రీడింగ్‌ల కోసం అయ్యే మొత్తాన్ని నెలవారీగా ఐదేళ్ల కాంట్రాక్ట్ కాలవ్యవధిలో ప్రాజెక్టు వ్యయాన్ని ఇస్తాం. వీటికి నెలకు రూ.254 చొప్పున గుత్తేదార్లు టెండర్లను దాఖలు చేశారు. కోవిడ్–19 సమయంలో రూపొందించిన అంచనాల హెచ్చుతగ్గులను పరిశీలించి ప్రభుత్వం టెండర్లు రద్దుచేసింది. ప్రస్తుత ధరల ప్రకారం ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాం. ప్రభుత్వం నుంచి పరిపాలన అనుమతులు లభించిన తర్వాతే కొత్తగా టెండర్లు పిలుస్తాం. ఇటీవల మహారాష్ట్రలోని పట్టణ ప్రాంతాల్లో బెస్ట్ కంపెనీ స్మార్ట్ మీటర్ల కోసం ఆఫర్ చేసిన బిడ్లలో ఒక్కో మీటరుకు నెలకు వ్యయం రూ.200.96 పైసలుగా ఖరారైంది. ఏడున్నర సంవత్సరాల కాలవ్యవధి కలిగిన వీటిలో 80 శాతం సింగిల్‌ఫేజ్ మీటర్లు కాగా 20 శాతం మాత్రమే త్రీఫేజ్ మీటర్లు. కానీ ఏపీలో వ్యవసాయ సర్వీసులన్నీ త్రీఫేజ్ మీటర్లే. ఒక్కో మీటరుకు కేంద్రప్రభుత్వ అంచనా ధర పదేళ్ల కాలపరిమితికి రూ.6 వేలు. దీనికి అనుగుణంగా మీటర్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం.

## వ్యవసాయానికి నిరంతర విద్యుత్

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు పగటిపూట తొమ్మిదిగంటల నిరంతర విద్యుత్తును సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏడువేల మెగావాట్ల సౌరవిద్యుత్తు కొనుగోలుకు సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో ఒప్పందం కుదుర్చుకుంది. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి సుమారు రూ.1,700 కోట్లు ఖర్చుచేసి ఫీడర్లను ఏర్పాటు చేశాం. గడచిన 90 రోజుల్లో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 48 గంటల్లోపే కొత్తవాటిని బిగించాం. రానున్నరోజుల్లో నూటికి నూరుశాతం 48 గంటల్లోపే మార్చేయాలని సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన ఆదేశాలను అమలుచేయడానికి అన్ని రకాల చర్యలను విద్యుత్ పంపిణీ సంస్థలు తీసుకుంటున్నాయి.

**అనుబంధ పరికరాలకు రూ. 14,455 వ్యయం**

మీటరుకు అనుబంధ పరికరాలు, నిర్వహణకు రూ.29 వేలు ఖర్చవుతోందని ఈనాడు దినపత్రిక రాసిన కథనంలో వాస్తవం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 18.58 లక్షల స్మార్ట్ మీటర్ల ద్వారా వ్యవసాయ విద్యుత్ సర్వీసుకు అనుబంధ పరికరాలకు రూ.14,455 వ్యయంతో, మీటరు బాక్స్‌తో పాటు, పీఈసీ వైరు, ఎంసీబీ, కెపాసిటర్, ఎర్తింగ్ పరికరాలు ఏర్పాటు చేస్తాం. ఈ విధంగా ఏర్పాటు చేయడం వల్ల కేంద్ర ప్రభుత్వ పథకం ఆర్‌డీఎస్ఎస్‌లో 60 శాతం గ్రాంటు రూపంలో డిస్కంకు సమకూరుతుంది. అనుబంధ పరికరాలను అమర్చడానికి, అవి పాడైపోకుండా ఉండేందుకు వీలుగా మీటరు బాక్సులను ఏర్పాటు చేస్తాం. ఎంసీబీ ద్వారా ఓవర్ లోడ్ ప్రొటెక్షన్ ఉంటుంది. తద్వారా విద్యుత్ ప్రమాదాలను తగ్గించడంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్స్‌ను కూడా తగ్గించవచ్చు. వ్యవసాయ పంపుసెట్లకు రక్షణ లభిస్తుంది. ప్రస్తుతం ఏటా సగటున 45,098 వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. వాటి మరమ్మతుల కోసం ఏటా రూ.102 కోట్ల వ్యయాన్ని సంస్థలు భరించాల్సి వస్తోంది. కెపాసిటర్లను అమర్చడం ద్వారా నాణ్యమైన వోల్టేజ్‌తో రైతులకు విద్యుత్ సరఫరా చేయవచ్చు.

# రామోజీది దిగజారుడుతనం

- దమ్ముంటే మీరూ టెండర్లలో పాల్గొనవచ్చు
- విలేకరుల సమావేశంలో రాష్ట్ర విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి



**సాక్షి ప్రతినిధి, తిరుపతి:** రామోజీరావు అసత్య కథనాలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. ఈనాడు పత్రికలో సోమవారం 'రైతు చేనుకు.. కడప మీటరు' శీర్షికతో మరోసారి స్మార్ట్ మీటర్లపై వక్రీకరణ కథనాన్ని వండివార్చారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. తిరుపతిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కో స్మార్ట్ మీటర్‌కు రూ.35 వేల వంతున రాష్ట్రంలోని మూడు డిస్కంల పరిధిలో 18.61 లక్షల స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు రూ.6,173 కోట్లు వెచ్చించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని, ఇదో భారీ స్కామ్ అంటూ గతంలో రద్దుచేసిన టెండర్లపై ఈనాడు తప్పుడు రాతలు రాసిందని మండిపడ్డారు. కోవిడ్ సమయంలో రూపొందించిన ఈ టెండర్ అంచనాలను సమీక్షించుకుని, వాటిలో హెచ్చుతగ్గులున్నాయని గ్రహించి గతంలోనే వాటిని రద్దుచేశామని స్పష్టం చేశారు. ఈ విషయం ఈనాడు రామోజీరావుకు కూడా తెలుసని, అయినా రైతుల్లో గందరగోళం సృష్టించాలనే ఇటువంటి కథనాలు రాస్తున్నారని చెప్పారు. ప్రభుత్వంపై వ్యతిరేకత తీసుకురావాలనే తపనలో భాగంగా రోజుకో అబద్ధాన్ని స్టోరీగా రాస్తున్నారని, అందులో భాగంగానే ఈ కథనం కూడా రాశారని ధ్వజమెత్తారు.

## మీటర్ల ఖర్చు రూ.1,150 కోట్లు

స్మార్ట్ మీటర్ల కోసం కొత్త అంచనాల మేరకు ఒక్కో మీటరు రూ.6 వేల వంతున మొత్తం రూ.1,150 కోట్లు మాత్రమే ఖర్చుచేస్తున్నట్టు చెప్పారు. స్మార్ట్ మీటర్‌కు అనుబంధ పరికరాల నిర్వహణకు రూ.29 వేలు ఖర్చవుతుందంటూ ఈనాడు రాసిన రాతలో ఎటువంటి నిజం లేదన్నారు. బాబు చేయలేకపోయినది వైఎస్ జగన్ హయాంలో జరుగుతుందంటే రామోజీ జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు. రామోజీరావుకు వయసు మీరేకొద్దీ కుట్రలు, కుతంత్రాలతో ప్రభుత్వంపై, సీఎం వైఎస్ జగన్‌పై అదేపనిగా తప్పుడు రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా , పారదర్శకత, జవాబుదారీతనం కోసమే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎంత విద్యుత్ వాడుతున్నారో కచ్చితంగా తెలియడంవల్ల, కెపాసిటీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. మీటర్ల ఏర్పాటు వల్ల రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. వ్యవసాయానికి వినియోగించే విద్యుత్ చార్జీలను డీబీటీ ద్వారా నేరుగా రైతు ఖాతాలకే జమచేయాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయించారన్నారు. దీనివల్ల రైతులు నేరుగా తమ ఖాతాల్లో జమ అయిన డబ్బును డిస్కంలకు చెల్లిస్తారన్నారు. అలా చేయటం వల్ల రైతులకు డిస్కంలను అడిగే హక్కు లభిస్తుందని, డిస్కంలు కూడా బాధ్యతగా వ్యవహరించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్టుగా శ్రీకాకుళం జిల్లాలో 18 వేల మీటర్లు రైతుల మోటర్లకు బిగించామని, మంచి ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. ఆ మీటర్ల వల్ల 30–36 శాతం విద్యుత్ ఆదా అవుతోందన్నారు. రైతుల మోటార్లకు మీటర్లు బిగిస్తే ఉరితాళ్లు అంటూ టీడీపీ అసత్య ప్రచారం చేసిందని తెలిపారు. గతంలో నాణ్యమైన కరెంటు ఇవ్వనందునే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఏటా 45 వేలకుపైగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, వాటి రిపేర్ల కోసమే ఏడాదికి రూ.102 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే 48 గంటల్లో పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు మరిన్ని ట్రాన్స్‌ఫార్మర్లను సిద్ధంగా ఉంచామన్నారు. అదే టీడీపీ హయాంలో అయితే కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ని బిగించాలంటే సంవత్సరం పట్టేదని గుర్తుచేశారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్‌కి కూడా రైతులు చందాలు వేసుకుని డబ్బులు చెల్లిస్తేనే ఇచ్చేవారన్నారు. తమ ప్రభుత్వంలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ప్రత్యేక కెపాసిటర్లు బిగిస్తున్నట్లు తెలిపారు. వీటి వల్ల లో, హై ఓల్టేజి సమస్య లేదన్నారు. వ్యవసాయానికి పగటిపూటే కరెంట్ అందిస్తున్నా.. ఈనాడు అసత్య కథనాలు రాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## రామోజీకి మంత్రి సవాల్..

స్మార్ట్ మీటర్లకు సంబంధించిన టెండర్లను మరో వారం పొడిగిస్తున్నామని మంత్రి ప్రకటించారు. జ్యుడిషియల్ ప్రివ్యూ తర్వాత మీ పత్రికలోనే తేదీలను కూడా ప్రకటిస్తామని, దమ్ముంటే రామోజీరావు నేరుగా ఈ టెండర్‌లో పాల్గొనాలని సవాల్ విసురుతున్నానన్నారు. వారం గడువు ఇస్తున్నామని.. రామోజీరావు, లేదా ఆయన బలపరుస్తున్న చంద్రబాబు, అనుచరులు ఈ టెండర్‌లో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. టెండర్లలో పాల్గొని తక్కువ ధరకు బిడ్ వేస్తే మీకే టెండర్ సొంతమవుతుందన్నారు. దమ్ముంటే తన సవాల్‌ను స్వీకరించాలని కోరారు. 95% రైతులు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. రైతులకు మేలు చేసే ప్రభుత్వం తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అని స్పష్టం చేశారు. చంద్రబాబు పాలనలో వ్యవసాయం దండగ అన్న సంస్కృతి వాళ్లదని, రైతులు ఆత్మహత్య చేసుకుంటే.. మానసిక రుగ్మతతో చేసుకున్నారని టీడీపీ వారు హేళన చేసేవారని గుర్తుచేశారు. తమ పాలనలో అది లేదని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ వినూత్నంగా, పారదర్శకంగా రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నారని తెలిపారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టామని, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపట్ల అన్నదాతలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇవన్నీ రామోజీకి నచ్చటం లేదని, ఆ అక్కసుతో అసత్య కథనాలు రాస్తున్నారని మండిపడ్డారు. రైతుల ముసుగులో టీడీపీ దుష్ప్రచారం చేస్తోందన్నారు. మంచిపనిని కూడా ఓర్వలేకే రైతు సంఘాల ముసుగులో టీడీపీ నాయకులు ఉరితాళ్లంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం జగన్ పరిపాలనలో అందుతున్నట్టు గతంలో ఎప్పుడైనా అందిందా అని ప్రశ్నించారు. ఇలాంటి అంశాలను మరుగునపరచడమే కాకుండా, నాలుగేళ్లుగా పడుతున్న వర్షాలు కూడా చంద్రబాబుకు, రామోజీకి చాలా బాధ కలిగిస్తున్నాయని అందుకే ఈ తప్పుడు రాతలు రాస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలపై కోర్టులో పోరాటం చేస్తున్నామని విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు.

# దిగువ కాఫర్ డ్యామ్ పనులు వేగవంతం

**గోదావరిలో తగ్గుముఖం పట్టిన వరద**



పోలవరం దిగువ కాఫర్ డ్యామ్‌లో 0 నుంచి 203 మీటర్ల మధ్య పనులు వేగంగా చేస్తున్న దృశ్యం


**సాక్షి, అమరావతి:** గోదావరి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో పోలవరం దిగువ కాఫర్ డ్యామ్ పనులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రవాహం లేని ప్రాంతంలో దిగువ కాఫర్ డ్యామ్ పనులను అధికారులు చేపట్టారు. మంగళవారం పోలవరం వద్ద గోదావరిలో 2.50 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతున్నప్పటికీ దిగువ కాఫర్ డ్యామ్‌లో 0 నుంచి 203 మీటర్ల మధ్య 29 మీటర్ల ఎత్తుకు పనులు చేశారు. వరద తగ్గే కొద్దీ ప్రవాహం నుంచి బయటపడిన ప్రాంతంలో మిగిలిన 473 మీటర్ల పొడవున కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సంక్రాంతిలోగా దిగువ కాఫర్ డ్యామ్ పూర్తి స్థాయిలో అంటే 30.5 మీటర్ల ఎత్తుకు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించడంతో ఆమేరకు చర్యలు చేపట్టారు. గోదావరి వరద ఉద్ధృతికి కోతకు గురైన ఈసీఆర్ఎఫ్ (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో రెండు చోట్ల, దిగువ కాఫర్ డ్యామ్‌లో 0 నుంచి 680 మీటర్ల మధ్య అగాధాలు ఏర్పడ్డాయి. దిగువ కాఫర్ డ్యామ్ కోతకు గురైన ప్రాంతం మినహా మిగిలిన 932 మీటర్లను జూలై నాటికే 30.5 మీటర్ల ఎత్తుకు పూర్తి చేశారు.

**నవంబర్‌లో కనిష్ట స్థాయికి వరద**

అగాధాలు పూడ్చడం, కాఫర్ డ్యామ్ పనులు చేపట్టే విధానాన్ని ఖరారు చేయడంతో డీడీఆర్పీ(డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్), సీడబ్ల్యూసీ(కేంద్ర జలసంఘం) జాప్యం చేయడంతో జూలై ఆఖరు నాటికి పూర్తి చేయలేకపోయారు. జూలై రెండో వారంలోనే వరద రావడంతో కోతకు గురైన ప్రాంతంలో దిగువ కాఫర్ డ్యామ్‌ను వరద నీరు ముంచెత్తింది. దీంతో పనులు చేపట్టలేని పరిస్థితి. ఇటీవల వరద తగ్గడంతో ప్రవాహం లేని ప్రాంతంలో 0 నుంచి 203 మీటర్ల మధ్య దిగువ కాఫర్ డ్యామ్ పనులను చేపట్టి ఇప్పటికే 29 మీటర్ల ఎత్తుకు పూర్తి చేశారు. నవంబర్ రెండో వారానికి వరద కనిష్ట స్థాయికి చేరుతుంది. అప్పుడు దిగువ కాఫర్ డ్యామ్ ప్రాంతంలో వరద ఉండదు. ఆ సమయంలో మిగతా పనులు చేపట్టి కోతకు గురైన ప్రాంతంలో 680 మీటర్ల పొడవున 30.5 మీటర్ల ఎత్తుకు దిగువ కాఫర్ డ్యామ్‌ను సంక్రాంతికి పూర్తి చేయనున్నారు. అప్పుడు 1,612 మీటర్ల పొడవున దిగువ కాఫర్ డ్యామ్ పూర్తవుతుంది. దిగువ కాఫర్ డ్యామ్ పూర్తయ్యాక ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్యన సీడబ్ల్యూసీ ఖరారు చేసే డిజైన్ల మేరకు ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు చేపట్టనున్నారు. గోదావరి వరదల్లోనూ ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు చేపట్టి నిర్విఘ్నంగా కొనసాగించి ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు.

# చిక్కులు చక్కదిద్దేలా

▶ మొదటి పేజీ తరువాయి



పరిశీలించి క్లియరెన్స్‌కు జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన సిఫారసులు చేస్తాయి. వాటిని బట్టి కలెక్టర్లు ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 22–ఏ భూముల వ్యవహారం సంక్లిష్టంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

**కలెక్టర్లకు అధికారాలిచ్చినా..**

ఎక్స్ సర్వీస్‌మెన్, రాజకీయ బాధితులు, స్వాతంత్య్ర సమరయోధులకు ప్రభుత్వం కేటాయించిన భూములతోపాటు 1954కి ముందు పేదలకు కేటాయించిన భూములు, పలు రకాల కారణాలతో మరికొన్ని భూములను 1908 రిజిస్ట్రేషన్ల చట్టం సెక్షన్ 22 ఏ (నిషేధిత జాబితా) కింద చేర్చారు. ఈ జాబితాలో ఉన్న భూములను రిజిస్ట్రేషన్ల శాఖ రిజిస్టర్ చేయదు. దీంతో వీటి క్రయవిక్రయాలు సాధ్యం కావడంలేదు. నిషేధిత జాబితా నుంచి తమ భూములను తొలగించాలని భూ యజమానులు చేసుకుంటున్న దరఖాస్తులు రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో పేరుకుపోతున్నాయి. చిక్కులు, వివాదాల కారణంగా రెవెన్యూ యంత్రాంగం వాటిపై నిర్ణయం తీసుకునేందుకు వెనుకాడుతోంది. ఈ నేపథ్యంలో కొద్ది నెలల క్రితం వీటిపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని ప్రభుత్వం కలెక్టర్లకు అప్పగించింది. ఇందుకోసం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి కలెక్టర్లకు అధికారాలిచ్చినా 22 ఏ దరఖాస్తుల పరిష్కారంలో సరైన పురోగతి లేదని ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్వహించిన సమీక్షలో ప్రస్తావనకు వచ్చింది. వీటికి సంబంధించి ప్రభుత్వం, సీసీఎల్ఏకి అందే విజ్ఞప్తుల పరిష్కారం ఆశించిన స్థాయిలో జరగడం లేదని గుర్తించారు. 22–ఏ దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు రిటైర్డ్ జిల్లా జడ్జిల నేతృత్వంలో ప్రత్యేక కమిటీలను నియమించాలని నిర్ణయించారు. తొలుత విశాఖపట్నం (విశాఖ, అనకాపల్లి జిల్లాలకు), విజయవాడ (ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాలకు), తిరుపతి (తిరుపతి, నెల్లూరు జిల్లాలకు) ఈ కమిటీలు ఏర్పాటవుతాయి. రిటైర్డ్ జిల్లా జడ్జి, రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, సర్వే, భూమి రికార్డుల శాఖ రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్, సంబంధిత జిల్లా జాయింట్ కలెక్టర్, సబ్‌కలెక్టర్/ఆర్‌డీవో, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రార్ ఇందులో సభ్యులుగా ఉంటారు. రిటైర్డ్ జడ్జి, ఇతర రిటైర్డ్ అధికారులను ప్రభుత్వమే నియమించి తగిన వేతనాలు చెల్లిస్తుంది. ఈమేరకు కమిటీల ఏర్పాటు, విధివిధానాలపై ప్రభుత్వం జీవో నెంబర్ 681 జారీ చేసింది.

**కమిటీలు ఏం చేస్తాయంటే...**

ఈ కమిటీలు 22–ఏకి సంబంధించిన ప్రతి కేసుకు సమయం నిర్దేశించి సంబంధిత అధికారుల సమక్షంలో రికార్డులను పరిశీలిస్తాయి. అన్ని అంశాలు పరిశీలించి దానిపై జిల్లా కలెక్టర్‌కు కచ్చితమైన సిఫారసు చేయాలి. కలెక్టర్ సంబంధిత దరఖాస్తును సాధారణ ప్రక్రియలో ఆమోదించేలా ఆ సిఫారసు ఉండాలి. ఒకవేళ దానిపై ఏదైనా అభ్యంతరం ఉంటే ప్రభుత్వానికి పూర్తి వివరాలతో కలెక్టర్ నివేదిక పంపాలి. ఈ కేసుల్లో రూ.50 కోట్లకు పైగా విలువైన భూములపై తీసుకున్న నిర్ణయాన్ని సీసీఎల్ఏ ద్వారా ప్రభుత్వానికి తెలియచేయాలి. అయితే అలాంటి కేసుల్లో సైతం కలెక్టర్ ప్రభుత్వ నిర్ణయం గురించి వేచి చూడాల్సిన అవసరం లేదు. కేవలం ఆ భూములపై జరిగిన నిర్ణయాన్ని ప్రభుత్వానికి తెలియచేసి నిర్ణయం తీసుకోవాలి. 1908 రిజిస్ట్రేషన్ల చట్టం సెక్షన్ 22–ఏ పరిధిలోకి వచ్చే అన్ని కేసులు ఈ కమిటీల పరిధిలోకి వస్తాయి. ఎక్స్ సర్వీస్‌మెన్, స్వాతంత్య్ర సమరయోధులు, రాజకీయ బాధితులకు కేటాయించిన భూములతోపాటు చుక్కల భూములు, మ్యుటేషన్లు కూడా ఈ కమిటీలు పరిశీలించవచ్చు. లక్షల సంఖ్యలో పేరుకుపోయిన 22–ఏ కేసుల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కమిటీలను ఏర్పాటు చేసింది. లీగల్, రెవెన్యూ అంశాల కారణంగా పెద్ద ఎత్తున కేసులు పెండింగ్‌లో ఉండడంతో నిపుణులైన రిటైర్డ్ అధికారులు, ప్రస్తుత అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి పరిష్కారానికి నడుం బిగించింది.

### కొత్తగా చింతూరు రెవెన్యూ డివిజన్

- డివిజన్ కావాలని సీఎం జగన్‌కు విన్నవించిన స్థానికులు
- కొత్త డివిజన్ ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ జారీ

**సాక్షి, అమరావతి:** పాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త రెవెన్యూ డివిజన్‌కు శ్రీకారం చుట్టింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో చింతూరు కేంద్రంగా ఈ డివిజన్‌ను ఏర్పాటు చేస్తూ మంగళవారం తుది నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ జిల్లాలో ప్రస్తుతం 11 మండలాల చొప్పున పాడేరు, రంపచోడవరం డివిజన్లు ఉన్నాయి. ఇప్పుడు రంపచోడవరం డివిజన్ నుంచి ఎటపాక, చింతూరు, కూనవరం, వీఆర్‌పురం మండలాలను విడదీశారు. ఈ 4 మండలాలకు ప్రత్యేకంగా చింతూరు డివిజన్ ఏర్పాటు చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసినట్లయింది. గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం వైఎస్ జగన్ పర్యటించినప్పుడు చింతూరు ప్రాంత ప్రజలు తమకు ప్రత్యేక డివిజన్ ఏర్పాటు చేయాలని ఆయనకు విన్నవించారు. వాస్తవానికి ఎటపాక, చింతూరు, కూనవరం, వీఆర్‌పురం మండలాలు రాష్ట్ర విభజనకు ముందు ఖమ్మం జిల్లా భద్రాచలం డివిజన్‌లో ఉండేవి. విభజన తర్వాత ఈ నాలుగు మండలాలు ఏపీకి రావడంతో ఎటపాక కేంద్రంగా డివిజన్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల పునర్వ్యవస్థీకరణలో ఎటపాక డివిజన్‌ను రద్దు చేసి ఈ నాలుగు మండలాలను రంపచోడవరం డివిజన్‌లో కలిపారు. పోలవరం ముంపు మండలాలు కావడంతో తాము ఇబ్బందులు పడుతున్నట్టు ప్రజలు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. భూసేకరణ, పరిహారం, పునరావాసంతోపాటు రెవెన్యూ, భూముల సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. దూరంగా ఉన్న రంపచోడవరం వెళ్లేందుకు తమకు ఇబ్బందిగా ఉందని సీఎం వైఎస్ జగన్‌కు నివేదించారు. దీంతో ఆయన వెంటనే కొత్త రెవెన్యూ డివిజన్‌కు ఆమోదం తెలిపి ఏర్పాటు చేయించారు. మంగళవారం నుంచి చింతూరు రెవెన్యూ డివిజన్ ఏర్పడింది.

### 'నిషేధం'లోనూ పేలిన బాణసంచా

**ఢిల్లీలో పెరిగిన వాయు కాలుష్యం.. గతేడాదితో పోలిస్తే తక్కువే**

**సాక్షి, న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం పెరుగుతుందనే ఆందోళనతో బాణసంచాపై నిషేధం విధించినా.. దీపావళి రోజు అర్ధరాత్రి వరకు నగరంలో టపాసుల మోతలు హోరెత్తాయి. ఢిల్లీలో వాయు కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యావరణ విభాగాల నేతృత్వంలో బాణసంచా కాల్చవద్దంటూ ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించాయి. బాణసంచా కాల్చిన వారికి జరిమానాతో పాటు 6 నెలల వరకు జైలు శిక్ష తప్పదంటూ ప్రచారం చేశాయి. అయినా దీపావళి రాత్రి ప్రజలు నిబంధనలను పట్టించుకోలేదు. భారీగా బాణసంచా కాల్చారు. సిస్టమ్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రీసెర్చ్ ప్రకారం మంగళవారం ఉదయం ఢిల్లీలో గాలి నాణ్యత తగ్గిందని తేలింది. దేశ రాజధాని ప్రాంతంలోని అనేక చోట్ల పీఎం 2.5 స్థాయి 400 దాటింది. ఇక సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రకారం సోమవారం రాత్రి 10 గంటలకు ఐటీవో ప్రాంతంలో పీఎం 2.5 స్థాయి 458 కాగా, మంగళవారం ఉదయం 339గా నమోదైంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దీపావళి సందర్భంగా వాయు కాలుష్య తీవ్రత కాస్త తక్కువగానే ఉందని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది. గతేడాది దీపావళి మరుసటి రోజు ఉదయం 451గా నమోదైందని వెల్లడించింది.

## శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా దీపావళి ఆస్థానం



దీపావళి ఆస్థానంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో ధర్మారెడ్డి

**తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం ఉదయం దీపావళి ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. అర్చకులు, తిరుమల జీయంగార్లు, టీటీడీ ఉన్నతాధికారుల సమక్షంలో బంగారువాకిలి చెంత ఆగమోక్తంగా ఆస్థాన వేడుకను నిర్వహించారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు. శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు, కృష్ణశేషాచల దీక్షితులు మాట్లాడుతూ స్వామివారి మూలమూర్తికి, ఉత్సవమూర్తులకు నూతన పట్టువస్త్రాలు అలంకరించినట్లు తెలిపారు. బంగారువాకిలి ముందు ఉన్న ఘంటా మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు, శ్రీవిష్వక్సేనులవారి ఉత్సవమూర్తులను గరుడాళ్వారు సన్నిధిలో అభిముఖంగా ఉంచి ఆస్థానం నిర్వహించినట్లు వివరించారు.

**నేడు వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా విడుదల**

వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా నవంబర్ నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను ఈ నెల 26న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది.

# కళాసంబరం

## తెలుగు సంస్కృతికి అద్దం పట్టేలా 'జగనన్న సాంస్కృతిక సంబరాలు'

- దరఖాస్తుకు గడువు నవంబర్ 10
- జిల్లాల వారీగా ఆడిషన్స్, రీజనల్ పోటీలు
- డిసెంబర్‌లో రాష్ట్రస్థాయి వేదికపై ప్రదర్శనలు
- 40 వేల మందికిపైగా కళాకారులు హాజరవుతారని అంచనా

**సాక్షి, అమరావతి:** తెలుగు సంస్కృతికి అద్దం పట్టేలా 'జగనన్న సాంస్కృతిక సంబరాలు' పేరుతో రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు సాంస్కృతిక శాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 40 వేలమందికి పైగా కళాకారుల ప్రదర్శనలకు వేదికలు సిద్ధం చేస్తోంది. వెయ్యిమందికి పైగా కళాకారులతో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాచీన కళావైభవం చాటేలా ప్రణాళికను రూపొందించింది. ప్రధానంగా కూచిపూడి, కొమ్ముకోయ, థింసా, తప్పెటగుళ్లు, గరగలు, పగటివేషాలు, బుర్రకథలు, ఆర్కెస్ట్రా (జానపద, సంప్రదాయ, గిరిజన) వంటి కళారూపాలను ఆవిష్కరించనుంది. సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజును పురస్కరించుకుని డిసెంబర్ 19, 20 తేదీల్లో అట్టహాసంగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనుంది.

**అందుబాటులో దరఖాస్తులు...**

కళాకారులు, కళాబృందాలు నవంబర్ 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. సాంస్కృతిక శాఖ https://culture.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులను పూర్తిచేసి పంపవచ్చు. విజయవాడలోని రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి కార్యాలయంతో పాటు విజయనగరం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలుల్లోని ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలు, పాఠశాలల్లో నేరుగా దరఖాస్తులు అందజేయవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను apcultural-competitions@gmail.comకు మెయిల్ చేసే వెసులుబాటు కూడా కల్పించారు.

**ఆడిషన్స్, రీజనల్ పోటీలు ఇలా...**

- నవంబర్ 19, 20, 21 తేదీల్లో తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్, సత్యసాయి, అనంతపురం, నంద్యాల, కర్నూలు జిల్లాల వారికి.
- నవంబర్ 24, 25, 26 తేదీల్లో గుంటూరు వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో ప్రకాశం, పల్నాడు, బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల వారికి.
- నవంబర్ 29, 30, డిసెంబర్ 1 తేదీల్లో రాజమహేంద్రవరంలోని వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల వారికి.
- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో విశాఖపట్నంలోని ఉడా చిల్డ్రన్స్ థియేటర్‌లో అనకాపల్లి, విశాఖ, అల్లూరి సీతారామరాజు, మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల వారికి.



**కళలకు ప్రోత్సాహం..**

రాష్ట్రంలో ఎంతో ఘనమైన ప్రాచీన సంస్కృతి ఉంది. దాన్ని కాపాడుకోవడంతో పాటు భావితరాలకు చాటిచెప్పేలా ప్రభుత్వం కృషిచేస్తోంది. కళాకారులను ప్రోత్సహించేలా రాష్ట్రస్థాయిలో సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నాం. ఈ పోటీల్లో కళాకారులందరినీ భాగస్వాములను చేసేలా ప్రత్యేక పోస్టర్లతో విస్తృత ప్రచారం కల్పించనున్నాం. గెలుపొందిన కళాకారులు, కళాబృందాలకు భారీ బహుమతులు ఇవ్వనున్నాం.

– ఆర్కే రోజా, పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి

# 29న తిరుపతిలో మహాప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న రచయిత, సాహితీవేత్త డాక్టర్ శైలకుమార్

- మూడు రాజధానులకు మద్దతుగా అందరూ పాల్గొనాలి
- మీడియా సమావేశంలో మేధావుల పిలుపు

**తిరుపతి కల్చరల్:** రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధిని కాంక్షిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయానికి మద్దతుగా తిరుపతిలో నిర్వహించనున్న మహాప్రదర్శనలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పలువురు మేధావులు పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఈ నెల 29న చేపట్టిన ఈ మహాప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. తిరుపతిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రచయిత, సప్తగిరి మాసపత్రిక విశ్రాంత సంపాదకుడు డాక్టర్ శైలకుమార్, రాయలసీమ మేధావుల ఫోరం నేత పురుషోత్తంరెడ్డి, చరిత్ర పరిశోధకుడు, విశ్రాంత ప్రొఫెసర్ సుబ్రమణ్యంరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ రాఘవశర్మ, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ ఫరీద్, న్యాయవాదులు విజయకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. రాయలసీమ వాసులు 85 ఏళ్లుగా మోసపోతున్నారని చెప్పారు. మద్రాసు రాజధాని నుంచి నేటి అమరావతి నిర్ణయం వరకు తరతరాలుగా దగాపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భవిష్యత్‌లో విభజన వివాదం తలెత్తకుండా వికేంద్రీకరణ నిర్ణయం తీసుకోవడం సముచితమని చెప్పారు. కొందరు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మరోసారి రాయలసీమను దగాచేసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తరతరాలుగా అన్యాయానికి గురవుతున్న రాయలసీమ వాసులు మేల్కొని చైతన్యవంతులై నడుంబిగించకపోతే మరింత అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. అందువల్ల మహాప్రదర్శనలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# శ్రీవారి పరకామణిలో రూ.94 వేల చోరీ

- బ్యాంక్ కాంట్రాక్ట్ ఉద్యోగి నిర్వాకం.. అరెస్ట్

**తిరుమల:** శ్రీవారి పరకామణిలో నోట్లు లెక్కించే ఓ బ్యాంక్ కాంట్రాక్ట్ ఉద్యోగి రూ.94 వేలు చోరీకి పాల్పడిన ఘటనపై తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ పీఎస్ ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాలు... శ్రీవారి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించేందుకు రెండు బ్యాంకులకు చెందిన ఉమ్మడి కాంట్రాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో 50 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తుంటారు. వీరు రోజుకు 25 మంది చొప్పున షిఫ్ట్ పద్ధతిలో రోజు మార్చి రోజు పరకామణిలో నగదు లెక్కింపులో పాల్గొంటారు. ఆదివారం పరకామణి లెక్కింపులో చంద్రగిరికి చెందిన దిలీప్ అనే బ్యాంక్ కాంట్రాక్ట్ ఉద్యోగి పాల్గొన్నారు. విధులు ముగించుకుని వెళ్లే సమయంలో అతడిని టీటీడీ విజిలెన్స్ సిబ్బంది తనిఖీ చేశారు. అతడి మాస్క్‌లో 47 రూ.2 వేల నోట్లను గుర్తించారు. అనంతరం అదుపులోకి తీసుకుని విచారించి తిరుమల వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి సోమవారం కోర్టు ముందు హాజరుపరిచగా, రిమాండ్ విధించారు.

## ఎయిర్‌పోర్ట్, గిరిజన వర్సిటీలకు

# త్వరలో శంకుస్థాపన

- ప్రధానితో చేయించేందుకు సన్నాహాలు
- 'అమరావతి పాదయాత్ర' ఫేక్ అని తేలిపోయింది
- మంత్రి బొత్స సత్యనారాయణ



**సాక్షి ప్రతినిధి, విజయనగరం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. వాటికి భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం చెల్లింపు తదితర అంశాలపై మంగళవారం ఆయన విజయనగరం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విమానాశ్రయం, గిరిజన విశ్వవిద్యాలయం శంకుస్థాపనలను వచ్చే నెలలో ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా చేయించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

**అది ఫేక్ యాత్ర అని తేలిపోయింది**

అమరావతి రైతుల పేరుతో చేపట్టిన పాదయాత్ర ఫేక్ అని తేలిపోయిందని, అందుకే ఆగిపోయిందని మంత్రి బొత్స వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకూ రైతుల ముసుగులో టీడీపీ నాయకులే యాత్ర చేశారని విమర్శించారు. 600 మంది వరకూ రైతులు పాదయాత్రలో పాల్గొనడానికి హైకోర్టు అనుమతి ఇచ్చినప్పటికీ వారిలో 60 మంది దగ్గర కూడా గుర్తింపు కార్డులు లేవన్నారు. మూడు రాజధానులపై ప్రజాభిప్రాయం లక్షలాది మందితో విజయవంతమైన విశాఖ గర్జనతో తేటతెల్లమైందని వివరించారు. మూడు రాజధానులు తథ్యమని, అందుకు రోడ్ మ్యాప్ తయారవుతోందని వెల్లడించారు. విశాఖ రాజధాని అయితే ఉత్తరాంధ్ర బాగుపడుతుందన్నారు. అందుకే, ఈ ప్రక్రియ సజావుగా సాగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య పాల్గొన్నారు.

# ఏపీ విద్యా విధానానికి దేశవ్యాప్తంగా ప్రశంసలు

- ఏపీ బాటలో కేంద్రం, ఇతర రాష్ట్రాలు
- ఇప్పటికే 'నాడు- నేడు' అమలు చేస్తున్న కేంద్రం
- యూపీలోనూ ఏపీ విద్యా విధానం అమలు
- వైఎస్సార్‌సీపీ నేత, ఎంపీ విజయసాయి రెడ్డి



**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాలల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ప్రశంసలందుకుంటున్నాయని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వంతో పాటు పలు రాష్ట్ర ప్రభుత్వాలు స్ఫూర్తిగా తీసుకుని, ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్నాయని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 'నాడు - నేడు' పనులు చేపట్టిందని, ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తోందని తెలిపారు. తాజాగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కూడా ఆ రాష్ట్రంలోని 75 జిల్లాల్లో 15 వేల పాఠశాలల్లో నాడు - నేడు పథకం అమలుకు ప్రణాళిక రూపొందించిందని తెలిపారు.

**దూర ప్రాంత విద్యార్థులకు రవాణా చార్జీలు**

విద్యార్థులు ఎవరూ చదువు మానేయకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తోందని, జగనన్న అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా కానుక వంటి కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు. వీటితో పాటు స్కూళ్లకు దూర ప్రాంతాల్లో నివసించే పిల్లలు నడిచి వెళ్లాల్సిన అవసరం లేకుండా రవాణా చార్జీలను సైతం చెల్లించనుందని తెలిపారు. రవాణా చార్జీల కింద ఒక్కో విద్యార్థికి నెలకు రూ.600 చొప్పున 10 నెలలు చెల్లిస్తుందన్నారు. దీనివల్ల 40 వేల మందికి పైగా విద్యార్థులకు లబ్ధి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం రూ.24.25 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువ చేయాలన్న సంకల్పంతో రూపొందించిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ట్రయల్ రన్ ప్రజల మన్ననలు అందుకుందని ఆయన తెలిపారు.

# 28, 29 తేదీల్లో జగనన్న విదేశీ విద్యాదీవెన కౌన్సెలింగ్

**సాక్షి, అమరావతి:** జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి దరఖాస్తు చేసిన కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజికవర్గాలకు చెందిన విద్యార్థులు/తల్లిదండ్రులకు ఈ నెల 28, 29 తేదీల్లో గుంటూరు జిల్లా తాడేపల్లిలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. భారత్‌లో ఉన్న విద్యార్థులకు ఈ నెల 28న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని రాష్ట్ర కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది ఆగస్టు తర్వాత విదేశాలకు వెళ్లిన విద్యార్థులను ఈ పథకం కింద ఎంపిక చేసేందుకు వారి తల్లిదండ్రులకు 29న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వెల్లడించింది. దరఖాస్తు చేసిన విద్యార్థులు తమ విద్యార్హతలు, ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లు, అటెస్ట్ చేసిన జిరాక్స్ కాపీలతో తాడేపల్లిలోని రాష్ట్ర కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపింది.



# 27న బీసీల ఆత్మగౌరవ సభ

## 10 మంది బీసీ మంత్రులకు ఘన సన్మానం: ఎంపీ ఆర్.కృష్ణయ్య



**సాక్షి, అమరావతి/ ముషీరాబాద్:** అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, జనగణనలో కులగణన చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆయన హైదరాబాద్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 27వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బీసీల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 10 మంది బీసీ మంత్రులను సన్మానించనున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక న్యాయం అమలవుతుందని చెప్పారు.

**బీసీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి: మారేష్**

ఈ నెల 27వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న బీసీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఏపీ బీసీ సంఘం నేతలు పిలుపునిచ్చారు. విజయవాడలోని బీసీ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు ఎన్.మారేష్ మాట్లాడుతూ ఈ సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, విశిష్ట అతిథిగా శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం హాజరవుతారని తెలిపారు. బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణి మాట్లాడుతూ బీసీ మహిళలు పెద్ద ఎత్తున బీసీల ఆత్మగౌరవ సభకు విచ్చేయాలని కోరారు. సమావేశంలో బీసీ నేతలు దేరంగుల నాని, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఒకే అంశంపై రెండు పిటిషన్లు.. హైకోర్టు ఆగ్రహం

- ఖర్చుల కింద రూ.లక్ష చెల్లించాలని విశాఖ వాసికి ఆదేశం
- క్రిమినల్ కోర్టు ధిక్కార కేసు నమోదుకు ఆదేశం
- ఇది కోర్టు ప్రక్రియ దుర్వినియోగమేనన్న న్యాయమూర్తి



**సాక్షి, అమరావతి:** మొదట ఓ పిటిషన్ వేసి, ఆ విషయాన్ని దాచి పెట్టి... అదే అంశంపై మరో పిటిషన్ దాఖలు చేసిన విశాఖ వాసి పి.రంగారావుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది కోర్టు ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని స్పష్టం చేసింది. ఖర్చుల కింద నెల రోజుల్లో రూ.లక్ష హైకోర్టు న్యాయ సేవాధికార సంస్థ వద్ద డిపాజిట్ చేయాలని ఆదేశించింది. గడువు లోపు చెల్లించకపోతే ఆ మొత్తం వసూలుకు చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్ జనరల్‌కు తెలిపింది. వాస్తవాలను దాచిపెట్టి కోర్టు ప్రక్రియలో జోక్యం చేసుకున్నందుకు అతనిపై క్రిమినల్ కోర్టు ధిక్కారం కింద చర్యలకు ఉపక్రమించింది. ఈ కోర్టు ధిక్కార వ్యాజ్యాన్ని సంబంధిత బెంచ్ ముందుంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి ఇటీవల తీర్పు వెలువరించారు. విశాఖపట్నం సాగర్‌నగర్ ఎంఐజీ ఇళ్ల సమీపంలో కామన్ ఏరియా స్థలాన్ని ఈశ్వరరావు, మరొకరు ఆక్రమించారని, దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదంటూ అదే ప్రాంతానికి చెందిన రంగారావు ఈ ఏడాది సెప్టెంబర్‌లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇది పెండింగ్‌లో ఉండగానే, ఇదే అంశంపై అక్టోబర్‌లో మరో పిటిషన్ వేశారు. మొదటి దాని గురించి రెండో పిటిషన్‌లో పేర్కొనలేదు. అలాగే ఈ విషయానికి సంబంధించి ఇంతకు ముందు తానెలాంటి పిటిషన్ వేయలేదని అందులో లిఖితపూర్వకంగా పేర్కొన్నారు. ఈ రెండు వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి విచారణ జరిపారు. రెండో పిటిషన్ విచారణకు వచ్చినప్పుడు రంగారావు వేసిన మొదటి పిటిషన్ గురించి విశాఖపట్నం పట్టణాభివృద్ధి సంస్థ న్యాయవాది వి.సూర్యకిరణ్, గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ న్యాయవాది ఎస్.లక్ష్మీనారాయణరెడ్డి న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. మొదటి పిటిషన్ దాఖలుకు స్థానిక న్యాయవాదికి అన్ని కాగితాలు ఇచ్చారని, అయితే, ఆ పిటిషన్ వేసిన సంగతి మాత్రం రంగారావుకు తెలియదని ఆయన తరఫు న్యాయవాది వివరించారు. రెండో పిటిషన్ దాఖలుకు ఆయన తన వద్దకు వచ్చారని, గత పిటిషన్ సంగతి చెప్పలేదని అన్నారు. దీంతో న్యాయమూర్తి మొదట పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాదిని పిలిపించారు. రంగారావే ఆ పిటిషన్ దాఖలు చేశారని ఆ న్యాయవాది తెలిపారు. దీంతో మొదటి పిటిషన్ దాఖలు చేసింది రంగారావే అని నిర్ధారణకు న్యాయమూర్తి వచ్చారు. రంగారావు దాఖలు చేసిన రెండో పిటిషన్‌ను కొట్టేస్తూ ఖర్చుల కింద రూ.లక్ష చెల్లించాలని ఆయన్ను ఆదేశించారు. ఆయనపై క్రిమినల్ కోర్టు ధిక్కార కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

# చతికిలపడిన అమరావతి ఉద్యమం

## 758వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నేతలు



దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

**తాడికొండ:** కోర్టు ఉత్తర్వులతో అమరావతి ఉద్యమం చతికిలపడిందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ఎద్దేవా చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 758వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు మాట్లాడుతూ 600 మందితో అమరావతి టు అరసవల్లి పాదయాత్ర నడుపుతామని కోర్టుకు విన్నవించిన రైతుల ముసుగులో ఉన్న కులవాదులు అసలు సిసలైన రైతులు లేక వెనుదిరిగారన్నారు. చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీలకు ఆశపడి ఎల్లో మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న సీపీఐ, సీపీఎం, పవన్ కళ్యాణ్, పలు పార్టీల్లో ఉన్న కులవాదులు, దళిత దళారులకు ఇది చెంపపెట్టు అన్నారు. దొడ్డిదారి రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ అయిన చంద్రబాబుకు నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే కుప్పంలో తనతో పాటు తన ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి రెఫరెండంగా ఎన్నికలకు వెళ్లే దమ్ముందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమాన అభివృద్ధి జరిగేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రజలందరూ ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నారన్నారు. మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు, బేతపూడి సాంబయ్య పాల్గొన్నారు.

# ప్రభుత్వాస్పత్రిలో ప్లాస్టిక్ వేలి ముద్ర!

- దానితో హాజరు వేయిస్తూ అడ్డంగా దొరికిన వైద్యుడు
- తెనాలిలోని జిల్లా వైద్యశాలలో కలకలం

**తెనాలి అర్బన్:** గుంటూరు జిల్లా తెనాలిలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఒక వైద్యుడు విధులకు హాజరుకాకుండా బయోమెట్రిక్ హాజరును ప్లాస్టిక్ వేలిముద్రతో వేయిస్తూ అడ్డంగా దొరికారు. రెండు రోజుల కిందట ప్లాస్టిక్ వేలిముద్రతో అటెండెన్స్ వేస్తున్న సెక్యూరిటీ సూపర్‌వైజర్‌ను ఆస్పత్రి సూపరింటెండెంట్ పట్టుకుని నిలదీయడంతో వైద్యుడి అక్రమం వెలుగు చూసింది. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి కథనం ప్రకారం... తెనాలి జిల్లా వైద్యశాలలో ఈఎన్‌టీ వైద్యునిగా డాక్టర్ వెంకటేశ్వరరావు పనిచేస్తున్నారు. ఆయన ప్రతిరోజు గుంటూరు నుంచి వచ్చి విధులు నిర్వర్తిస్తుంటారు. ఆస్పత్రికి సకాలంలో రావడం ఇబ్బందిగా మారటంతో డాక్టర్ వెంకటేశ్వరరావు తన వేలి ముద్రలాంటి ప్లాస్టిక్ వేలిముద్రను తయారు చేయించారు. దానిని అవుట్ సోర్సింగ్ పద్ధతిపై పనిచేస్తున్న సెక్యూరిటీ సూపర్‌వైజర్ ఫణికి ఇచ్చి ప్రతిరోజు బయోమెట్రిక్ హాజరు వేయాలని సూచించారు. దీంతో సెక్యూరిటీ సూపర్‌వైజర్ కొన్ని నెలలుగా ప్లాస్టిక్ వేలి ముద్రను ఉపయోగించి వైద్యుడి బయోమెట్రిక్ హాజరు వేస్తున్నాడు.

**వెలుగు చూసిందిలా..**

రెండు రోజుల క్రితం విధులు పూర్తి చేసుకున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి బయోమెట్రిక్ వేసేందుకు వచ్చారు. ఆ సమయంలో డాక్టర్ వెంకటేశ్వరరావుకు సంబంధించిన బయోమెట్రిక్ హాజరును ప్లాస్టిక్ వేలిముద్రతో ఫణి వేస్తున్నాడు. దీనిని గమనించిన సౌభాగ్యవాణి నిలదీయటంతో అతడు జరుగుతున్న తంతును వివరించాడు. దీంతో అతడిని విధుల నుంచి తొలగించి సదరు కాంట్రాక్ట్ సంస్థకు విషయాన్ని తెలియజేశారు. అనంతరం సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా... ఫణి ప్రతిరోజు వైద్యునికి సంబంధించిన హాజరు వేస్తున్నట్లు నిర్ధారణ అయింది. కాగా, డాక్టర్ వెంకటేశ్వరరావు సతీమణి డాక్టర్ కవిత కూడా తెనాలి వైద్యశాల గైనిక్ విభాగంలో పనిచేస్తున్నారు. ఆమె బయోమెట్రిక్ హాజరు కూడా ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి వేస్తున్నారనే ఆరోపణ వినిపిస్తోంది. దీనిపై విచారణ జరుపుతున్నామని సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి తెలిపారు.



"నిన్ను నువ్వు నిజంగా ప్రేమించుకుంటే, ఇంకొకరిని ఎప్పుడూ బాధపెట్టలేవు.
– బౌద్ధ ధర్మం



సాక్షి
బుధవారం, అక్టోబర్, 26

# ఆపద్బాంధవుడు అవుతారా?

రాజకీయాల్లో ఏదీ అసాధ్యం కాదు. తాజా ఉదాహరణ – బ్రిటన్ ప్రధానమంత్రి పగ్గాలను రిషీ సునాక్ చేపట్టడం. సొంత పార్టీ సారథ్యానికి జరిగిన పోటీలో ఓటమి పాలై నిండా నెలన్నరైనా గడవక ముందే ఆ పదవి ఆయనను వరిస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. కనీసం రిషి సైతం కలగని ఉండరు. కానీ అదే జరిగింది. బ్రిటన్ పీఠంపై భారతీయ మూలాలున్న తొలి ప్రధానిగా, 200 ఏళ్ళ బ్రిటన్ చరిత్రలో అతి పిన్న వయస్కుడైన ప్రధానిగా 42 ఏళ్ళ రిషి అవతరించారు. కానీ, ఆర్థిక సంక్షోభంలో ఉన్న బ్రిటన్‌కూ, అంతర్గత విభేదాలతో ఉన్న అధికార కన్జర్వేటివ్ పార్టీకీ ఆయన ఆపద్బాంధవుడు కాగలరా? ఇటీవలి ప్రధానులు డేవిడ్ కామెరాన్, థెరెసా మే, బోరిస్ జాన్సన్, లిజ్ ట్రస్‌లు నలుగురిలో ముగ్గురి కన్నా తక్కువ అనుభవం ఉన్న ఆయన నెగ్గుకు రాగలరా?

రెండేళ్ళ క్రితం భగవద్గీతపై ప్రమాణం చేసి మంత్రి పదవి చేపట్టి, దీపావళికి ఇంటి ముందు దీపాలు వెలిగించి సనాతన సంప్రదాయాన్ని పాటించినందుకు బ్రిటన్‌లో విమర్శల పాలైన పంజాబీ హిందూ రిషి తీరా ఈ దీపావళి నాడు అదే దేశానికి ప్రధాని కావడం కాకతాళీయం. మాజీ బాస్ బోరిస్ జాన్సన్, మరో పోటీదారు పెన్నీ మార్డాంట్‌లు బరిలో నిలిచేందుకు కావాల్సిన 100 మంది ఎంపీల మద్దతును కూడగట్టుకోలేకపోవడంతో, ఈసారి ప్రధాని పీఠానికి రిషి పయనం నల్లేరు మీద బండి నడక అయింది. కానీ, 45 రోజుల్లోనే పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చిన బ్రిటన్ తాజా మాజీ ప్రధాని లిజ్ ట్రస్ అందుకు తనను తాను తప్ప వేరెవరినీ నిందించలేరు. అనాలోచిత చర్యలతో కూడిన 'మినీ బడ్జెట్'ను ప్రవేశపెట్టి, పౌండ్ విలువ భారీగా తగ్గడానికీ, మార్కెట్ పతనానికీ కారణమయ్యారనే అపకీర్తిని ఆమె మూటగట్టుకున్నారు. కరోనా కాలంలో చేపట్టిన చర్యలకు మంచి పేరు తెచ్చుకున్న రిషి తాజా గందరగోళాన్ని ఎలా చక్కదిద్దుతారో చూడాలి.

తప్పులను సరిదిద్దడానికే తనకు బాధ్యత అప్పగించారనీ, తక్షణమే ఆ పని మొదలుపెడుతున్నాననీ రిషి మాట. కేవలం ఏడేళ్ళ పార్లమెంటరీ అనుభవమే ఉన్న రిషి అయిదేళ్ళకే ఆర్థిక మంత్రి, ఆ పైన రెండేళ్ళకే ప్రధానీ అయ్యారు. విశ్వసనీయత, ప్రొఫెషనలిజమ్, జవాబుదారీతనం ముఖ్యమైన వేళ కోరి తలపై పెట్టుకున్న ప్రధాని పట్టం అన్ని విధాలా ముళ్ళకిరీటమని రిషికి తెలుసు. ఒకపక్క అంతర్గత కుమ్ములాటల్లో పడిపోయిన స్వపక్షీయులైన కన్జర్వేటివ్‌ల మధ్య ఐక్యత తేవడానికి ఆయన శ్రమించాలి. మరోపక్క కట్టుదిట్టమైన చర్యలతో దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించాలి. ఈ శ్వేతేతర జాతి నేత పదవి చేపట్టిన మంగళవారమే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. లిజ్ సారథ్యంలో పనిచేసిన పలువురు మంత్రులకు ఉద్వాసన పలికారు. మునుపటి లిజ్ మంత్రివర్గంలోకి ఆఖరి రోజుల్లో వచ్చిన ఆర్థిక మంత్రి జెరెమీ హంట్‌ను అదే పదవిలో పునర్నియమించారు. పార్టీకి కొత్త ఛీఫ్ విప్‌ను పెట్టారు. అన్నట్టుగానే వెంటనే పనిలోకి దిగారు.

కారణాలు ఏమైనా, ఒకే ఏడాదిలో బ్రిటన్ ముచ్చటగా మూడో ప్రధానమంత్రిని చూసేలా చేసింది అధికార పార్టీ. గడచిన 12 ఏళ్ళ పాలన దేశాన్ని క్లిష్టపరిస్థితుల్లోకి నెట్టిందనే ఆరోపణ ఉంది. ఇప్పుడు 700 మిలియన్ పౌండ్లకు పైగా ఆస్తులతో ఆ పార్టీలోని రిషీ సునాక్ దంపతులు సాక్షాత్తూ బ్రిటన్ రాజు కన్నా అధిక ధనవంతులనే చర్చ జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో కనీసం కొత్త ప్రభుత్వమైనా సుస్థిర ఆర్థిక విధానాలను అనుసరించాలనీ, ఘడియకో మార్పు చేయరాదనీ బ్రిటన్ ఆర్థిక విపణి భావిస్తోంది. రిషి ఆ ఆకాంక్షకు తగ్గట్టు వ్యవహరిస్తే మునుపటిలా మార్కెట్ పతనం కాకపోవచ్చు. దేశానికి ఓ దిశ, దశ కల్పించడం క్లిష్టమే. 'ఆర్థిక సుస్థిరత, సమర్థత ప్రభుత్వ అజెండా' అంటున్న రిషి అదుపు తప్పి పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం, జీవన వ్యయ సంక్షోభాలకు కళ్ళెం వేయాలి. కఠిన నిర్ణయాలు తప్పవంటూ పగ్గాలు చేపడుతూనే ప్రకటించినా, అందుకు చిక్కులు లేకపోలేదు. కన్జర్వేటివ్‌ల సర్వసాధారణ సిద్ధాంతమే పన్నుల తగ్గింపు. తీరా ఇప్పుడు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు పన్నులు విధిస్తే, సొంత పార్టీలోనే ఆయనకు నిరసన ఎదురు కావచ్చు. ప్రతిపక్ష లేబర్ పార్టీ ఆశ కూడా అదే. రిషి మాత్రం సంక్షోభ పరిష్కారానికి మంత్ర దండమేదీ లేదనీ, కాకమ్మ కథల్లో తనకు నమ్మకం లేదనీ అంటున్నారు. అందుకే, రాబోయే రోజుల్లో ఆయన ఏం చేస్తారు, ఎలా దేశాన్ని గట్టెక్కిస్తారన్నది ఆసక్తికరం.

ఏళ్ళ తరబడి మనల్ని బానిసలను చేసుకొని పాలించి, ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడడానికి అనేక అభ్యంతరాలు పెట్టిన రవి అస్తమించని బ్రిటీషు సామ్రాజ్యం... తీరా మనకు స్వాతంత్ర్యం దక్కిన సరిగ్గా 75 ఏళ్ళ తర్వాత ఇప్పుడు విచిత్రంగా భారతీయ మూలాలున్న వ్యక్తి ఏలుబడిలోకి రావడం విధి చేసిన వింత. నిజానికి, అప్పటి బ్రిటన్, ఇప్పటి బ్రిటన్ అనేక రీతుల్లో వేరు. అయితేనేం, మన భారతీయుల వరకు ఇది అహాన్ని సంతృప్తిపరచే అంశమే. మన దేశాన్ని మరొకరు పాలించడానికి ఇచ్చగించకపోయినా, మరో దేశంలో మనవాడు జెండా ఎగరేశాడంటూ సహజమైన సంతోషాన్నీ వ్యక్తం చేస్తాం. బ్రిటన్‌తో మన బంధం బలపడుతుందనీ ఆశిస్తాం. సంక్లిష్టమైన, ఈ సరికొత్త బాధ్యతల్లో రిషి విజయం సాధించి, రాజకీయ, ఆర్థిక సుస్థిరత అందించాలనే కోరుకుందాం. తప్పేమీ కాదు. కానీ, అది అనుకున్నంత తేలిక కాదు. చిన్న తేడా జరిగినా, ఆపైన దేశంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికారాన్ని ప్రతిపక్ష లేబర్ పార్టీకి అప్పనంగా అందించారనే అపకీర్తి రిషి మెడ మీద కత్తిలా వేలాడుతూనే ఉంటుంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.పాడ్యమి ప.3.24 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** స్వాతి ప.2.58 వరకు తదుపరి విశాఖ, **వర్జ్యం:** రా.8.24 నుండి 9.58 వరకు **దుర్ముహూర్తం:** తె.5.44 నుండి 6.23 వరకు (తెల్లవారితే గురువారం).

**సూర్యోదయం:** 6.00
**సూర్యాస్తమయం:** 5.30
**రాహుకాలం:** ప. 12.00 నుంచి 1.30 వరకు
**యమగండం:** ఉ.7.30 నుంచి 9.00 వరకు

# 'అలా' అనకూడదంటే ఎలా?

విశ్లేషణ



కొమ్మినేని శ్రీనివాసరావు

**తనను 'అలా' పిలవొద్దని ఆగ్రహానికి గురైన జనసేన అధినేత పవన్ కల్యాణ్... ఎక్కువమంది నోళ్లలో 'అలా'నే నానిపోయే పరిస్థితి తెచ్చు కున్నారు. మామూలుగా మాట్లాడినా పవన్ ఆవేశంగానే మాట్లాడినట్టు ఉంటుంది. ఇక ఆవేశంగా మాట్లాడితే బ్యాలెన్స్ తప్పినట్టే కనబడుతుంది. ఆ క్రమంలోనే 'చెప్పు'కోలేని మాటలదాకా వెళ్లిపోయారు. తిరిగి చెప్పించుకునే స్థితి తెచ్చుకున్నారు. పోనీ తాను 'అలా' కాదని అంత గట్టిగా సమర్థించుకున్న పవన్ తీరా చేసింది ఏమిటంటే, చంద్రబాబు పక్కన 'అలా' అనుకునేట్టుగానే నిలబడటం. పార్టీ మీటింగ్‌లో పవన్ ఎందుకు అంత ఆవేశం కనబరిచారు? తదుపరి ఎందుకు చంద్రబాబు వద్ద అంతలా లొంగిపోయి వ్యవహరించారన్న ప్రశ్నలకు జనసేన అభిమానుల దగ్గర కూడా సమాధానాలు లేవు.**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి భలే కౌంటర్ ఇచ్చారు. ఎక్కడా ప్రత్యర్థుల పేర్లను అనవసరంగా తీయకుండా, తాను చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగా, స్పష్టంగా ఎవరికి తగలాలో వారికి తగిలేలా సమాధానం ఇచ్చారు. ఒకరకంగా తన రిప్లైతో ప్రత్యర్థుల మాడును పగలగొట్టినంత పని చేశారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన చేసిన ప్రసంగాలు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న ఉపన్యాసాలను పోల్చి చూస్తే ఎంతో తేడా కనిపిస్తుంది. చంద్రబాబు ఒకదానితో మరొకదానికి లింక్ లేకుండా మాట్లాడేవారు. జగన్ ఏ సబ్జెక్ట్ గురించి మాట్లాడదలిస్తే దాని పైనే కేంద్రీకరిస్తారు.

పవన్ తెలివితక్కువతనాన్ని జగన్ బాగా ఎక్స్‌పోజ్ చేసినట్లు అర్థం అవుతుంది. తాను ప్రజల మేలు కోసం మూడు రాజధానులు అంటుంటే, ఒకాయన మాత్రం మూడు పెళ్లిళ్లు చేసుకోవాలని ప్రజలకు సూచిస్తున్నారని జగన్ అవనిగడ్డలో జరిగిన సభలో పేర్కొన్నారు. కాపు సామాజిక వర్గం అత్యధికంగా ఉండే ఆ ప్రాంతంలో జగన్ మాట్లాడుతుంటే వచ్చిన స్పందన కూడా విశేషమైనదే. దీనిని బట్టీ పవన్ కల్యాణ్ ఎంతలా ప్రజలలో పలుచన అయింది తెలుస్తుంది. ఎవరైనా నాయకుడు ప్రజలకు మంచి చెబుతారా? లేక మీరు కూడా మూడు పెళ్లిళ్లు చేసుకోవాలని చెబుతారా అని జగన్ ప్రజలను ప్రశ్నించారు. అందరూ అలా చేస్తే మన ఆడబిడ్డల పరిస్థితి ఏమిటని అడిగారు. దత్తపుత్రుడు, దత్తతండ్రి అంతా కూటమి కట్టి 'మీ బిడ్డనైన నాపైకి' యుద్ధానికి వస్తున్నారనీ, దుష్టచతుష్టయంలో భాగంగా ఉన్న ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 నిత్యం అసత్యాలు ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేయడానికి యత్నిస్తున్నాయనీ అన్నారు. వచ్చే 19 నెలలు ఈ దుష్ట చతుష్టయంతో యుద్ధాన్ని ఎదుర్కోక తప్పదని స్పష్టం చేశారు. సుమారు 35 వేల ఎకరాల భూమిని రైతుల పరం చేస్తూ పట్టాలను పంపిణీ చేసిన కార్యక్రమంలో తొలుత తమ ప్రభుత్వం రైతులకు చేస్తున్న సేవలను వివరించిన తర్వాత, ఏపీ ముఖ్యమంత్రి రాజకీయ అంశాలు మాట్లాడారు.

నిజంగానే పవన్ కల్యాణ్ తెలివితక్కువగా మాట్లాడి పెళ్లిళ్ల గోలలో ఇరుక్కుపోయినట్లు అనిపిస్తుంది. నిజానికి ఈ మధ్యకాలంలో పవన్‌పై వైసీపీ నేతలు పెద్దగా విమర్శలు చేయలేదు. విశాఖలో జరిగిన ఘటనల తర్వాత పవన్ మంగళగిరి పార్టీ కార్యకర్తల సమావేశంలో రెచ్చిపోయి మాట్లాడారు. ఆ క్రమంలో బేలెన్స్ తప్పారు. తనను ప్యాకేజీ స్టార్ అంటే చెప్పుతో కొడతానని అనడమే కాకుండా, చెప్పు కూడా చూపించడం అందరినీ విస్తుపరిచింది. ఒక పార్టీ అధినేతగా ఉన్న వ్యక్తి ఎవరూ ఇలా గతంలో వ్యవహరించలేదు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆయా నేతలపై పలుమార్లు దూషణలకు దిగినా, చెప్పులు చూపించేవరకు వెళ్లలేదు. ఎవరి సలహాయో



తెలియదు కానీ, ప్రజల దృష్టిలో ఈయన రాజకీయాలకు పనికి రారేమో అన్న భావన కల్పించారనిపిస్తుంది. రాజకీయంగా ప్యాకేజీ తీసుకుంటున్నాడని ఎవరైనా విమర్శిస్తున్నప్పుడు దానికి సమాధానం చెప్పడం తప్పు కాదు. ఆయన తన ఆదాయ వివరాలు, తనకు వచ్చే డొనేషన్లు తదితర అంశాలు వెల్లడించారు. అంతటితో ఆగితే సరిపోయేది. అలాకాకుండా చెప్పు చూపడం, బూతులకు తెగబడడం... ఇవన్నీ పార్టీ హార్డ్‌కోర్ కార్యకర్తలకు కాస్త జోష్ తెప్పించి ఉండవచ్చు. కానీ జన సామాన్యంలో మాత్రం బాగా నెగిటివ్ అయింది. పోనీ అదే ఆవేశంతో పవన్ ఉండిపోయారా అంటే అదేమీ లేదు. ఆ తర్వాత కాసేపటికి నోవాటెల్ హోటల్‌కు వెళ్లడం, అక్కడకు వ్యూహాత్మకంగా చంద్రబాబు రావడం, ఇద్దరూ కలిసి మాట్లాడుకుని మీడియా ముందుకు రావడం, ఆ సందర్భంగా చంద్రబాబు పక్కన పవన్ చేతులు కట్టుకుని నిలబడి ఉన్న సన్నివేశాలు చూసిన తర్వాత ఆయన హార్డ్‌కోర్ ఫ్యాన్స్ కూడా తీరని ఆవేదనకు గురయ్యారు.

సహజంగానే వైసీపీ నేతలు పవన్ నోవాటెల్ హోటల్‌లో చంద్రబాబును కలవడం, ప్యాకేజీ కాక మరేమిటని ప్రశ్నించారు. మూడు పెళ్లిళ్ల అంశాన్ని కూడా ప్రస్తావించి, పవన్ ఒకరిని పెళ్లి చేసుకుని, మరొకరితో సహజీవనం చేయడం చెల్లుతుందా అంటూ ఎద్దేవా చేశారు. ఈ మొత్తం ప్రహసనంలో పవన్ కల్యాణ్ పూర్తిగా నష్టపోతే, చంద్రబాబు నాయుడు ఆయన్ని బకరా చేసి వాడుకున్నారన్న అభిప్రాయం కలుగుతుంది. మరోవైపు వీరిద్దరు కలవడం ద్వారా జగన్ ఎంత బలంగా ఉన్నది చెప్పకనే చెప్పారు. ఒంటరిగా పోటీచేస్తే టీడీపీ గెలుపు దాపులోకి కూడా రాదన్న భయం చంద్రబాబును వెంటాడుతోందన్న భావన ఏర్పడింది. అది తెలుగుదేశం పార్టీకి కలిగిన డామేజీ. మరో వైపు ముఖ్యమంత్రి చాలా హుందాగా తన ప్రసంగాన్ని సాగించడమే కాకుండా, ప్రత్యర్థులను తుత్తునియలు చేసేవిధంగా, జాతీయ నేతల స్థాయి ప్రమాణాల్లో ప్రసంగించి ప్రజలను ఈ తతంగంపై ఆలోచించేలా చేయగలిగారు.

మరికొన్ని విషయాలు కూడా ప్రస్తావించాలి. పవన్ కల్యాణ్ ఒకరిని పెళ్లి చేసుకుని మరొకరితో సహజీవనం చేశారన్న విమర్శలను కూడా ఎదుర్కుంటున్నారు. సరిగ్గా అదే ధోరణిలో ఆయన రాజకీయంగా కూడా చేశారనిపిస్తుంది. ప్రస్తుతం ఆయన బీజేపీకి మిత్రపక్షంగా ఉన్నారు. టీడీపీతో కలవడానికి బీజేపీ ససేమిరా అంటోంది. అలాంటి పరిస్థితిలో బీజేపీతో విడాకులు తీసుకోకుండానే, టీడీపీతో కలిసి ఒక ప్రజాస్వామ్య వేదిక ఏర్పాటు చేస్తామనడం కూడా బీజేపీతో పెళ్లి అయితే, టీడీపీతో రాజకీయ సహజీవనం అన్న చందంగా పరిస్థితి ఏర్పడింది. ఇది పవన్ తెలివిగా చేశారని ఎవరూ భావించలేకపోతున్నారు. ఆయన కాపు సామాజిక వర్గ ఓట్లపైన ఎక్కువ ఆధారపడాలని ప్రయత్నిస్తున్నారు. ఆ ఓట్ల మద్దతు తమకు కలిస్తే అది మరికాస్త ఉపయోగమని చంద్రబాబు ఆశ. పోనీ పవన్ నిజంగానే కాపుల పక్షాన పూర్తిగా నిలబడ్డారా అంటే అలానూ లేరు. టీడీపీ హయాంలో కాపుల రిజర్వేషన్ ఆందోళన సాగుతున్నప్పుడు వారికి రిజర్వేషన్లు ఏమిటని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వం ఓడిపోయిన తర్వాత కాపుల రిజర్వేషన్ గురించి మాట్లాడారు. అప్పట్లో ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని దారుణంగా అవమానించినా పవన్ నోరు తెరవలేదు. ముద్రగడను చంద్రబాబు హయాంలో పోలీసులు కనీసం పాదయాత్ర చేయడానికి కూడా అనుమతించలేదు. అయినా ఇప్పుడు చంద్రబాబులో ఆయనకు పెద్ద ప్రజాస్వామికవాది కనిపిస్తున్నారు.

ఇక చంద్రబాబు తీరు కూడా అలాగే ఉంది. విశాఖపట్నం ఎయిర్ పోర్టులో జనసేన పార్టీ కార్యకర్తలు ఏపీ మంత్రులపై దాడులకు తెగబడితే, కనీసం ఖండించలేని చంద్రబాబు దాడులు చేసినవారిని అరెస్టు చేస్తే అక్రమం అని చెప్పి ప్రజాస్వామ్యానికి కొత్త భాష్యం చెప్పారు. తాడిచెట్టు ఎందుకు ఎక్కావంటే దూడమేతకు అన్న చందంగా, ఎలాగోలా జనసేనను తన ట్రాప్‌లో వేసుకుని రాజకీయం చేయాలని చంద్రబాబు ఎత్తుగడ వేశారు. ఆ ఉచ్చులో పవన్ పడినట్లుగానే కనిపిస్తుంది. ఫలితంగా జనసేనకు ఏ పదో పరకో సీట్లు ఇచ్చి, తన వెంట తిప్పుకోవాలన్నది ఆయన వ్యూహం కావచ్చు. కొద్దికాలం క్రితం తాము త్యాగాలకు సిద్ధంగా లేమనీ, ఒకవేళ పొత్తు కుదిరితే సీఎం పోస్టుకు పట్టుబడతామనీ సంకేతాలు ఇచ్చిన పవన్ ఇప్పుడు జారీ పోయినట్లే ఉంది. ఒంటరిగా పోటీచేస్తే వైసీపీని ఓడించలేమన్న భయంతోనే టీడీపీ ఈ రకమైన వ్యూహాలు పన్నుతోంది. టీడీపీ, జనసేన రెండు పార్టీలు కలిసినా వైసీపీకి ఢోకా లేదని సర్వేలు చెబుతున్నాయి. మరోవైపు బీజేపీ నేత సునీల్ దేవ్‌ధర్ తమతోనే జనసేన ఉంటుందనీ, అవినీతి టీడీపీతో పొత్తు లేదనీ అంటున్నారు. ముందుగా పవన్ ఈ పంచాయతీని తేల్చుకోవల్సి ఉంటుంది. ఏది ఏమైనా ప్రజల మద్దతు జగన్‌కు ఉన్నంతకాలం ఎన్ని పార్టీలు కలిసినా ఆయనను ఏమి చేయలేరన్నది ప్రజావాణిగా ఉంది.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### కఠిన వాస్తవం



ఆసుపత్రిలో నేను చికిత్స చేస్తున్న ప్రతి ఒక్క కోవిడ్ పేషెంట్ కూడా టీకా వేసుకోవడమే కాదు, అత్యధిక బూస్టర్లు వేసుకున్నవాళ్లు!

– శామ్ గిగ్లిస్, అమెరికా వైద్యుడు

### కావాల్సింది ప్రణాళిక



నేను గతంలో 90 శాతం మంది భారతీయులు మూర్ఖులు అన్నాను. రిషి సునాక్ యూకే ప్రధాని కావడాన్ని పండుగ చేసుకోవడం చూస్తుంటే అది నిరూపితమవుతోంది. యూకే ప్రధాని మూలాలు బ్రిటిష్, ఇండియన్, చైనీస్ – ఏవైతే ఏంటి... మాంద్యంలో ఉన్న బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థను ఒడ్డున పడేయడానికి ఆయన దగ్గర ఏం ప్రణాళిక ఉందన్నది ముఖ్యం?

– మార్కండేయ ఖట్జూ, మాజీ న్యాయమూర్తి

### మజాయే వేరు



దీపావళి సాయంత్రం ఎంతో సరదాగా, సంతోషంతో గడిచింది (న్యూఢిల్లీలో). భారతీయ పండుగలకు ఏ పండుగలూ సాటిరావు.

– లుసిందా డాయల్, ఐర్లండ్ ప్రొఫెసర్

### ఏం చేయరా?



అధికారంలో ఉన్న స్మృతీ ఇరానీ మహిళల కోసం ఏం చేసిందో, రిషి సునాక్ ఇండియన్స్ కోసం అంతే చేస్తాడు.

– అదితీ మిత్తల్, కమెడియన్

### మనదే తక్కువ



మీకు తెలుసా? సామాజిక సంక్షేమం కోసం ఇండియా తన జీడీపీ (స్థూల జాతీయోత్పత్తి)లో సుమారు 2.4 శాతం మాత్రమే ఖర్చు చేస్తుండగా– ఫ్రాన్సులో ఇది 23.3 శాతంగా ఉంది. బ్రెజిల్‌లో ఇది 15.7 శాతం, ఇక చైనాలో ఇది 7.2 శాతం.

– పమేలా ఫిలిపోస్, పరిశోధకురాలు

### ద్వంద్వనీతి అని కూడా!



మరెక్కడో ఏదైనా జరుగుతున్నప్పుడు ఎవరైనా గర్వంగా ఫీలయ్యి, ఒకవేళ అదే మన ఇంట్లో జరుగుతున్నప్పుడు సిగ్గుపడితే – దాన్ని గర్వం అనరు. అత్యధిక స్థాయిలో ఉన్న కపటత్వం అందురు.

– అతుల్ కులకర్ణి, నటుడు

### మీ శిబిరం కాదనా?



చరిత్రలో ఇటలీకి మొదటిసారి ఒక మహిళ (జార్జియా మెలోనీ) ప్రధాని అయ్యారు. ఆమె రోమ్ శివార్లలో పెరిగారు. శ్రామిక కుటుంబానికి చెందిన, తండ్రిలేని ఈమె యూనివర్సిటీకి వెళ్లి చదువుకోలేదు. వెయిట్రెస్‌గా రాత్రి షిఫ్టుల్లో పనిచేశారు. కానీ ఆమె ఊసే ఎక్కడా లేదు. ఆమె గనుక ప్రగతిశీలవాది అయివుంటే మీడియా ఆమె గురించి హోరెత్తించి ఉండేది.

– అలెజాండ్రా బెక్కో, ఇటలీ జర్నలిస్ట్

### రేసు మారిపోయింది



సారీ ఇండియన్ – అమెరికన్స్! సీఈవో కావడం ఇప్పుడు గొప్పేమీ కాదు. పూర్వ వలసవాద దేశానికి ప్రధానమంత్రి కాగలగాలి. ఇప్పుడిదే కొత్త ప్రమాణం.

– కరణ్ తలాటి, ఆంట్రప్రెన్యూర్

## ఇన్‌బాక్స్

### అలుపెరుగని కలం యోధుడు

బోయి భీమన్న సామాజిక స్పృహతో రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవీ, రచయిత. 1911 సెప్టెంబర్ 19న తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో దళితులైన నాగమ్మ, పుల్లయ్య దంపతులకు జన్మించారు. అంబేడ్కర్ 'కుల నిర్మూలన'ను తెలుగులోకి అనువదించారు. మహాత్మా గాంధీ, అంబేడ్కర్ బోధనలతో ప్రభావితుడై 'అస్పృశ్యత'ను తన కలం ద్వారా రూపుమాపాలనుకున్న మేధావి.

పద్యం, గద్యం, గేయం, నాటకం, నాటిక, వచన కవిత లాంటి విభిన్న సాహితీ ప్రక్రియల్లో 70కి పైగా రచనలను వెలువరించారు. ఆయన రచనలన్నింటిలోనూ అంతర్లీనంగా ఉన్న విషయం ఒక్కటే – అదే 'భారతజాతి ఏకత్వం'. భీమన్న రాసిన 'పాలేరు' నాటకం ప్రభావంతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను పాలేరు పని మాన్పించి పాఠశాలల్లో చేర్చారు. 'గుడిసెలు కూలిపోతున్నై' కవితాసంపుటి (1975లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది) వంటి అనేక పద్య గ్రంథాలు వెలువరించారు. 'ఏకపద్యోపాఖ్యానం', 'ఇదిగో ఇదీ భగవద్గీత' వంటి రచనలు ప్రసిద్ధం. ముఖ్యంగా పాలేరు, కూలిరాజు, ధర్మవ్యాధుడు, చండాలిక (టాగూర్ రచించిన చండాలిక నాటికకు అనువాదము) వంటి నాటకాలు ఆయనకు ఎంతగానో పేరు తెచ్చిపెట్టాయి.

ఆయన కలం నుండి అనేక వైవిధ్యభరితమైన రచనలకు విస్మయం చెందిన సినారె 'ఎప్పుడు చూస్తానో మరి ఎప్పుడు రాస్తానో, అరె తెప్పలుగా తేల్చినావు తీయన కవితల్ కుప్పలుగా రాల్చినావు కొన్నన పలుకుల్' అంటూ భీమన్నపై ప్రశంసల వర్షం కురిపించారు. సాహిత్యమంటే కులం, మతం, వర్గం, ముఠా అని ధైర్యంగా తన మనసులోని మాటను కలం, గళం ద్వారా వెలిబుచ్చిన కవి బోయి భీమన్న. 2005 డిసెంబర్ 16న హైదరాబాద్‌లో శాశ్వత నిద్రలో ఒరిగి పోయారు. అయినా తెలుగు నేలపై ఆయన చిరంజీవిగా నిలిచారు.

– రేగుళ్ళ మల్లికార్జునరావు, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు, ఏపీ
(నేడు విశాఖలో 'బోయి భీమన్న స్మారక పురస్కారం' ప్రదానం)

# ఆర్థికంగా... అడకత్తెరలో బ్రిటన్?

విశ్లేషణ



డి. పాపారావు

బ్రిటన్ కొత్త ప్రధానమంత్రిగా భారతీయ మూలాలున్న రిషీ సునాక్ పదవిని చేపట్టారు. అంతకుముందరి లిజ్‌ట్రస్ కేవలం 45 రోజులపాటు మాత్రమే ప్రధానిగా కొనసాగగలిగారు. గత రెండు నెలల కాలంలో బ్రిటన్‌లో ముగ్గురు ప్రధానులు మారారు. ఇటువంటి పరిస్థితి ధనిక దేశాలలో, అభివృద్ధి చెందిన ప్రజాస్వామ్యాలు అనబడే వాటిలో చూడం. మరి ఈ దుఃస్థితి బ్రిటన్‌కి ఎందుకు దాపురించింది? ఈ కారణాలలోకి పోయేముందు – కొత్త ప్రధాని సునాక్ అయినా నిల దొక్కుకోగలడా? అన్న ప్రశ్న ఎటూ ఎదురవుతూనే ఉంది. దీనికి జవాబుగా 'గార్డియన్' పత్రిక మూడు అంశాలను ముందుకు తెచ్చింది: 1. నిన్నటి ప్రధాని లిజ్ ట్రస్ ఏ సమస్యలను అయితే ఆర్థిక రంగంలో ఎదుర్కొన్నారో అదే సమస్యలు నేడు సునాక్ ముందు అలాగే అపరిష్కృతంగా నిలబడి ఉన్నాయి. 2. సునాక్ తాలూకూ కన్జర్వేటివ్ పార్టీ వారే ఆయనను ప్రజల మద్దతుతో ఎంపిక అయిన ప్రధానిగా చూడటం లేదు. 3. పైగా, కన్జర్వేటివ్ పార్టీలోని అనేక మంది అభిప్రాయం ప్రకారం – పార్టీని సమైక్యంగా ముందుకు తీసుకెళ్లగలగటం కష్టమైపోతోంది.

అదీ పరిస్థితి! వీటన్నింటికీ మూలం అపరిష్కృతంగా ఉండిపోయిన ఆర్థిక సమస్యలు... బెడిసికొట్టిన లిజ్ ట్రస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మినీ బడ్జెట్ తాలూకు సారాంశం – ఆ దేశంలో అమలు జరుగుతోన్న ఆర్థిక విధానాల లోపాన్ని పట్టి ఇస్తాయి. ఆ బడ్జెట్‌లోని కీలక అంశాలు – బ్యాంకర్లు పొందగల బోనస్ మొత్తం పరిమితిని పెంచేయటం, కార్పొరేట్ ట్యాక్స్‌లను తగ్గించటం. ఈ చర్యలు – ఇప్పటికే భారీ బోనస్‌లు పొందుతోన్న బ్యాంకర్లకు, బ్రిటన్ కార్పొరేట్లకు మాత్రమే లాభం కలిగించేవి. ఈ చర్యలతోనే బ్రిటన్ పురోగతిని సాధిస్తుందని లిజ్ ట్రస్ అభిప్రాయాల సారాంశం. కానీ, ఆమె ఆలోచనలను – కడకు ఆ దేశం తాలూకు ఫైనాన్స్ మార్కెట్లు కూడా తిప్పికొట్టాయి. ఈ ఆలోచనలు కేవలం లిజ్ ట్రస్‌వి మాత్రమే కాదు. అవి ఆ దేశంలో మొదలై నేడు ప్రపంచ వ్యాపితంగా అమలు జరుగుతోన్న ఉదారవాద సంస్కరణల ఆత్మగా ఉన్నాయి.

సామాన్య జనం, కింది వర్గాలకు కాకుండా... పై వర్గాల వారైన ధనికులూ, కార్పొరేట్లకూ మరిన్ని రాయి



తీలు ఇస్తే ఆర్థికాభివృద్ధి మరింత బాగా జరుగుతుందనీ, ఈ వర్గాల పెట్టుబడుల వల్ల ప్రజలకు మరింతగా ఉపాధి కల్పించబడుతుందనీ ఈ విధాన సారాంశం. 1979–80 లలో ఆరంభమైన ఈ ప్రపంచీకరణ విధానాలు... సంక్షోభాలు లేని ఆర్థిక వ్యవస్థ కోసం ప్రజల కొనుగోలు శక్తి బాగుండటం (మార్కెట్లో డిమాండ్ ఉండటం) అనే అంశాన్ని విస్మరించాయి.

ఈ విధానాలతోపాటుగా రంగ ప్రవేశం చేసిందే – 'ద్రవ్యలోటు ఉండటం తప్పనే' ఆర్థిక సిద్ధాంతం. ఒక దేశ ప్రభుత్వం తాలూకు ఖర్చులు, దాని ఆదాయంకంటే ఎక్కువగా ఉండరాదనే దీని అర్థం. దీనివల్ల ద్రవ్యోల్బణం పెరిగిపోతుందని అంటున్నారు. దీనిని నియంత్రించేందుకు ప్రభుత్వాలు పొదుపు చర్యలను పాటించాలనీ... ఖర్చులను తగ్గించుకోవాలనీ బోధిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రపంచం లోని పలు ఇతర దేశాలలోలాగానే – బ్రిటన్‌లో కూడా ప్రజలకు ఇచ్చే సంక్షేమ పథకాలపై రానురానూ కోతలు పెరిగి పోతున్నాయి.

మరోపక్కన ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసే పేరిట బ్రిటన్ కేంద్ర బ్యాంక్ వడ్డీరేట్లను పెంచుతోంది. ఫలితంగా ప్రజల కొనుగోలు శక్తి మరింత పడిపోతోంది. అలాగే, ఆర్థిక వృద్ధి రేటు కూడా మందగిస్తోంది. అంటే ద్రవ్యోల్బణం అదుపుకు వడ్డీరేట్లు పెంచితే అది అసలుకే ముప్పు తెచ్చి ఆర్థిక వృద్ధి రేటును దిగజారుస్తోందన్నమాట! ఫలితంగా నిరుద్యోగం పెరిగిపోతోంది. ప్రస్తుతం ప్రపంచంలోని అనేక దేశాలలాగానే బ్రిటన్ కూడా ఈ ద్రవ్యోల్బణం – వృద్ధి రేటు పతనం అడకత్తెరలో చిక్కుకుంది. అంటే, వృద్ధిరేటు పడిపోయి... నిరుద్యోగం పెరిగిపోతోందని తిరిగి మరలా వృద్ధి రేటును పెంచేందుకు ఆర్థిక వ్యవస్థలోకి ఉద్దీపనల రూపంలో డబ్బును పంప్ చేస్తే– రెండో పక్కన ద్రవ్యోల్బణం పెరిగిపోతోంది. అలాగని ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు – వడ్డీ రేట్ల పెంపుదల వంటి డబ్బు చలామణిని తగ్గించే చర్యలు తీసుకుంటే వృద్ధి రేటు మరలా తక్షణమే పతనం అవుతోంది.

నిజానికి ప్రభుత్వాలు ద్రవ్యోల్బణం అదుపు పేరిట బ్యాంక్ వడ్డీ రేట్లను పెంచడం... ప్రజలను ధరల పెరుగుదల నుంచి కాపాడేందుకు కాదు. ప్రధానంగా షేర్ మార్కెట్లలోని ఫైనాన్స్ పెట్టుబడిదారుల మదుపుల తాలూకు విలువను కాపాడటం. అంటే, ఒక ఫైనాన్స్ పెట్టుబడి దారుడు షేర్ మార్కెట్‌లో 100 పౌండ్లు పెట్టుబడి పెట్టి దానిపై మరో పది పౌండ్లు లాభం సంపాదిస్తే గనుక... ఈ అసలు+లాభం (110 పౌండ్లు) తాలూకు సంపూర్ణ ఫలితం అతనికి దక్కా లంటే – పౌండ్ కరెన్సీ విలువ కాపాడబడాలి.

ఆయా దేశాలలోని సామాన్య జనం తాలూకు ప్రయోజనాలూ, వారిపై పడుతోన్న ధరాభారానికి పరిష్కారం అనేవి కేవలం ముసుగులు మాత్రమే. అందుచేతనే ప్రస్తుతం నిరుద్యోగం పెరిగి... ధరలూ పెరిగిపోయి సతమతమవుతోన్న జనాన్ని ఆదుకునేందుకు ఆర్థిక ప్రణాళికలను రూపొందించే బదులు... ప్రస్తుత బ్రిటన్ ప్రభుత్వం కార్పొరేట్ రాయితీలు ఇచ్చి సమస్యను పరిష్కరించజూస్తోంది. రిషీ సునాక్ కూడా కొద్దిపాటిగా ప్రజలకు కొన్ని రాయితీలు ఇచ్చే ప్రయత్నం చేసినా– స్థూలంగా కార్పొరేట్ అనుకూల చట్రం నుంచి ఆయన కూడా బయటకు రాలేడు. అంతిమంగా అది సునాక్ అయినా, మరొకరయినా ఈ కార్పొరేట్, షేర్ మార్కెట్ అనుకూల చట్రం నుంచీ బయటపడలేనంత కాలం సమస్యలు పరిష్కారం కావు. రష్యా విప్లవనేత వ్లాదిమిర్ లెనిన్ బోధించిన విప్లవ పరిస్థితి గురించిన 3 అంశాలలోని ఒకటి ఇక్కడ గమనించి తీరవలసింది. ఒక దేశంలో విప్లవాత్మక మార్పునకు పరిస్థితి ముంచుకొచ్చిందనటానికి ఒక ప్రధాన తార్కాణం – ఆ దేశం లోని పాలక వర్గం ఇక ఎంతమాత్రమూ పాత పద్ధతులలో పరిపాలించలేకపోవడం! ప్రస్తుతం ప్రపంచమంతటా జరుగుతుంది ఇదే. వివిధ ప్రభుత్వాలు నయా ఉదారవాద సంస్కరణల ఊబిలో కూరుకుపోయి – ద్రవ్యోల్బణం – వృద్ధి పతనం అడకత్తెరకు పరిష్కారం చూప లేక ఒకదాని తరువాత ఒకటిగా సంక్షోభంలోకి పోతున్నాయి. ఈ చట్రాన్ని బద్దలు కొట్టనంతవరకు ఏ దేశంలోని ప్రజలకూ స్థిమితం ఉండదు... పాలకులకు స్థిరత్వం ఉండదు!

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు । 98661 79615

## క్లుప్తంగా

### వేణుగోపాలుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ మల్లికార్జునరావుకు జ్ఞాపికను అందజేస్తున్న చైర్మన్ శశిరేఖ

నెమలి (గంపలగూడెం): ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా సోమవారం సందర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు ఆయనను సాదరంగా ఆహ్వానించారు. వేణుగోపాలస్వామి విశేష పూజలో జస్టిస్ మల్లికార్జునరావు కుటుంబీకులు పాల్గొన్నారు. అనంతరం న్యాయమూర్తిని అర్చకులు ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ చైర్మన్ శశిరేఖ అందజేశారు.

### తేనెటీగల దాడిలో లారీ డ్రైవర్ మృతి


నిడదవోలు రూరల్: తేనెటీగల దాడిలో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం తాడిమళ్ల శివారులో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన లారీ డ్రైవర్ షేక్ వలీ(42) ఈ నెల 24వ తేదీ సాయంత్రం పెరవలి మండలం అన్నవరప్పాడు గ్రామానికి చెందిన ముగ్గురు కూలీలను ఎక్కించుకుని నిడదవోలు మండలం తాడిమళ్ల వచ్చారు. అరటి గెలలు కోస్తుండగా తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన లారీ డ్రైవర్ వలీ అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్పంగా గాయపడిన కూలీలను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. మృతుడి మేనల్లుడు సలీంబాబా ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఆకస్మికంగా ఆగిన రైలు

**భయభ్రాంతులకు గురైన ప్రయాణికులు**

ఏర్పేడు: ఎర్నాకుళం నుంచి హౌరా వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం ఉదయం తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలోని బాలకృష్ణాపురం రైల్వే గేటు వద్ద ఒక్కసారిగా ఆగిపోయింది. రైలు డ్రైవర్ ఇంజన్ నుంచి దిగి వెనుక బోగీల వైపునకు పరుగుపెట్టాడు. రైలు ఒక్కసారిగా ఆగిపోవడం, డ్రైవర్ కంగారుగా పరుగెత్తడం చూసి ఏదో ప్రమాదం జరిగిందని ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. అయితే, చివరి బోగీలో ఆకతాయిలు చైన్ లాగడంతో రైలు ఆగిందని తెలుసుకున్న ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం 11.48 గంటలకు ఆగిన రైలు... తిరిగి 11.57 గంటలకు బయలుదేరి వెళ్లింది.

### నేటి నుంచి శ్రీశైలంలో కార్తీక మాసోత్సవాలు



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో బుధవారం నుంచి నవంబర్ 23 వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో స్వామివారి గర్భాలయ అభిషేకాలను పూర్తిగా రద్దు చేశారు. ప్రతిరోజు మూడు విడతల్లో ఆర్జిత సామూహిక అభిషేకాలు నిర్వహిస్తారు. మల్లికార్జునస్వామి అలంకార దర్శనానికి మాత్రమే అనుమతిస్తారు. ఈ మాసంలో వచ్చే కార్తీక సోమవారాలు, పౌర్ణమి రోజున పుష్కరిణి వద్ద లక్ష దీపార్చన, పుష్కరిణి హారతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని జ్వాలాతోరణోత్సవం, కృష్ణవేణి నదీమతల్లికి పుణ్యనదీ హారతులు ఇస్తారు. దీపారాధన చేసుకునేందుకు వీలుగా ఆలయ దక్షిణమాడవీధిలో, గంగాధర మండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

### ఒకేచోట 45 వానరాల కళేబరాలు

కవిటి: శ్రీకాకుళం జిల్లా కవిటి మండలంలోని శిలగాం వద్ద అల్లేరు కాలనీ సమీపంలో మంగళవారం ఉదయం 45 వానరాల(కోతులు) కళేబరాలు కనిపించడం స్థానికంగా కలకలం సృష్టించింది. ఇక్కడికి సమీపంలోని ఉద్దానం ప్రాంతంలో సాధారణంగా కొండ ముచ్చులు ఎక్కువగా తిరుగుతుంటాయి. కోతుల సంచారం తక్కువగా ఉంటుంది. అలాంటిది శిలగాం గ్రామం వెలుపల ముళ్ల పొదల్లో ఒకేచోట 45 వానరాల మృతదేహాలు గుట్టగా కనిపించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ కోతులను ఎవరో చనిపోయాక సోమవారం అర్ధరాత్రి తీసుకువచ్చి పడేసినట్లుగా ఉందని స్థానికులు చెబుతున్నారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.శిరీష బృందం వానర కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించింది. నమూనాలను ప్రయోగశాలకు పంపించినట్టు డాక్టర్ తెలిపారు. వానరాల శరీరం అంతా తీవ్రగాయాలతో ఉన్నాయని, వాటిలో గర్భం దాల్చినవి కూడా ఉన్నాయని చెప్పారు. చాలావరకు వానరాల పిల్లలే మృత్యువాత పడ్డాయన్నారు.



సూర్యగ్రహణం సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సరస్వతీ ఘాట్ వద్ద గోదావరి నదిలో స్నానం ఆచరిస్తున్న కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ



విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్ద సూర్యగ్రహణాన్ని ప్రత్యేక కళ్లద్దాలతో వీక్షిస్తున్న నగరవాసులు



గ్రహణం వీడిన తర్వాత ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కృష్ణానదీ తీరంలో పున్నమి ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు చేసి, పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

# కాళహస్తీశ్వర ఆలయం మినహా.. అన్ని ఆలయాలు మూత

## సూర్య గ్రహణ సమయంలోనూ శ్రీకాళహస్తి ఆలయంలో పూజలు

- రికార్డు స్థాయిలో రాహు–కేతు పూజలు
- ఉదయం 8గంటలకు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం మూత
- రాత్రి 7 గంటల తర్వాత దర్శనాలు ప్రారంభం
- నేటి మధ్యాహ్నం 12 గంటల నుంచి బెజవాడ దుర్గమ్మ ఆలయంలో దర్శనాలు
- నేటి ఉదయం 6.30 గంటల నుంచి సింహాచలం అప్పన్న దర్శనం

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: సూర్య గ్రహణం కారణంగా శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరాలయం మినహా రాష్ట్రంలోని ఆలయాలన్నింటి తలుపులు మంగళవారం మూసివేశారు. స్థానిక ఆగమాలకు అనుగుణంగా మంగళవారం సాయంత్రం గ్రహణం అనంతర కాలం నుంచి బుధవారం మధ్యాహ్నం మధ్య తిరిగి తెరుస్తున్నారు. సంప్రోక్షణ, స్నపనాది కార్యక్రమాల అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మాత్రమే యధావిధిగా దర్శనాలు కొనసాగాయి.



విజయవాడ దుర్గ గుడిలో మంగళవారం ఉదయం 11 గంటలకు అమ్మవారి ప్రధానాలయం తో పాటు ఉపాలయాలను మూసివేశారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.



శ్రీశైలం ఆలయాన్ని మంగళవారం వేకువజామున 3 గంటల నుంచి ప్రాతఃకాల పూజలు, ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి ఉదయం 6 గంటలకు ద్వారాలు మూసివేశారు. ఆలయ ప్రాంగణంలోని పరివార ఆలయాలు, క్షేత్ర పరిధిలోని ఉపాలయాలను కూడా మూసివేశారు. తిరిగి మంగళవారం రాత్రి 8 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు.



తిరుమల శ్రీవారి ఆలయం, టీటీడీ అనుబంధ ఆలయాలు, రాష్ట్రంలోని ఇతర ఆలయాలను స్థానిక ఆగమాలను అనుసరించి మంగళవారం తాత్కాలికంగా మూసివేశారు. ఉదయం 8.11 గంటలకు శ్రీవారి ఆలయం తలుపులు మూసివేశారు. మంగళవారం రాత్రి 8.30 గంటల నుంచి భక్తులకు సర్వదర్శనం ప్రారంభమైంది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్సులో రాత్రి 8.30 నుండి అన్నప్రసాద వితరణ ప్రారంభమైంది. అన్నప్రసాదం కాంప్లెక్స్ మూసివేత వల్ల భక్తులు ఇబ్బంది పడకుండా ఉదయం 6 గంటలకు ఫుడ్ కౌంటర్లలో దాదాపు 10 వేల మందికి అల్పాహారం అందించారు. వైభవోత్సవ మండపం, సీఆర్వో వద్ద దాదాపు 30 వేల పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు.

కాకినాడ జిల్లాలోని అన్నవరం సత్యదేవుని ఆలయాన్ని ఉదయం 11 గంటలకు మూసివేశారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి స్వామివారి దర్శనాలు, వ్రతాలు, హోమాలు, ఇతర సేవలు ప్రారంభిస్తారు.



### వాయులింగేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు



సూర్య గ్రహణం సందర్భంగా దేశంలోని ఆలయాన్నింటినీ మూసివేసినప్పటికీ, శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని తెరిచే ఉంచారు. రాహు, కేతులకు నిలయమైన ఈ ఆలయంలో గ్రహణ సమయంలో శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకుంటే మంచి జరుగుతుందని భక్తులు నమ్ముతారు. దీంతో మంగళవారం ఉదయం నుంచే ఇక్కడి వాయులింగేశ్వరుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. రాహు– కేతు పూజలు రికార్డు స్థాయిలో జరిగాయి. గ్రహణం సందర్భంగా మంగళవారం నాలుగు కాలాల్లోనూ ప్రత్యేక అభిషేకాలు జరగడం విశేషం. శ్రీకాళహస్తి తర్వాత రాష్ట్రంలో రాహు – కేతు పూజలకు ప్రసిద్ధి పొందిన పెదకాకాని, మోపిదేవి వంటి ఆలయాల్లో కూడా గ్రహణం కారణంగా దర్శనాలు నిలిపివేశారు.



విశాఖపట్నం సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయాన్ని మంగళవారం ఉదయం 9 గంటలకు మూసివేశారు. తిరిగి సాయంత్రం 6.30 గంటలకు తెరిచారు. సంప్రోక్షణ, స్నపన తిరుమంజనం, విశేష హోమం, అమావాస్య గ్రామ బలిహరణం, మహా నివేదన, ఉత్సవ మూర్తులకు అమావాస్య తిరు వీధి కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం 6.30 నుంచి భక్తులకు స్వామివారి దర్శనాన్ని కల్పిస్తున్నారు.

## మీ వెంటే మేమంతా

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తోన్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ప్రజా సంక్షేమానికై అహర్నిశలూ శ్రమిస్తున్న జగనన్న వెంటే తామంతా నడుస్తామని నాయకులతో ప్రజలు చెబుతున్నారు. అన్ని జిల్లాల్లో మంగళవారం ఈ కార్యక్రమం వేడుకగా సాగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలు తమ దృష్టికి వస్తే అక్కడికక్కడే పరిష్కరించారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను నెరవేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు.



కర్నూలు జిల్లా బీ.తాండ్రపాడు గ్రామంలో మహిళకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



పార్వతీపురం పట్టణంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



ప్రకాశం జిల్లా గంగవరంలో మహిళకు కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

# రికార్డు వరద

- తుంగభద్రలోకి 584.10 టీఎంసీల ప్రవాహం
- 69 ఏళ్ల డ్యామ్ చరిత్రలో ఇదే గరిష్ట వరద
- ఇప్పటికే 98 రోజులు గేట్లు ఎత్తివేత



సాక్షి, అమరావతి: తుంగభద్ర డ్యామ్‌లోకి ఈ నీటి సంవత్సరంలో జూన్ 1 నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకూ రికార్డు స్థాయిలో 584.10 టీఎంసీల ప్రవాహం వచ్చింది. 1953 నుంచి ఇప్పటివరకూ 69 ఏళ్ల డ్యామ్ చరిత్రలో ఈ ఏడాది వచ్చిన వరద ప్రవాహమే అతి పెద్దది కావడం గమనార్హం. గత నీటి సంవత్సరం ముగిసిన మే 31 నాటికి డ్యామ్‌లో 38.18 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. ఖాళీ ప్రదేశాన్ని నింపటానికి నిల్వ చేసిన నీటితోపాటు ఇప్పటిదాకా 80 టీఎంసీలను వినియోగించగా 504 టీఎంసీలకుపైగా తుంగభద్ర డ్యామ్ స్పిల్ గేట్లు, విద్యుత్కేంద్రం ద్వారా దిగువకు వదిలేశారు. అక్టోబర్ చివరి వారంలోనూ డ్యామ్‌లోకి వరద ప్రవాహం కొనసాగుతుండటం, నీటి లభ్యత పెరగడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

**98 రోజులు గేట్లు ఎత్తివేత..**

పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో తుంగభద్ర ఈ ఏడాది పరవళ్లు తొక్కుతోంది. వరద ఉధృతికి జూలై 13 నాటికే తుంగభద్ర డ్యామ్ నిండిపోవడంతో గేట్లు ఎత్తివేశారు. జూలై 13న ఎత్తిన గేట్లను సెప్టెంబరు 17 వరకూ అంటే 67 రోజులపాటు దించలేదు. తుంగభద్ర డ్యామ్ చరిత్రలో ఒకే దఫా ఇన్ని రోజులపాటు గేట్లు ఎత్తివేసిన దాఖలాలు లేవు. సెప్టెంబరు 29న ఎత్తిన గేట్లు 31 రోజులపాటు దించలేదు. మొత్తమ్మీద ఈ నీటి సంవత్సరంలో ఇప్పటివరకూ 98 రోజులు తుంగభద్ర డ్యామ్ గేట్లను ఎత్తివేసి వరదను దిగువకు వదిలేశారు. డ్యామ్ చరిత్రలో 98 రోజులు గేట్లు ఎత్తేయడం ఇదే తొలిసారి.

**44 ఏళ్ల తరువాత..**

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ ఉమ్మడి ప్రాజెక్టు అయిన తుంగభద్ర డ్యామ్‌ను పాక్షికంగా పూర్తి చేసి 1953 జూలై 1న ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. 1958లో స్పిల్‌వే 33 గేట్లను అమర్చి పూర్తి చేశారు. డ్యామ్ చరిత్రలో 1978–79లో వచ్చిన 558.775 టీఎంసీల ప్రవాహమే ఇప్పటిదాకా అతి పెద్ద వరద. ఆ తర్వాత 1980లో వచ్చిన 553.1 టీఎంసీల ప్రవాహం రెండో అతిపెద్ద వరద. 1992లో డ్యామ్‌లోకి వచ్చిన 519.60 టీఎంసీల ప్రవాహం మూడో అతిపెద్ద వరద. 44 ఏళ్ల తర్వాత ఈ ఏడాది 584.10 టీఎంసీల ప్రవాహంతో తుంగభద్రమ్మ తన రికార్డును తానే బద్దలు కొట్టి సరికొత్త చరిత్ర సృష్టించింది.

### రైతన్నల్లో ఆనందోత్సాహాలు


తుంగభద్ర డ్యామ్‌లో 230 టీఎంసీల లభ్యత ఉంటుందని అంచనా వేసిన బచావత్ ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్‌కు 72 (హెచ్చెల్సీ 32.5, ఎల్లెల్సీ 29.5, కేసీ కెనాల్‌కు అసిస్టెన్స్), తెలంగాణకు 6.51 (ఆర్డీఎస్‌కు అసిస్టెన్స్), కర్ణాటకకు 151.49 టీఎంసీలను పంపిణీ చేసింది. 1980లో మాత్రమే బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన దానికంటే 1.383 టీఎంసీలు అధికంగా అంటే 231.383 టీఎంసీలను తుంగభద్ర డ్యామ్ ద్వారా మూడు రాష్ట్రాలు వినియోగించుకున్నాయి. డ్యామ్‌లో పూడిక పేరుకుపోయి నిల్వ సామర్థ్యం తగ్గడంతో నీటిలభ్యత ఆధారంగా దామాషా పద్ధతిలో మూడు రాష్ట్రాలకు తుంగభద్ర బోర్డు వాటా జలాలను పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది 1980 తరహాలోనే నీటి లభ్యత ఉంటుందని బోర్డు వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీనిపై మూడు రాష్ట్రాల ఆయకట్టు రైతులు ఆనందోత్సాహాలను వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర డ్యామ్‌పై నేరుగా ఆధారపడి ఆంధ్రప్రదేశ్‌లో ఎల్లెల్సీ (దిగువ కాలువ) 1,57,062, హెచ్చెల్సీ (ఎగువ కాలువ) 2,84,992, కర్ణాటకలో 8,96,456 ఎకరాలు కలిపి మొత్తం 13,38,510 ఎకరాల ఆయకట్టు ఉంది. డ్యామ్ దిగువన రాయబసవన చానల్స్, విజయనగర చానల్స్ కింద కర్ణాటకలో 30,368, ఆంధ్రప్రదేశ్‌లో కేసీ కెనాల్ కింద 2,78,000, తెలంగాణలో ఆర్డీఎస్ కింద 87,000 కలిపి 3,95,368 ఎకరాల ఆయకట్టు ఉంది. డ్యామ్‌పై ప్రత్యక్షంగా, పరోక్షంగా 17,33,878 ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉంది.

# శ్రీశైలం, సాగర్‌కు కొనసాగుతున్న వరద

శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంది. జూరాల, సుంకేసుల నుంచి మంగళవారం సాయంత్రానికి 1,33,630 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. డ్యామ్ 9 రేడియల్ క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర తెరచి 2,51,433 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సోమవారం నుంచి మంగళవారం వరకు కుడిగట్టు కేంద్రంలో 14.563 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 17.026 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం 67,126 క్యూసెక్కులను సాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,600 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయంలో 213.8824 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ నీటిమట్టం 884.70 అడుగులకు చేరుకుంది.

**సాగర్‌కు పెరిగిన వరద**

నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి వచ్చే వరద పెరిగింది. దీంతో మంగళవారం 16 రేడియల్ క్రస్ట్ గేట్లద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు 2,92,486 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం ప్రస్తుత నీటి మట్టం 589.80 అడుగులకు చేరింది.



శ్రీశైలం డ్యామ్ నుంచి విడుదల అవుతున్న వరద నీరు

## 'జగనన్న' ఇంట ఆనంద దీపావళి



జక్కంపూడిలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో ఆనందంగా దీపావళి జరుపుకుంటున్న లబ్ధిదారులు

చిరునవ్వులు చిందిస్తున్న బొజ్జా సాయిబాబు కుటుంబం

వారి జీవితాల్లో పుట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో సార్లు దీపావళి పండుగ వచ్చింది వెళ్లింది. ఏ దీపావళిలో కనిపించని ఆనందం ఈ దీపావళిలో వారి మోముల్లో వెలిగిపోయింది. దీనికి కారణం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేయడమే. ఇది ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో బొజ్జా సాయిబాబు కుటుంబాన్ని చూస్తే స్పష్టంగా కనిపించింది. వీరితో పాటు కాలనీ వాసులు జగనన్న ఇంట ఆనంద దీపావళిని జరుపుకుంటున్నామని సంతోషం వ్యక్తం చేశారు.

– కందుల చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

### బాణసంచా పేలి ఒకరి మృతి



కోటేశ్వరరావు (ఫైల్)

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తన పిల్లల కోసం బాణసంచా తయారు చేస్తుండగా సంభవించిన పేలుడులో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన తూర్పు గోదావరి జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలోని 16వ డివిజన్ ఆవ రోడ్డు రైతునగర్‌లో సోమవారం జరిగింది. రైతునగర్‌కు చెందిన తెడ్లపు కోటేశ్వరరావు (42) అల్యూమినియం వస్తువులకు మాట్లు వేసే పని చేస్తుంటాడు. ఆయనకు భార్య ఉమామహేశ్వరి, కుమారుడు రాజేష్, కుమార్తె అఖిల్య ఉన్నారు. దీపావళి సందర్భంగా సోమవారం ఉదయం కోటేశ్వరరావు తాము అద్దెకు ఉంటున్న ఇంటి రెండో అంతస్తులోని పెంట్‌హౌస్‌లో బాత్‌రూం వద్ద పిల్లల కోసం బాణసంచా తయారు చేస్తున్నాడు. ఆ సమయంలో అతని భార్య ఒత్తులు తయారు చేసే పనికి వెళ్లగా, కుమారుడు రాజేష్ వేమగిరిలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. కుమార్తె అఖిల్య ఇంట్లోనే టీవీ చూస్తోంది. కోటేశ్వరరావు బాణసంచా తయారు చేస్తుండగా ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. భారీ శబ్దం రావడంతో పాటు ఇంటి గోడలు తునాతునకలై పెంట్ హౌస్ మెస్ వంద మీటర్ల దూరంలో ఎగిరి పడింది. కోటేశ్వరరావు శరీర భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఇంట్లో టీవీ చూస్తున్న కుమార్తె అఖిల్య ఆ శబ్దానికి కిందకు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకుంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. జిల్లా అగ్నిమాపక అధికారి మార్టిన్ లూథర్ కింగ్, సహాయ అగ్నిమాపక అధికారి ఎస్.గోపీకృష్ణ, డీఎస్పీ ఎం.శ్రీలత ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. పేలుడుకు గల కారణాలను క్లూస్‌టీం సేకరించింది. పేలుడు పదార్థాలతో బాణసంచా తయారు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసు అధికారులు అంచనాకు వచ్చారు. రాజమహేంద్రవరం ఎంపీ, లోక్‌సభలో వైఎస్సార్ సీపీ చీఫ్ విప్ మార్గాని భరత్‌రామ్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, వైఎస్సార్ సీపీ రూరల్ కో–ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఘటనాస్థలాన్ని పరిశీలించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

● తెలంగాణ

### ఈడీ కస్టడీకి సుఖేశ్‌గుప్తా

చంచల్‌గూడ: ఎంఎంటీసీ సంస్థ నుంచి బంగారం తీసుకుని మోసం చేసిన కేసులో ఎంబీఎస్, ముసద్దీలాల్ సంస్థల ఎండీ సుఖేశ్ గుప్తా, ఆనంద్ గుప్తా గత కొన్ని రోజులుగా చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వీరిని విచారించేందుకు ఈడీ అధికారులు కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. ఇరువురిని విచారించేందుకు కోర్టు 9 రోజుల కస్టడీ విధించింది. దీంతో మంగళవారం ఈడీ అధికారులు చంచల్‌గూడ జైలు నుంచి ఇరువురిని కస్టడీలోకి తీసుకున్నారు.



స్కూలు విద్యార్థిగా..



తల్లి ఉష, చెల్లి రాఖీ, తమ్ముడు సంజయ్‌తో సునాక్



అత్తమామలు నారాయణ మూర్తి, సుధామూర్తి, భార్య అక్షతతో సునాక్

## అభినందనల వెల్లువ...



రిషికి నా హార్దిక శుభాభినందనలు. బ్రిటన్‌తో భారత్ చారిత్రక సంబంధాలను ఆధునిక భాగస్వామ్యంగా మార్చుకుంటున్న వేళ ఇది నిజంగా గొప్ప పరిణామం. ప్రపంచ సమస్యల పరిష్కారానికి రిషితో కలిసి పని చేసేందుకు, 2030–రోడ్ మ్యాప్‌ను అమలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నా
- ప్రధాని నరేంద్ర మోదీ



రిషి సాధించింది అపురూప విజయం. ఇదో చరిత్రాత్మక మైలురాయి. ప్రపంచ భద్రత, ప్రగతికి సంబంధించిన పలు అంశాలపై ఆయనతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా
- అమెరికా అధ్యక్షుడు జో బైడెన్



ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, యూరప్, మిగతా ప్రపంచంపై దాని ప్రభావాలను రిషితో కలిసి ఉమ్మడిగా ఎదుర్కొంటాం
- ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్



రిషికి హార్దిక అభినందనలు. ఆయన హయాంలో బ్రిటన్–ఉక్రెయిన్ బంధం మరింత బలపడాలి
- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ



పలు అంశాలపై ఆయనతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం
- ఐర్లండ్ ప్రధాని మైఖేల్ మార్టిన్



రిషి హయాంలో బ్రిటన్–ఈయూ సంబంధాలు ఇరుపక్షాల ఒప్పందాలను పరస్పరం గౌరవిస్తూ సాగుతాయని ఆశిస్తున్నాం
- యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాండెర్ లియాన్



ఇదో చరిత్రాత్మక రోజు. రిషికి అభినందనలు. టోరీ ఎంపీలంతా కొత్త ప్రధానికి పూర్తి మద్దతివ్వాల్సిన వేళ ఇది
- బ్రిటన్ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్



ప్రధానిగా పని చేయడం నాకు దక్కిన అతి గొప్ప గౌరవం. రిషికి నా అభినందనలు. అన్ని అంశాల్లోనూ ఆయనకు నా పూర్తి మద్దతుంటుంది
- బ్రిటన్ తాజా మాజీ ప్రధాని లిజ్ ట్రస్



రిషికి శుభాకాంక్షలు
- కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో

రిషికి అభినందనలు. కానీ దేశంలో తక్షణం ఎన్నికలు జరపాల్సిన అవసరముంది
- బ్రిటన్ విపక్ష లేబర్ పార్టీ నేత కీర్ స్టార్మర్

రిషి వచ్చినా బ్రిటన్‌తో సమీప భవిష్యత్తులోనూ రష్యా సంబంధాలు మెరుగు పడతాయన్న ఆశలేమీ లేవు
- రష్యా అధ్యక్షుడు పుతిన్ అధికార ప్రతినిధి ధ్మిత్రీ పెస్కోవ్

రిషి హయాంలో బ్రిటన్‌తో చైనా సంబంధాలు ముందుకు వెళ్తాయని ఆశిస్తున్నాం
- చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్

రిషిని చూసి ఎంతో గర్విస్తున్నాం. ప్రధానిగా అద్భుతంగా పాలించాలని కోరుకుంటున్నాం.
- రిషి మామ, ఇన్ఫోసిస్ సహ–వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి

# పాలించడమెలాగో చూపిస్తా

**ప్రధానిగా తొలి ప్రసంగంలో రిషి**

- ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కిస్తా
- దేశాన్ని మళ్లీ ఐక్యం చేసి చూపిస్తా
- ఆ క్రమంలో కఠిన నిర్ణయాలుంటాయ్
- ఆరు నిమిషాల పాటు ప్రసంగం




లండన్: ఆర్థిక, రాజకీయ సంక్షోభాలతో సతమతమవుతున్న బ్రిటన్‌కు స్థిరత్వం, ప్రజలకు విశ్వాసం కలిగించడమే తమ ప్రభుత్వ అజెండాలో ప్రధానాంశమని నూతన ప్రధాని రిషి సునాక్ ప్రకటించారు. తాజా మాజీ ప్రధాని లిజ్ ట్రస్ చేసిన ఆర్థిక తప్పిదాలను సరిచేసేందుకే కన్జర్వేటివ్ ఎంపీలు తనను సారథిగా ఎన్నుకున్నారని అభిప్రాయపడ్డారు. ''మార్పు కోసం ట్రస్ చేసిన ప్రయత్నాన్ని అభినందిస్తున్నా. ఆమె ఉద్దేశాలు మంచివే. కాకపోతే తీసుకున్న నిర్ణయాల్లో, వాటి అమల్లోనే తప్పిదాలు దొర్లాయి'' అన్నారు. మంగళవారం ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం అధికార నివాసం 10, డౌనింగ్ స్ట్రీట్ నుంచి జాతినుద్దేశించి ఆయన తొలి ప్రసంగం చేశారు. దేశం చరిత్రలోనే అతి పెద్ద ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న మాట వాస్తవమేనని అంగీకరించారు. అయితే, ''తొలుత కరోనా, తర్వాత రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మన పాలిట పెను సమస్యలుగా మారాయి. పరిస్థితిని దీటుగా ఎదుర్కొంటాం. కరోనా, దానివల్ల తలెత్తిన ఆర్థిక సమస్యలను ఆర్థిక మంత్రిగా ఎంత సమర్థంగా నిభాయించుకొచ్చానో అందరికీ తెలుసు. ప్రజలను, వ్యాపార వాణిజ్యాలను పరిరక్షించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నా. అదే స్ఫూర్తితో ఇప్పుడూ సమస్యలను అధిగమిస్తాం. సమస్యను చూసి వెనకడుగు వేసే ప్రసక్తే లేదు. పూర్తి జవాబుదారీతనం, సమగ్రత, పక్కా ప్రొఫెషనలిజంతో కూడిన పాలన ఎలా ఉంటుందో చూపిస్తా. మాటలతో కాకుండా చేతల్లో దేశాన్ని ఐక్యం చేసి చూపిస్తా'' అని చెప్పారు. ''మనం చెల్లించలేనంత భారీ అప్పులను ముందు తరాలపై రుద్దే ప్రసక్తే లేదు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తా'' అని స్పష్టం చేశారు. అదే సమయంలో పౌరుల సంక్షేమం పట్ల సహానుభూతితో వ్యవహరిస్తామన్నారు. ''మేం పూర్తి స్పష్టతతో రంగంలోకి దిగాం. ఈ క్షణం నుంచే మా పని మొదలైంది. దేశ సంక్షేమం కోసం అహోరాత్రాలూ కష్టపడతాను'' అని ప్రకటించారు. ''మనమంతా కలిసి పని చేస్తే అద్భుతాలు చేసి చూపించొచ్చు'' అంటూ ఆత్మవిశ్వాసం వెలిబుచ్చారు. అందరి ఆకాంక్షలకు అనుగుణంగానే తన పాలన ఉంటుందని ఆశాభావం వెలిబుచ్చారు. ఆ క్రమంలో తాను పలు కఠిన నిర్ణయాలు తీసుకోబోతున్నట్టు స్పష్టమైన సంకేతాలిచ్చారు. ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేస్తున్న విపక్షాలపై రిషి విమర్శలు ఎక్కుపెట్టారు. భార్య అక్షత, కుమార్తెలు కృష్ణ, అనౌష్కలతో కలిసి మాట్లాడతారని అంతా భావించగా రిషి ఒంటరిగానే దాదాపు 6 నిమిషాల పాటు మాట్లాడారు. బ్రిటన్ చరిత్రలో ఓ కొత్త ప్రధాని చేసిన అతి సుదీర్ఘ తొలి ప్రసంగాల్లో ఇదొకటని చెబుతున్నారు. బోరిస్ జాన్సన్ మాత్రం 2019లో బాధ్యతలు చేపట్టాక ఏకంగా 11 నిమిషాల 13 సెకన్లు మాట్లాడారు! తాజా మాజీ ప్రధాని ట్రస్ తన తొలి ప్రసంగాన్ని 4 నిమిషాల్లో ముగించారు.

# ఒకేఒక్కడు

కనీవినీ ఎరుగని ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన బ్రిటన్‌ను గాడినపెట్టే బాధ్యతలు తీసుకున్న రిషి సునాక్‌కు మొదట్నుంచి ఆర్థిక వ్యవహారాల్లో మంచి పట్టు ఉంది. చిన్నతనంలో తల్లి పనిచేసే ఫార్మసీ షాప్‌లో పని చేసినప్పుడే వాటి జమా ఖర్చులన్నీ చూసేవారు. పెరిగిపెద్దయ్యాక ఎంబీఏ చదివి ఇన్వెస్ట్‌మెంట్ రంగంలో ఎక్కువగా పనిచేశారు.

- భారతీయ కుటుంబానికి చెందిన రిషి సునాక్ యూకేలోని హ్యాంప్‌షైర్ సౌతంప్టన్‌లో మే 12, 1980లో జన్మించారు.
- తండ్రి యశ్‌వీర్ కెన్యాలోపుట్టి పెరిగారు. తల్లి ఉష సునాక్ టాంజానియలో పుట్టారు. ఆఫ్రికాలో భారతీయులపై దాడులకి భయపడి వారి కుటుంబం 1960 ప్రాంతంలోనే బ్రిటన్‌కు వలస వెళ్లిపోయింది. తండ్రి వైద్యుడు కాగా, తల్లి ఫార్మసీ నడిపేవారు. వారికి ఇద్దరు మగపిల్లలు. ఒక ఆడపిల్ల. రిషి అందరిలో పెద్దవాడు. తమ్ముడు సంజయ్ సైకాలజిస్టు కాగా, చెల్లి రాఖీ ఐక్యరాజ్యసమితి విద్యా విభాగంలో చీఫ్ స్ట్రాటజిస్ట్‌గా పని చేస్తున్నారు.
- రిషి ప్రాథమిక విద్యాభ్యాసం అంతా హాంప్‌షైర్‌లో సాగింది. కళాశాల విద్య వించెస్టర్‌లో చేశారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఫిలాసఫీ, పాలిటిక్స్, ఎకనామిక్స్ (పీపీఈ) 2001లో గ్రాడ్యుయేషన్ చేశారు.
- అమెరికాలోని కాలిఫోర్నియాలో స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఎంబీఏ చేశారు. అక్కడే ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కుమార్తె అక్షతా మూర్తి పరిచయమయ్యారు. వారిద్దరి మధ్య ప్రేమ చిగురించి పెళ్లికి దారి తీసింది.
- 2009, ఆగస్టులో అక్షతా మూర్తిని వివాహం చేసుకున్నారు. వారికి అనౌష్క, కృష్ణ ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.
- చదువుకున్న సమయంలో హాలీడేస్‌లో సౌథంప్టన్‌లో కర్రీ హౌస్‌లో వెయిటర్‌గా పనిచేశారు. 2001–2004 మధ్య ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, గోల్డ్‌మ్యాన్ సాచ్స్‌లో ఎనలిస్ట్‌గా పనిచేశారు. ఆ తర్వాత హెడ్జ్ ఫండ్స్‌లో(ప్రైవేటు ఇన్వెస్టర్ల సంపద) భాగస్వామిగా ఉన్నారు. ఇన్ఫోసిస్ నారాయణమూర్తికి చెందిన కాటామారన్ వెంచర్స్ ఇన్‌వెస్ట్‌మెంట్ కంపెనీకి 2013–2015 మధ్య డైరెక్టర్‌గా ఉన్నారు.
- 2015లో రాజకీయాల్లోకి అడుగుపెట్టి కన్జర్వేటివ్ పార్టీ తరఫున యార్క్‌షైర్‌లో రిచ్‌మండ్ నియోజకవర్గం నుంచి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యారు.
- థెరిసా మే రెండోసారి ప్రధాని అయినప్పుడు 2018లో స్థానిక వ్యవహారాల శాఖ ఉప మంత్రిగా పని చేశారు
- 2019 సాధారణ ఎన్నికల్లో రిచ్‌మండ్ నుంచే ఎన్నికై 60% ఓట్లను సాధించారు.
- బోరిస్ జాన్సన్ ప్రభుత్వంలో 2019, జులై 24న ట్రెజరీకి చీఫ్ సెక్రటరీగా నియమితులయ్యారు. 2020లో అత్యంత కీలకమైన ఆర్థిక మంత్రి పదవిని చేపట్టారు. కరోనా సంక్షోభ సమయంలో ఆర్థిక మంత్రిగా ఆయన తీసుకున్న నిర్ణయాలు అందరి ప్రశంసలు అందుకున్నాయి. లక్షలాది మంది ఉద్యోగాలు కాపాడుతూ భారీ ఆర్థిక ప్యాకేజీలు ప్రకటించారు
- కోవిడ్‌పార్టీ గేట్ కుంభకోణంలో ఇరుకున్న బోరిస్ జాన్సన్ కేబినెట్ నుంచి వైదొలిగి ఆర్థిక మంత్రి పదవికి రాజీనామా చేశారు.
- జాన్సన్ రాజీనామా చేసిన అనంతరం ప్రధాని పదవికి పోటీ పడ్డారు. అత్యధిక మంది ఎంపీలు ఆయనకు మద్దతునిచ్చినప్పటికీ టోరీ సభ్యుల ఓటింగ్‌లో లిజ్ ట్రస్ చేతిలో 21 వేల ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు.
- అపజయం ఎదురైన చోటే నెలన్నరలోనే సునాక్‌ని గెలుపు వరించడం విశేషం.
- రాజకీయాల్లోకి వచ్చిన ఏడేళ్లలోనే అక్టోబర్ 25న బ్రిటన్‌కు ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించి చరిత్ర సృష్టించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

## అమర్ అక్బర్ ఆంటోనీ..!

మందిరం, మసీదు, చర్చి.. మత సామరస్యం వెల్లి విరిసేలా ఈ మూడు పక్క పక్కనే ఉంటే ఎంతో హృద్యంగా ఉంటుంది కదా. ఇప్పుడలాంటి దృశ్యమే బ్రిటన్‌లో ఆవిష్కృతమైంది. ఒక్కో మతానికి చెందిన వారు ఒక్కో పదవిలో అమర్ అక్బర్ ఆంటోనీ సినిమాను తలపిస్తున్నారు. బ్రిటన్ రాజు కింగ్ చార్లెస్–3 క్రిస్టియన్. లండన్ మేయర్ సాదిక్ ఖాన్ ముస్లిం. 2016లో నగర తొలి ముస్లిం మేయర్‌గా ఎన్నికై రికార్డు సృష్టించారు. పాకిస్తాన్ నుంచి వలస వచ్చిన బస్సు డ్రైవర్ కుమారుడైన సాదిక్ లండన్ లా వర్సిటీ నుంచి న్యాయవాద పట్టా తీసుకొని దశాబ్దానికి పైగా మానవ హక్కుల లాయర్‌గా పనిచేశారు. ఇప్పుడు భారతీయ మూలాలున్న హిందువు రిషి ప్రధాని అయ్యారు. హిందువునని చెప్పుకోవడానికి గర్విస్తానని రిషి ప్రకటించుకున్నారు. మూడు మతాలకు చెందిన ముగ్గురు బ్రిటన్‌లో కీలక హోదాల్లో ఉండటం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందన్న కామెంట్లు వినిపిస్తున్నాయి.

## బ్రిటన్‌లో రిషీరాజ్

▶ మొదటి పేజీ తరువాయి

రిషి ఎన్నిక ఏకగ్రీవమైంది. అలా, నెలన్నర క్రితం లిజ్ ట్రస్‌తో హోరాహోరీగా జరిగిన పోటీలో అందినట్టే అంది త్రుటిలో చేజారిన ప్రధాని పదవి ఈసారి రిషిని వచ్చి వరించింది. తాను హిందువునని ప్రతి వేదికపైనా సగర్వంగా ప్రకటించుకునే రిషి సరిగ్గా దీపావళి పర్వదినం నాడే ప్రధానిగా ఎన్నికవడం భారతీయుల హర్షోత్సాహాలను రెట్టింపు చేసింది. మంగళవారం టోరీ ఎంపీలనుద్దేశించి ప్రసంగించాక ఆయన రాజు చార్లెస్–3ని కలిశారు. అనంతరం దేశ 57వ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. అస్తవ్యస్తంగా మారిన బ్రిటన్ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టే గురుతర బాధ్యత ఇప్పుడు రిషి భుజస్కంధాలపై ఉంది. ఈ విషయంలో విఫలమవడం వల్లే ట్రస్ కేవలం 45 రోజులకే రాజీనామా చేయాల్సి రావడం, బ్రిటన్ చరిత్రలో అత్యంత తక్కువ కాలం పీఎంగా కొనసాగిన చెత్త రికార్డును మూటగట్టుకోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా తన అపారమైన ఆర్థిక అనుభవాన్ని రంగరించి దేశాన్ని రిషి ఎలా ఒడ్డున పడేస్తారన్నది ఆసక్తికరం. ప్రధాని అధికార నివాసం 10, డౌనింగ్ స్ట్రీట్ నుంచి చేసిన తొలి అధికారిక ప్రసంగంలోనూ రిషి ఇదే విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. బ్రిటన్ అత్యంత కఠినమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని అంగీకరించారు. ''ఈ సవాలును దీటుగా ఎదుర్కొనేందుకు ఏ మాత్రం వెనకాడబోను. నాపై ఉన్న ఆకాంక్షలను పూర్తిగా నెరవేరుస్తా''అంటూ ప్రతిజ్ఞ చేశారు. దేశాన్ని బంగారు భవిష్యత్తులోకి నడిపిస్తానంటూ నిండైన ఆత్మవిశ్వాసంతో దేశవాసులకు హామీ ఇచ్చారు.

**రెండు నెలల్లో మూడో ప్రధాని!**

బోరిస్ జాన్సన్, ట్రస్ తర్వాత గత ఏడు వారాల్లో బ్రిటన్‌కు రిషి మూడో ప్రధాని కావడం విశేషం. పార్టీ గేట్ కుంభకోణం తదితరాల దెబ్బకు మంత్రులు సొంత పార్టీ ఎంపీల డిమాండ్‌కు తలొగ్గి జాన్సన్ రాజీనామా చేయడం తెలిసిందే. అనంతరం సెప్టెంబర్లో జరిగిన హోరాహోరీ పోరులో రిషిపై నెగ్గి ట్రస్ ప్రధాని అయ్యారు. ఆర్థిక పరిస్థితిని పెనం నుంచి పొయ్యిలో పడేశారంటూ ఇంటా బయటా తీవ్ర విమర్శల పాలయ్యారు. సొంత ఎంపీలే అవిశ్వాసం పెట్టేందుకూ సిద్ధమవడంతో గురువారం రాజీనామా ప్రకటించారు. మంగళవారం ఆమె చార్లెస్–3కి లాంఛనంగా రాజీనామా సమర్పించారు. తర్వాత రిషి రాజసౌధానికి వెళ్లి రాజుతో లాంఛనంగా భేటీ అయ్యారు.

# ముందున్నది ముళ్లదారే

అపజయం ఎదురైన చోటే విజయాన్ని అందుకొని బ్రిటన్ ప్రధానిగా ఎన్నికైన రిషి సునాక్‌కు ఆ పదవి పూలపాన్పు కాదు. ముందున్నది అంతా ముళ్లబాటే. బ్రెగ్జిట్, కోవిడ్–19 సంక్షోభం, , రష్యా–ఉక్రెయిన్ యుద్ధంతో ఆర్థికంగా కుదేలైపోయిన బ్రిటన్‌ను దారిలోని తీసుకురావాల్సిన అతి పెద్ద సవాల్ ఆయన ఎదురుగా ఉంది.

**ఆర్థిక సవాళ్లు**

బ్రిటన్‌లో ప్రస్తుతం ఎగుమతులయ్యే వ్యయం కంటే దిగుమతులకయ్యే వ్యయం బాగా పెరిగిపోయింది. ఫలితంగా కనీవినీ స్థాయిలో ద్రవ్యోల్బణం 10% దాటిపోయి ధరలు ఆకాశాన్నంటాయి. సామాన్య ప్రజలు ధరాభారాన్ని మోయలేకపోతూ ఉంటే కార్పొరేట్ సెక్టార్ కుదేలైపోయింది. రష్యా ఉక్రెయిన్ యుద్ధ ప్రభావంతో విద్యుత్ బిల్లులు తడిసిమోపెడవుతున్నాయి. రానున్న చలికాలంలో ఫ్రీజింగ్ గ్యాస్‌ను కొనుక్కోవడం కూడా ప్రజలకు భారం కానుంది. దీంతో ఈ సారి చలికాలంలో మరణాలు ఎక్కువగా సంభవిస్తాయన్న అంచనాలున్నాయి. సరైన ఆదాయ మార్గాలు చూపించకుండా ఎడాపెడా పన్ను మినహాయింపులనిస్తూ లిజ్‌ట్రస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మినీ బడ్జెట్‌తో కుదేలైపోయిన మార్కెట్లను బలోపేతం చేయడంపై రిషి దృష్టి సారించాల్సి ఉంది. పన్నులు పెంచుతూ, ఖర్చుల్ని తగ్గించడం రిషి ముందున్న అతి పెద్ద టాస్క్.

**పార్టీ ఐక్యత**

కన్జర్వేటివ్ పార్టీ అంతర్గత విభేదాలతో కొట్టుమిట్టాడుతోంది. టోరీ సభ్యుల మధ్య ఐక్యత కాగడా వేసినా కనిపించడం లేదు. కన్జర్వేటివ్ పార్టీ అధ్యక్షుడిగా పార్టీని ఒక్కతాటిపైకి తీసుకురావల్సి ఉంది. మన పార్టీ మన దేశం ఐక్యంగా ఉండాలని ఇప్పటికే రిషి నినదిస్తున్నారు.

**వలసవిధానం**

బ్రిటన్ అక్రమ వలసలతో సతమతమవుతోంది. నాటు పడవల్లో యూకే తీరానికి ఈ ఏడాది 30వేల మందికి పైగా చేరుకున్నారని అంచనా. ఈ నేపథ్యంలో వలసలపై కఠిన ఆంక్షలు విధిస్తానని ఎన్నికల ప్రచారంలోనే రిషి చెబుతూ వచ్చారు. ప్రతీ ఏడాది వచ్చే శరణార్థుల సంఖ్యపై పరిమితులు విధించాలని యోచిస్తున్నారు. అక్రమంగా వచ్చే వారిని పర్యవేక్షించి వారిని నిర్బంధించడానికి అధికారులకు అదనపు బాధ్యతలు ఇవ్వానికి ఒక ప్రణాళికన తీసుకురావాలని యోచిస్తున్నారు.


**సమ్మెలు**

రాబోయే రోజుల్లో బ్రిటన్‌లో చాలా వర్గాలు సమ్మెకు దిగనున్నాయి. వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, పనిచేసే ప్రాంతంలో పరిస్థితులపై రైలు యూనియన్, సమ్మె నోటీసు ఇచ్చింది. క్రిస్మస్‌కు ముందు దేశంలోని 150 యూనివర్సిటీల్లో 70 వేల మంది సమ్మెకు దిగనున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

# పక్కా హిందూ

''నేను హిందువుని అని చెప్పుకోవడానికి గర్వపడతాను'' అని బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ పలు సందర్భాల్లో బాహాటంగానే ప్రకటించారు. ఎంత ఎదిగినా తన మూలాలను ఆయన ఎన్నడూ మరచిపోలేదు. రిషి బ్రిటన్‌లో పుట్టి పెరిగినప్పటికీ చిన్నప్పట్నుంచి భారత సంస్కృతి సంప్రదాయలను వంటపట్టించుకున్నారు. తరచూ దేవాలయాలను దర్శిస్తూ ఉంటారు. సోమవారం ఉపవాసం చేస్తారు. గోమాంసం ముట్టరు. యూకే రాజకీయాల్లో హిందువునని చెప్పుకునే రిషి పైకి ఎదిగారు. అదే ఆయన ప్రత్యేకత. హిందువులకు అత్యంత పవిత్రమైన భగవద్గీతపైన అపారమైన నమ్మకం. 2015లో మొదటిసారి పార్లమెంటుకు ఎన్నికైనప్పుడు భగవద్గీత మీద ప్రమాణం చేశారు. జాన్సన్ హయాంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించేటప్పుడు కూడా గీతపైనే ప్రమాణం చేశారు .ప్రధానిగా లిజ్ ట్రస్‌తో పోటీ పడే సమయంలో ప్రచారంలోనూ శ్రీకృష్ణ జయంతి రోజున గోపూజ చేస్తున్న ఫొటోలు, వీడియోలతో ఆయన ట్వీట్లు చేశారు.రిషి ఇంగ్లీషుతో పాటు హిందీ, పంజాబీ భాషలు అనర్గళంగా మాట్లాడగలరు. సునాక్‌కు భారత్ పాస్‌పోర్టు కూడా ఉంది. బెంగుళూరుకు చెందిన బ్రాహ్మణ కుటుంబమైన ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి కుమార్తె అక్షతను పెళ్లి చేసుకున్న సునాక్ ఇంట్లో కూడా భారతీయ సంప్రదాయాలనే పాటిస్తారు. వారి ఇద్దరి ఆడపిల్లలు అనౌష్క, కృష్ణని కూడా భారతీయతనే నేర్పిస్తున్నారు. కుటుంబానికి అత్యంత విలువ ఇస్తారు. తన అత్తమామలు ఎప్పటికీ గర్వకారణమని చెప్పుకుంటారు. వారిని కలవడానికి తరచూ బెంగుళూరు వచ్చి వెళుతుంటారు. ప్రతీ ఏటా దీపావళిని ఘనంగా జరుపుకునే సునాక్ ప్రధానిగా దీపావళి రోజే ప్రమాణం చేయడం విశేషం. ఒక హిందువును ప్రధానిగా అంగీకరించడం ద్వారా బహుళ విశ్వాసాలు, వైవిధ్యాలను అంగీకరించగలిగే సహనం యూకే ప్రజలకు బాగా ఉందని అర్థమవుతోంది.



### కుటుంబ నేపథ్యం ఇదీ

రిషి సునాక్ తాత రామదాస్ సునాక్ అవిభాజ్య భారత్‌లో పంజాబ్ రాష్ట్రంలోని గుజ్రనవాలాకు చెందినవారు. 1935 సంవత్సరంలోనే రామదాస్ తూర్పు ఆఫ్రికాలోని నైరోబియాకి వలస వెళ్లిపోయారు. నాన్నమ్మ రాణి సునాక్ ఓ రెండేళ్లు ఢిల్లీలో ఉండి తర్వాత భర్త దగ్గరకి వెళ్లారు. రామదాస్ దంపతులకి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. రిషి సునాక్ తండ్రి యశ్‌వీర్ 1949లో కెన్యాలో జన్మించారు. 1960లో ఆఫ్రికాలో భారతీయులపై జరిగే దాడులకు భయపడి యశ్‌వీర్ యువకుడిగా ఉన్నప్పుడే ఆ కుటుంబం బ్రిటన్‌కు మకాం మార్చి అక్కడే స్థిరపడింది. పంజాబ్ నుంచి టాంజానియా వచ్చి స్థిరపడిన కుటుంబానికి చెందిన ఉషా బెర్రీని యశ్‌వీర్ వివాహం చేసుకున్నారు. ఆ దంపతుల మొదటి సంతానమే రిషి సునాక్. రిషి తాత ముత్తాతలు ఉంటే గుజ్రనవాలా ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉండడంతో ఆ దేశం కూడా రిషి మా వాడే అని అంటోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

# రిచ్ రిషి



రిషి సునాక్ కోట్లకు పడగలెత్తారు. బ్రిటన్‌లో అత్యంత ధనిక ఎంపీగా రికార్డు సృష్టించారు. రిషి సునాక్, ఆయన భార్య అక్షతా మూర్తిల ఆస్తుల విలువ 73 కోట్ల పౌండ్లకు పైగా ఉంటుందని టైమ్స్ ఆఫ్ లండన్ అంచనా వేసింది. బ్రిటన్‌లో అత్యంత సంపన్నులైన 250 మందిలో రిషి కూడా ఉన్నారు. వీరికి ఉన్న ఆస్తుల విలువ బ్రిటన్ రాచకుటుంబానికి ఉన్న ఆస్తుల కంటే ఎక్కువని అంటారు. బ్రిటన్ రాజు చార్లెస్–3, కెమిల్లా ఆస్తుల విలువ 300–350 మిలియన్ పౌండ్లు ఉంటే, దానికి రెట్టింపు ఆస్తుల్ని రిషి కలిగి ఉన్నారు. దీంతో అత్యంత ధనికుడైన ప్రధానిగా కూడా రిషి రికార్డు సృష్టించారు. అయితే తన ఆస్తిపాస్తుల గురించి రిషి ఎప్పుడూ బాహాటంగా వెల్లడించలేదు. రిషి లైఫ్‌స్టైల్ కూడా కాస్ట్లీగా ఉంటుంది. 3,500 పౌండ్లు ఖరీదు చేసే సూట్‌లు, 490 పౌండ్లు ఖరీదైన షూస్ వేసుకుంటారు. 180 పౌండ్ల విలువ చేసే మగ్గులో కాఫీ తాగుతారు. చిన్నప్పట్నుంచి రిషి కుటుంబానికి డబ్బుకి లోటు లేదు. తండ్రి డాక్టర్, తల్లి మందుల దుకాణాన్ని నడిపేవారు. చదువుకి అత్యంత ప్రాధాన్యం ఇచ్చే ఆ కుటుంబం బ్రిటన్‌లో ధనికులు మాత్రమే చదివే వించెస్టర్ కాలేజీలో చేర్పించారు. ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కుమార్తె అక్షతా మూర్తిని వివాహం చేసుకున్నాక ఆయన సంపద మరింత పెరిగింది. ఈ దంపతులకి లండన్, యార్క్‌షైర్, ఇంగ్లండ్, శాంటామోనికా, కాలిఫ్‌లో సొంత ఇళ్లు ఉన్నాయి. రిషి కుటుంబంలో పశ్చిమ లండన్‌లోని కెన్సింగ్‌టన్‌లో అయిదు బెడ్‌రూమ్‌లున్న నివాసంలో ఎక్కువ కాలం గడుపుతారు. ఆ ఇంటి ఖరీదు 70 లక్షల పౌండ్లు ఉంటుంది. ఆయన సొంత నియోజకవర్గమైన రిచ్‌మండ్‌లో 2015లో ఎంపీగా ఎన్నిక కాక ముందు 15 లక్షల పౌండ్లతో ఇల్లు కొన్నారు. ఇప్పుడు మరో 20 లక్షల పౌండ్లతో దానికి హంగులు చేకూరుస్తున్నారు. ఇంటిలోపలే స్విమ్మింగ్ పూల్, జిమ్, యోగా స్టూడియో, హాట్ టబ్, టెన్నిస్ కోర్టు వంటివి ఏర్పాటు చేయడానికి ఏకంగా 4 లక్షల పౌండ్లు ఖర్చు పెట్టారు. అందులో నీళ్లు వేడి చేయడానికే ఏడాదికి 14వేల పౌండ్లు ఖర్చుపెట్టాలి. ఇది ఒక సగటు కుటుంబం విద్యుత్ బిల్లు కంటే ఆరు రెట్లు ఎక్కువ. అక్షతా మూర్తి భారతీయ పౌరురాలిగా కొనసాగుతూ పన్నులు ఎగ్గొట్టారని విమర్శలొచ్చాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

## మళ్లీ హోం మంత్రి బ్రేవర్మన్

లండన్: ప్రధాని కాగానే సునాక్ తన కేబినెట్‌కు టీమ్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. భారతీయ మూలాలున్న సుయెల్లా బ్రేవర్మాన్‌ను మళ్లీ హోం మంత్రిగా నియమించారు. ఆర్థికమంత్రి జెరేమీ హంట్‌ను కొనసాగించనున్నారు. తనకు సానుకూలంగా కాకపోయినా విదేశాంగ మంత్రి జేమ్స్ క్లవర్లీనీ కొనసాగిస్తున్నారు. జాన్సన్ హయాంలో ఉప ప్రధాని, న్యాయ మంత్రిగా పనిచేసిన డొమినిక్ రాబ్‌ను అవే పదవుల్లో నియమించనున్నారు. మంత్రిత్వ శాఖ వ్యవహారాలు చూసే భారతీయ మూలాలున్న ఎంపీ అలోక్ మిశ్రా తన పదవి నుంచి తప్పుకుంటున్నారు.

# సాక్షి శ్రీకాకుళం

బుధవారం, 26, అక్టోబర్, 2022






## పెళ్లయిన మూడు నెలలకే..

రోడ్డు ప్రమాదంలో ఓ ఆర్మీ జవాన్ మృతి చెందాడు. అతనికి వివాహమై మూడు నెలలే అయ్యింది.

- 8లో



## గురుకులాలు కళకళ

జిల్లాలోని గురుకులాలు కళకళలాడు తున్నాయి. సీట్లన్నీ నిండిపోయాయి.

- 8లో

## నరకాసుర వధ



జిల్లా వ్యాప్తంగా దీపావళి వేడుకలు సంబరంలా జరిగాయి. బాణసంచా కాల్చడంతో పాటు పలు గ్రామాల్లో నరకాసురుని వధ నిర్వహించారు. ఎల్ఎన్ పేటలోనిదీ చిత్రం.

– ఎల్ఎన్ పేట

## న్యూస్‌రీల్

### శిక్షణ, ఉపాధి కోర్సుల్లో నియామకాలకు నేడు ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: సర్టిఫికెట్ కోర్సులు, శిక్షణ కోసం అభ్యర్థుల ఎంపిక నిర్వహించను న్నట్లు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరే షన్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్ర దేశ్(సీడాప్), ఏపీఎస్ఎస్‌డీసీ, జిల్లా ఎంప్లాయి మెంట్ ఆఫీస్ వారి ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ అనకాపల్లిలో మాస్టర్ సర్టిఫికెట్ కోర్స్ లో ప్రొడక్ట్ డిజైన్, సీఎన్‌సీ టెక్నాలజీలో మాస్ట ర్ సర్టిఫికెట్ కోర్సు కోసం శిక్షణ ఇస్తారని, వీటి కోసం ఎంపిక ప్రక్రియను చేపడుతున్నట్టు చెప్పారు. మంగళవారం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చిలకపాలెం లోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ఎంపి కల ప్రక్రియను నిర్వహిస్తున్నామన్నారు. డిప్ల మా, బీటెక్, మెకానికల్ ఇంజినీరింగ్, ప్రోడ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్, ఎల క్ట్రికల్ ఇంజినీరింగ్ తదితర కోర్సులు పూర్తిచేసి ఉండాలన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో పాటు బయోడేటా, ఆధార్ కార్డుతో హాజరుకావాలని జిల్లా ఉపాధి అధికారి శ్రీనివాసరావు కోరారు.

### ఫిషింగ్ హార్బర్‌కు స్థల పరిశీలన



బుడగుట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌కు కేటాయించిన స్థలం మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

ఎచ్చెర్ల క్యాంపస్: బుడగుట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ కోసం 41 ఎకరాల స్థలం కేటాయిం చారు. ఈ స్థలాన్ని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మంగళవారం పరిశీలించారు. గుర్తించిన స్థలం , పరిస్థితి, సర్వే నంబర్లతో కూడిన మ్యాప్‌ను చూసి మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫిషింగ్ హార్బర్ పనులు ప్రారంభించేందుకు అనువుగా స్థలం సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం కుప్పిలి గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

### పోలీసు క్రీడలు ప్రారంభం



వాలీబాల్ మ్యాచ్ ప్రారంభిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక


ఎచ్చెర్ల క్యాంపస్: అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఎస్పీ జీఆర్ రాధిక మంగళవారం పోలీసులకు క్రీడా పోటీలను ప్రారంభించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్, సివిల్ పోలీసులు క్రీడల్లో పాల్గొ న్నారు. వారోత్సవాల ముగింపులో విజేతలకు బహుమతులు అందజేస్తారు.

### రెండు వర్గాల మధ్య కొట్లాట




కొట్లాటలో గాయపడిన మాధవ, రాజారావు

ఎల్.ఎన్.పేట: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో మంగళవారం రెండు వర్గాల మధ్య జరిగిన కొట్లాటలో ఏడుగురికి గాయాల య్యాయి. గ్రామ సచివాలయం వద్ద ఆధార్ నమోదు ప్రక్రియ చేస్తుండగా ఒక వర్గానికి చెం దిన వారు తమ వారి ఆధార్ కార్డుల నమోదు ప్రక్రియ ముందుగా చేయాలని డిమాండ్ చేయటంతో.. మరో వర్గానికి చెందిన వారు అందరివీ నమోదు చేయాలన్నారు. ఈ క్రమం లో వారి మధ్య జరిగిన వాదనతో బయటకు వెళ్లిపోవాలని గ్రామ సచివాలయ ఉద్యోగులు వారిని బయటకు పంపించారు. బయటకు వచ్చిన వారు వాదన చేస్తూనే కొట్లాటకు దిగారు. ఘర్షణలో ముద్దాడ మాధవరావు, ముద్దాడ రాజారావు, ముద్దాడ లక్ష్మి, ముద్దాడ నీలవేణి, సిడగాన గోవిందరావు, వంజరాపు సంజీవ్, ఈపీ దాలమ్మలకు గాయాల య్యాయి. సచివాలయ సిబ్బంది సరుబుజ్జిలి పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని 108 అం బులెన్స్ ద్వారా క్షతగాత్రులను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.



శ్రీకాకుళంలోని నాగావళి తీరాన గ్రహణ ప్రారంభ దృశ్యం





## గ్రహణ కాలం

ఆకాశ వీధిలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. అరగంట పాటు సూరీడు చిన్నబోయిన దృశ్యాలను జిల్లా ఆసక్తిగా వీక్షించింది. ఈ గ్రహణ కాలంలో జిల్లా వాసులు కొందరు సం ప్రదాయాలు పాటించగా, మరికొందరు సైన్స్ చిట్కాలు పాటించారు. జిల్లాలోని ప్రధాన ఆలయాలన్నీ ఉదయాన్నే మూసివేశారు. 5.03కు మొదలైన గ్రహణం దాదాపు ముప్పై నిమిషాల కాలం సాగింది. ఫొటోలు: జయశంకర్ కుప్పిలి, సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

# పనికి ప్రణాళిక

- ఉపాధి పనుల కల్పనకు కసరత్తు
- పనుల గుర్తింపు కోసం గ్రామ సభలు
- ప్రజలు, రైతులు కోరుకున్న పనులకే మొదటి ప్రాధాన్యం



శ్రీకాకుళం పాత బస్టాండ్:

పల్లెల్లో ఉపాధి పనులకు ప్రణాళికలు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో చేపట్టబోయే పనుల గుర్తింపునకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం గ్రామ సభలు సైతం నిర్వ హిస్తున్నారు. రైతులు, గ్రామస్తులు తమకు అవస రమైన పనులను ఎంపిక చేసుకుని అధికారులు చెప్పిన గడువులోపు దరఖాస్తు చేసుకునే వెసులు బాటు కల్పించారు. ఎంపిక చేసిన పనులపై ప్రతి పాదనలు రూపొందించి, మంజూరుకు ప్రభు త్వానికి నివేదిక పంపనున్నారు.

జిల్లాలో ఉన్న 30 మండలాల్లో ఇప్పటి వరకు 5,08,504 జాబ్ కార్డులు ఉన్నాయి. ఏటా లక్ష్యాలకు మించి జిల్లాలో ఈ ఉపాధి పనులు జరుగుతున్నాయి. ముందుగా తయారు చేసుకున్న ప్రణాళికల ఆధా రంగా పనులు సకాలంలో చేస్తున్నారు. ఈ పనుల నిర్వహణకు గ్రామ సభలే కీలకం. ఇప్పటికే జాతీ య స్థాయిలో జిల్లా ఉపాధి హామీ పథకం వేత నదారులకు పనులు కల్పించడంలోనూ, మెటీరి యల్ కాంపోనెంటు పనులు చేయడంలోనూ గుర్తింపు ఉంది. రెండు పర్యాయాలు జాతీయ అవార్డులు కూడా వచ్చాయి.

### పనుల వివరాలు..

ఏటా గ్రామాల్లో చేపట్టబోయే పనులను ముం దుగానే గుర్తిస్తారు. ఇందులో మొత్తం 95 రకాలు పనులు ఉంటాయి. వాటిలో మనకు ఏ పనులు అనుకూలంగా ఉంటాయనేది గుర్తించి వా టిని అధికారులకు తెలియజేయాలి. జిల్లా గ్రామీ ణాభివృద్ధి శాఖ అధికారులు మండలాల వారీగా షెడ్యూల్ రూపొందిస్తారు. ఇంకుడు గుంతలు, కం పోస్టు యార్డు, ఫారం పాండ్స్, సామూహిక ఇం కుడు గుంతలు, ఉద్యానవన అభివృద్ధి, శ్మశాన వాటికలు, రైతులు పొలాలకు వెళ్లే రహదారులు, పంట పొలాల్లో పూడికతీత, మంచి నీటి చెరువుల్లో పూడికతీత, మొక్కలు నాటడం వంటి పనులు ఎక్కువగా ఉన్నాయి.

### జోరుగా గ్రామసభలు..

జిల్లాలో 30 మండలాలు ఉన్నాయి. అన్ని మండలాల్లో ఉపాధి పనులు చేసేందుకు అవ కాశం ఉంది. జిల్లాలో 879 గ్రామ సభలు నిర్వహించనున్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి సాధారణ గ్రామసభలు ప్రారంభమ య్యాయి. ఈ సభల్లో ఉపాధి పనులకు సంబం ధించిన ప్రణాళికలు రూపొందించారు. నవం బర్ 14 వరకూ ఈ సభలు నిర్వహించను న్నారు. ఇప్పటి వరకు 811 పూర్తయ్యాయి. ఈ గ్రామ సభల నివేదిక లను అనుసరించి గ్రామం నుంచి వచ్చిన వినతులకు డిసెంబర్‌లో మండల పరిషత్ ఆమోదం, అనంతరం జిల్లా పరిషత్ ఆమోదా నికి పంపిస్తారు. వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరిలో మండలం నుంచి జిల్లా ప్రణాళిక లపై ఉన్నతాధికారులకు నివేదిస్తారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో కొత్త ఆర్థిక సంవత్సరంలో పనులు చేస్తారు.



> **ప్రజల భాగస్వామ్యంతోనే పనులు..**
>
> ఉపాధి హామీ పథకంలో వివిధ రకాల పనులు చేప డుతున్నాం. వీటి ద్వారా ఆయా గ్రామాలకు ప్రయోజనం చేకూరుతోం ది. పనులన్నీ ప్రజలు గ్రామ సభల ద్వారా సూచిం చినవే. షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు నిర్వ హిస్తున్నాం.
>
> – జీబీ చిట్టిరావు, పీడీ, జిల్లా నీటి యాజమాన్యం సంస్థ, శ్రీకాకుళం

## ఆలయాల మూసివేత



జలుమూరు: శ్రీముఖలింగంలో మధుకేశ్వరుని ప్రధాన ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి భక్తులకు దర్శనాలకు అవకాశం ఇవ్వనున్నారు.



శ్రీకూర్మం: శ్రీకూర్మనాథ స్వామి ఆలయం మూసివేస్తున్న అర్చకులు.. గ్రహణం అనం తరం సంప్రోక్షణ చేశారు. బుధవారం వేకువ జాము నుంచి సర్వదర్శనాలుంటాయి.



అరసవల్లి: ఆదిత్యుని ఆలయ ప్రధాన ద్వారాన్ని మూసివేస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు శంకర శర్మ, బృందం. సంప్రోక్షణ అనంతరం బుధవారం ఉదయం 6.30కు సర్వ దర్శనాలకు అనుమతి ఇవ్వనున్నారు.



మందస: మూతపడిన శ్రీవాసుదేవ పెరుమాళ్ ఆలయం. బుధవారం వేకువజా మున శుద్ధి చేయనున్నారు.



శ్రీకాకుళం నగరంలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయాన్ని, మంగళవారం ఉదయం 10.30 గంటలకు మూసివేశారు. సంప్రోక్షణ అనంతరం బుధవారం ఉదయం 3 గంటలకు తెరవనున్నారు.



జిల్లా కేంద్రంలోని పీఎన్‌కాలనీలో నారాయణ తిరుమల ఆలయాన్ని మంగ ళవారం ఉదయం 8.30 గంటలకు మూసి వేశారు. సంప్రోక్షణ పూజల అనంతరం బుధవారం ఉదయం 9 గంటలకు భక్తులను దర్శనాలకు అనుమతించనున్నారు.

# రిమ్స్‌లో ఆరు వాహనాలు దగ్ధం

- బాణసంచాయే కారణమంటున్న అధికారులు
- మెడికల్ విద్యార్థులపై మరికొందరి ఆరోపణలు



మంటల్లో దగ్ధమవుతున్న వాహనాలు

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ మెడికల్ కళాశాలలో సోమవారం అర్ధరాత్రి కొందరు విద్యార్థినులకు చెం దిన ఆరు ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. బాణసంచా కారణంగా ఈ బైక్‌లు కాలిపోయాయని అధికారులు చెబుతున్నప్పటికీ ఈ సంఘటనపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. రాత్రి 11.30 గం టల వరకూ వాహనాలు బాగానే ఉన్నట్లు డ్యూటీ ముగించుకుని హాస్టల్‌కు వచ్చిన హౌస్ సర్జన్‌లు చె బుతున్నారు. ఈ లెక్కన 11.30 గంటల తర్వాత వాహనాలు దగ్ధమైనట్లు తెలుస్తోంది. 10 గంటల వరకే బాణసంచా కాల్చినట్లు హాస్టల్‌లో ఉంటున్న వారు చెబుతున్నారు. అయితే కొందరు విద్యార్థులు మహిళా హాస్టల్ వద్దకు వచ్చి బాణసంచా కాల్చిన స మయంలో విద్యార్థుల మధ్య వాగ్వాదం జరిగింద ని, ఇదే అంశం బైక్‌లు దగ్ధమవ్వడానికి కారణమై ఉండవచ్చని విద్యార్థినుల తల్లిదండ్రులు రిమ్స్ అధి కారుల దృష్టికి తీసుకువచ్చారు. మద్యం మత్తులో కొందరు ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని అను మానం వ్యక్తం చేశారు. సోమవారం అర్ధరాత్రి జరి గిన ఈ సంఘటనపై విద్యార్థినులు వారి తల్లిదండ్రు లకు సమాచారం అందించడంతో మంగళవారం ఉదయానికి వారు హాస్టల్ వద్దకు వచ్చారు. రిమ్స్ అధికారుల విచారణ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిశ్చయించారు. అయితే వాహనాలు దగ్ధ మైన ప్రాంతంలో ఉన్న ట్యూబ్‌లైట్‌లు, ఫ్యాన్‌లు కూ డా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది సమా చారం తెలుసుకుని రిమ్స్‌కు చేరుకునేసరికి ఆరు వాహనాలు, విద్యుత్ పరికరాలు దగ్ధమయ్యాయి.

> **విచారణ జరుపుతున్నాం**
>
> ఈ సంఘటనపై పూర్తి స్థాయి విచారణ చేస్తు న్నాం. 11.30 తర్వాత వాహనాలు దగ్ధమవ్వడం పై కొన్ని అనుమానాలు ఉన్నాయి. విద్యార్థినులు ప్రాథమికంగా ఇచ్చిన సమాచారం మేరకు బాణ సంచాయే సంఘటనకు కారణమని తెలుస్తోంది. పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నాం.
>
> – డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్

# అప్పాపురంలో జ్వరాలు తగ్గుముఖం



అప్పాపురంలో వైద్య శిబిరంలో వైద్య తనిఖీలు చేపడుతున్న వైద్యురాలు డాక్టర్ జోత్స్న



డీఎంహెచ్‌వో మీనాక్షి

అరసవల్లి/లావేరు: లావేరు మండలం అప్పాపు రంలో తీవ్రమైన స్క్రబ్‌టైఫస్ జ్వరాల తీవ్రత ప్రస్తుతానికి తగ్గుముఖం పట్టిందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి తెలిపారు. మంగళవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో సత్ఫలితాలు వచ్చాయని చెప్పారు. స్క్రబ్‌టైఫస్ బ్యాక్టీరియా తో కూడిన జ్వరాలు ఎలుకల ద్వారా వ్యాపి స్తాయని చెప్పారు. జ్వర ల క్షణాలున్న వారికి రిమ్స్‌లో ప్రత్యేక వార్డును కేటాయిం చారని, ఇప్పటివరకు ఐదు పాజిటివ్ కేసులు నమోద య్యాయన్నారు. ఎలుకల గుంపులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ జ్వరాల కేసులు అధికంగా నమోదవుతున్నాయన్నారు. కాగా, మంగళవారం కూడా లావేరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం కొనసాగిం చారు. పీహెచ్‌సీ డాక్టర్ జ్యోత్స్న వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంఎల్‌హె చ్‌పీ వాగ్దేవి, ఆశ కార్యకర్తలు మీనాక్షి, వరలక్ష్మి, ఏఎన్ఎం భారతి గ్రామంలో ఫీవర్ సర్వే చేప ట్టారు. సర్పంచ్ జగ్గురోతు నాగరత్నం, పం చాయతీ కార్యదర్శి లావణ్య, నాయకులు జగ్గు రోతు సత్యనారాయణ మంగళవారం దోమలు, కీటకాల నివారణకు మందును పిచికారీ చేయిం చారు.

## సూర్య గ్రహణంపై అవగాహన

హిరమండలం: సూర్య గ్రహణం రోజున సవర చొర్లంగి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయు డు సీమల మాధవరావు ఆదర్శవంతమైన పని చేశారు. పాక్షిక సూర్య గ్రహణంపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. బడి బయట కూర్చోబెట్టి గ్రహణాలు ఎలా సంభవి స్తాయి, ఎందుకు వస్తాయో వివరించారు. పాము సూర్యుడిని మింగేయడం వంటివి నమ్మకుండా సైన్స్‌ను నమ్మాలని సూచించారు.



సూర్య గ్రహణంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## పాఠశాలలో దీపకాంతులు



జి.సిగడాం మండలం పెంట యూపీ పాఠశాలలో సోమవారం రాత్రి దీపావళి సంబరాలు దేదీప్యమానం గా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు మజ్జి మదన్‌మోహన్ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు సంబ రాలు చేసుకున్నారు. సెలవు రోజయినా రాత్రి పూట టీచర్లంతా హాజరయ్యారు. నాడు–నేడు తర్వాత ఈ బడి రూపురేఖలే మారిపోయాయి.

– జి.సిగడాం

## క్లుప్తంగా

### 28న జెడ్పీ సర్వసభ్య సమావేశం



అరసవల్లి: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 28 నాటికి వాయిదా పడిందని జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ మంగళవారం ప్రకటించారు. బుధవారం ఉదయం నిర్వహించేందుకు ముందుగా నిర్ణయించినా ఈ నెల 26న బీసీ గర్జన కార్యక్రమానికి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో జరగనున్న సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులతో పాటు అన్ని శాఖల ఉన్నతాధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

### ఏఎస్ఐ కుటుంబానికి రూ.లక్ష సాయం



లక్ష్మికి రూ.లక్ష చెక్ అందిస్తున్న పోలీసులు

కాశీబుగ్గ: బారువ పోలీసుస్టేషన్ ఏఎస్ఐ పానిల జోగారావు విధి నిర్వహణలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లభద్రలో ఉంటున్న ఏఎస్ఐ కుటుంబాన్ని పోలీసు అసోసియేషన్ సభ్యులు మంగళవారం పరామర్శించారు. ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు జోగారావు భార్య పానిల లక్ష్మికి జిల్లా పోలీస్ అసోసియేషన్ తరఫున డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి తక్షణ సాయంగా రూ.లక్ష చెక్ అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణ, కోశాధికారి ఎల్.జగన్మోహన్‌రావు, కాశీబుగ్గ సీఐ సాకేటి శంకరరావు, బారువ ఏఎస్ఐ ప్రకాష్, హెచ్‌సీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### 'జీవితాలు నాశనం చేసే పరిశ్రమలు వద్దు'



మాట్లాడుతున్న గ్రామ నాయకులు, యువకులు

రణస్థలం: జీవితాలను పెనుప్రభావం చూపే ఎస్‌పీసీఎల్ వంటి పరిశ్రమలు తమకు వద్దని రణస్థలం పంచాయతీ నారువ పంచాయతీ గ్రామస్తులు, నాయకులు ఆందోళన చేపట్టారు. సోమవారం నారువ గ్రామస్తులు సమావేశమయ్యారు. ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిన ఎస్‌పీసీఎల్ పరిశ్రమ తమకు వద్దని నిరసన వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ ఏకపక్షంగా సాగిందని, గ్రామస్తుల ఆవేదనను పరిగణనలోకి తీసుకోలేదని మండిపడ్డారు. నారువ గ్రామస్తుల అభిప్రాయాలు తీసుకోకుండా పరిసర గ్రామాల నాయకులు మాటలనే పరిగణనలోనికి తీసుకున్నారని చెప్పారు. ఎస్‌పీసీఎల్ పరిశ్రమ ఏర్పాటైతే కాలుష్యం వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయమై కలెక్టర్, ఎస్పీ కార్యాలయ స్పందనలో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ కాటుకుని దేవి, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

### రూ.45వేల విలువైన బాణసంచా స్వాధీనం

కోటబొమ్మాళి: దీపావళి పండగ నాడు అనుమతి లేకుండా మందుగుండు నిల్వ చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కోటబొమ్మాళి ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా మంగళవారం తెలిపారు. చిన్నహరిశ్చంద్రపురంలో జామి గోపాలరావు నుంచి రూ.25 వేలు విలువైన సరుకు, కొత్తపేటలో గుడ్ల గణేష్‌కుమార్ నుంచి రూ.19,500 విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

### బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24సి. 10గ్రా.) | 50,380-00 |
| బంగారం(22సి. 10గ్రా.) | 46,460-00 |
| వెండి (కిలో) | 60,500-00 |

### కోడిగుడ్ల ధరలు

| హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు) | |
|---|---|
| విశాఖపట్నం | రూ. 445.00 |
| విజయనగరం | రూ. 449.00 |
| శ్రీకాకుళం | రూ. 449.00 |

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్‌డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹125 | ₹205 | ₹ 255 |

## గురుకులాలు కళకళ



నరసన్నపేట(గుండవల్లిపేట) గురుకుల పాఠశాలలో యోగా క్లాసులో పాల్గొన్న విద్యార్థులు

- మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయాల్లో సీట్లన్నీ ఫుల్
- టెక్కలి, అంపోలులో సీబీఎస్ఈ సిలబస్ ప్రారంభం
- 11 పాఠశాలల్లో 2794 మందికి తరగతుల నిర్వహణ

నరసన్నపేట: జిల్లాలోని మహాత్మా జ్యోతీబా పూలే(ఎంజేపీ) గురుకులాలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. మెరుగైన విద్య, ఆహ్లాదకర వాతావరణం, పరిశుభ్రమైన తరగతి గదులు, సువిశాలమైన క్రీడా ప్రాంగణాలు, నాణ్యమైన భోజనం తదితర సౌకర్యాలను ప్రభుత్వం కల్పించడంతో ఎంజేపీ స్కూల్స్‌లో ఈ విద్యా సంవత్సరానికి గానూ సీట్లు పూర్తిగా నిండిపోయాయి. తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు గురుకులాలే సరైన ఎంపికని భావిస్తూ వీటిలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు.

**11 పాఠశాలలు.. 2794 మంది విద్యార్థులు..**

జిల్లాలో 11 ఎంజేపీ గురుకులాలు ఉన్నాయి. వీటిలో ఈ విద్యా సంవత్సరంలో 520 మంది ఐదో తరగతిలో ప్రవేశాలు పొందారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో 5600 దరఖాస్తులు రావడం విశేషం. లాటరీ పద్ధతిలో 520 మందిని సీట్ల కోసం ఎంపిక చేశారు. ప్రస్తుతం జిల్లాలో 11 ఎంజేపీ గురుకులాల్లో 2794 మంది విద్యార్థులు చదువుతున్నారు. బాలికల కోసం టెక్కలి, శ్రీకాకుళం, ఆమదాలవలస, పాతపట్నం, పలాసలో.. బాలురు కోసం అంపోలు, నరసన్నపేట(గుండవల్లిపేట), కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, అక్కుపల్లి, లోలుగు(పొందూరు)లో ఎంజేపీ గురుకులాలు నిర్వహిస్తున్నారు. ఆంగ్ల భాషలో తరగతులు నిర్వహిస్తుండగా ఈ విద్యా సంవత్సరం నుంచి టెక్కలి, అంపోలు గురుకులాల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను 8వ తరగతి నుంచి అమలు చేస్తున్నారు. విడతల వారీగా మిగిలిన స్కూల్స్‌లోనూ అమలు చేయనున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే కోటబొమ్మాళి, లోలుగులోనూ కొత్తగా ఎంజేపీ గురుకులాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా సీట్లు ఫుల్ అయ్యాయి.

**విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ..**

- జిల్లాలో మహాత్మా జ్యోతీబా పూలే గురుకుల పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది.
- అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు పుస్తకాలు, ఇతర స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తోంది.
- చదువుకే పరిమితం కాకుండా యోగా క్లాసులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల ఆసక్తి మేరకు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు.
- ప్రస్తుతం అంపోలు, టెక్కలిలో శాశ్వత భవనాలు ఉండగా మిగిలిన గురుకులాల్లోనూ శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ మేరకు అక్కుపల్లి, శ్రీకాకుళంలో స్థల పరిశీలన జరుగుతోంది. మిగిలిన గురుకులాల ప్రిన్సిపాల్స్ ఆయా మండలాల తహసీల్దార్లకు స్థలాల కోసం వినతిపత్రాలు ఇచ్చారు. ఈ విద్యా సంవత్సరం చివరికి అన్ని స్కూల్స్‌కు స్థలాలు కేటాయించి శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసే అవకాశముంది.

**నాణ్యమైన విద్య**



జిల్లాలో 11 గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నాం. ప్రభుత్వం కూడా అన్ని సదుపాయాలు కల్పిస్తోంది.

– జల్లు లక్ష్మణమూర్తి, జిల్లా కన్వీనర్, ఎంజేపీ గురుకుల పాఠశాలలు

**సౌకర్యాలు బాగున్నాయి..**



నేను 9 వతరగతి చదువుతున్నాను. ఇక్కడ అన్ని సదుపాయాలు ఉన్నాయి. చదువుతో పాటు ఆటలు, యోగా క్లాసులు నిర్వహిస్తున్నారు. మంచి వాతావరణం ఉంది. తరగతుల నిర్వహణ, భోజన సదుపాయాలు బాగున్నాయి.

– పి.శశిధర్ సాయిదుర్గ, విద్యార్థి, గుండవల్లిపేట గురుకుల పాఠశాల

## 35 కేజీల కంద..



సాధారణంగా కంద దుంప రెండు మూడు కేజీలు పెరుగుతుంది. కొన్నిసార్లు ఆరు కేజీల దుంపలు మార్కెట్లో కనిపిస్తుంటాయి. అయితే శ్రీముఖలింగం గ్రామానికి చెందిన నందు అనే వ్యాపారి సీతంపేటలో మంగళవారం సుమారు 35 కేజీల కంద దుంప కొనుగోలు చేశారు. శ్రీముఖలింగం మార్కెట్‌లో అమ్మకానికి పెట్టడంతో అందరూ ఆశ్చర్యంగా తిలకించారు. ఉద్యానవన శాఖ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ భూసారంతోపాటు ఎరువులు ఎక్కువగా అందడం వల్ల కంద పెద్దదిగా పెరిగిందని చెప్పారు.

– జలుమూరు

## ఎస్ఐపై దాడికి యత్నం!



ఎస్ఐ రామకృష్ణతో ఘర్షణ పడుతున్న యువకులు

ఇచ్ఛాపురం రూరల్: పండగ పూట గ్రామంలో సమావేశాలు వద్దన్నందుకు ఏకంగా ఎస్ఐపైనే యువకులు దాడి చేసేందుకు ప్రయత్నించిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి గ్రామంలో ఆదివారం రాత్రి ఇరు వర్గాల మధ్య నెలకొన్న తగాదాపై సోమవారం గ్రామస్తులు సమావేశం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో గ్రామపెద్దలు, యువకులు హాజరయ్యారు. ఇదిలా ఉండగా.. సమావేశం కొట్లాటకు దారితీసే పరిస్థితి ఉందంటూ రూరల్ ఎస్ఐ రామకృష్ణకు అందిన సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ రామారావును వెంటబెట్టుకొని ఆయన ఘటనా స్థలానికి వెళ్లారు. దీపావళి పండగ పూట సమావేశం నిలిపివేయాలని గ్రామపెద్దలకు చెప్పగా కొంతమంది వ్యతిరేకించారు. తప్పని పరిస్థితుల్లో స్థానికుల్ని చెల్లాచెదురు చేసేందుకు ప్రయత్నించడంతో కొంతమంది యువకులు ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేసేందుకు ప్రయత్నించారు. స్థానిక పెద్దలు వారించడంతో యువకులు అక్కడి నుంచి జారుకున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ రామకృష్ణ వద్ద ప్రస్తావించగా.. సమావేశాన్ని నిలిపివేయడంతో కోరడంతో చిన్న పాటి ఘర్షణ జరిగిందని, దీనిపై ఎటువంటి కేసు నమోదు చేయలేదని స్పష్టం చేశారు.

## పెళ్లయిన మూడు నెలలకే..

- రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి
- నేడు రాగోలులో అంత్యక్రియలు



దామోదర్‌రావు (ఫైల్)

శ్రీకాకుళం రూరల్: వివాహమైన మూడు నెలల వ్యవధిలోనే ఆ యువకుడిని మృత్యువు వెంటాడటంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలు గ్రామానికి చెందిన సారిపల్లి దామోదర్‌రావు (31) ఆర్మీ ఉద్యోగి. సొంత అక్క కూతురినే ఈ ఆగస్టులో వివాహం చేసుకున్నాడు. తండ్రి మల్లేసు చిన్నతనంలోనే మృతిచెందగా, తల్లి రమణమ్మకు మతి స్థిమితం లేదు. 11 ఏళ్లుగా అమృత్‌సర్‌లోనే పనిచేస్తున్న దామోదర్‌రావుకు కొద్ది రోజుల క్రితమే శ్రీనగర్‌కు బదిలీ అయ్యింది. తల్లితో పాటు భార్యను తీసుకెళ్లేందుకు 15 రోజుల మెడికల్ లీవ్ పెట్టి ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. ఈ నెల 29న శ్రీనగర్‌లో రిపోర్టింగ్ చేసేందుకు రైలు రిజర్వేషన్ కూడా చేసుకున్నారు. పొన్నాం పంచాయతీ గొల్లపేటలో నివాసముంటున్న తన అక్క స్వాతికి నాగుల చవితి పండుగకు చెప్పడానికి సోమవారం ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరిగి వస్తుండగా కె.మన్నయ్యపేట వద్ద ఎదురుగా వస్తున్న సైకిలిస్టును తప్పించబోయి బోల్తా పడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతోఅక్కడికక్కడే మృతిచెందాడు. వివాహం జరిగిన మూడు నెలలకే భర్త మృతిచెందడంతో భార్య కావ్య, కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. కావ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశాల మేరకు శ్రీకాకుళం మండల తహశీల్దార్ ఎస్.వెంకట్రావు సిబ్బందితో కలిసి మంగళవారం రాగోలు గ్రామానికి వెళ్లి దామోదర్‌రావు కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్మీ, పోలీసు సిబ్బంది సమక్షంలో బుధవారం అధికారికంగా అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## బాలికపై సామూహిక లైంగిక దాడి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం ఎస్ఎం పురం పంచాయతీ లింగాలపేటలో సోమవారం రాత్రి 13 ఏళ్ల బాలికపై సామూహిక లైంగిక దాడి జరిగింది. జాతీయ రహదారికి ఆనుకొని లింగాలపేటలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాల్లో పనిచేస్తున్న ఇద్దరు ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినికి వీరితో పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ బాలికను లోబర్చుకుని వీరు ఉంటున్న గదికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. రాత్రి 10.30 గంటలు దాటుతున్నా బాలిక కనిపించకపోవటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందిన చుట్టూ వెతికారు. రాత్రి బాగా చీకటయ్యాక బాలికను ఆ ఇద్దరు యువకులు విడిచిపెట్టడంతో ఆమె ఇంటికి వద్దకు వచ్చింది. ఆందోళనగా కనిపిస్తున్న బాలికను తల్లిదండ్రులు ప్రశ్నించడంతో అసలు విషయం చెప్పింది. దీంతో తల్లి ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికను వైద్య పరీక్షల కోసం రిమ్స్‌లో చేర్పించారు. అత్యాచారం, పోక్సో చట్టం కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాణ చెప్పారు.

**మహిళకు లైంగిక వేధింపులు**

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం కంద్రవీధికి చెందిన బొమ్మలోటు హరికృష్ణ అదే ప్రాంతానికి చెందిన 45 ఏళ్ల మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఎల్. సన్యాసినాయుడు మంగళవారం తెలిపారు. పూటుగా మద్యం తాగి ఈ విధంగా ప్రవర్తించినట్లు చెప్పారు. మహిళ కుడిచేతికి గాయం కావడంతో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించామని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## ఆర్టీసీపై గ్రహణ ప్రభావం

ఆర్టీసీపై సూర్యగ్రహణ ప్రభావం చాలా స్పష్టంగా కనిపించింది. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎప్పుడూ ప్రయాణికులతో కళకళలాడుతూ కనిపించేది. అయితే మంగళవారం సూర్యగ్రహణం కారణంగా చాలామంది ప్రయాణాలు చేయడానికి ఇష్టపడలేదు. ముఖ్యంగా మధ్యాహ్నం నుంచి ప్రయాణికులు లేక కాంప్లెక్స్ నిర్మానుష్యంగా మారింది. దీంతో ఆర్టీసీ అధికారులు కూడా రోజు వారీ తిరిగే బస్సుల సంఖ్య తగ్గించేశారు.

– శ్రీకాకుళం అర్బన్



నిర్మానుష్యంగా ఆర్టీసీ కాంప్లెక్స్



బోసిపోయిన నాన్‌స్టాప్ కౌంటర్



ఖాళీగా కనిపిస్తున్న కాంప్లెక్స్ ఆవరణ

## హౌరా టు కన్యాకుమారి



'హెల్మెట్ లేని డ్రైవింగ్.. ప్రాణానికి అపాయకరం' అంటూ ప్రచారం చేస్తున్నాడో కోల్‌కత్తా కుర్రోడు. ప్రతీక్ శర్మ అనే పాతికేళ్ల బైక్ రైడర్ అక్టోబర్ 9న 'సేఫ్ డ్రైవ్' పేరిట హౌరా నుంచి పాదయాత్ర ప్రారంభించారు. మంగళవారం నాటికి ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి చేరుకొని జాతీయ రహదారిపై వెళ్లే వాహనచోదకులకు సురక్షిత డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. చాలామంది ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించడం లేదని, దీంతో ప్రమాదాల్లో మృత్యువాత పడుతూ కుటుంబానికి తీరని శోకం మిగుల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బైక్ రైడర్‌గా ఇదే అంశాన్ని ప్రచారం చేస్తూ తొలిసారిగా 2350 కిలోమీటర్ల దూరంలో ఉన్న కన్యాకుమారి వరకు పాదయాత్ర కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

–ఇచ్ఛాపురం రూరల్/ఇచ్ఛాపురం

## కార్తీకమాసం.. ఉపవాస దీక్షలమయం

- హరిహరులకు ప్రీతికరమైన మాసం
- ఆలయాలకు పెరగనున్న భక్తుల తాకిడి



శ్రీముఖలింగేశ్వరుని ఆలయం

జలుమూరు: హిందువులకు అత్యంత పవిత్రమైన కార్తీక మాసం ఆరంభమైంది. హరి(విష్ణువు)హరులు(శివుని)కు అత్యంత ప్రీతిపాత్రమైన ఈ నెల రోజులూ ఉపవాస దీక్షలు, నిష్ఠతో పూజలు, ఆలయాలు దర్శనాలు చేస్తే కైలాసం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. దేవతా స్నానం(వేకువజామున) చేస్తే యాగఫలం సిద్ధిస్తుందని విశ్వాసం. ప్రత్యేక సోమవారాలు, ఏకాదశి, శనివారం తోపాటు ఈ నెల రోజులూ పుణ్యదినాలే అని అర్చకులు చెబుతున్నారు.

**అన్నీ ప్రత్యేకతలే..**

- కార్తీక సోమవారం ఆచరించే వారు కైలాసంలో శివ సన్నిధిని చేరుకుంటారని భక్తుల విశ్వాసం.
- సోమవారం నాడు పగలంతా ఉపవాస దీక్షలో ఉండి సాయంత్రం శివుడికి అభిషేకం చేస్తారు. ఉపవాస దీక్షలు చేయలేనివారు, ఉదయాన్నే స్నానం చేసి స్వామివారిని దర్శించుకోవాలి. మధ్యాహ్న భోజనం చేసిన రాత్రికి అల్పాహారం తింటే సరిపోతుంది.
- కార్తీక మాసంలో నదీస్నానం మంచిది. అవకాశం లేని వారు కాలువలు, ఇంటి వద్ద ప్రాతఃకాల స్నానాలు చేసి ఆలయాలు సందర్శిస్తే శుభం కలుగుతుంది.
- శివకేశవులతో పాటు ఇష్టదైవాలకు ఆరాధన చేయడం మంచిది. ఆవు నెయ్యి, నువ్వుల నూనెతో దీపారాధన చేయడం ఎంతో శ్రేష్ఠం. నదులు, జలాశయాలు, చెరువులు, కాలువల్లో దీపాలు వదలడం వల్ల పాపాలు తొలగి, పుణ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం.
- ఉసిరి చెట్టు ఉన్న తోటల్లో వన భోజనం చేస్తే పాపాలు తొలగి విముక్తి పొందుతారని, తర్వాత దామోదరుడైన విష్ణుమూర్తి అనుగ్రహం పొందవచ్చని అర్చకులు చెబుతున్నారు.

**కార్తీక స్నానం శ్రేష్ఠం..**



కార్తీక మాసంలో దేవతా స్నానం(వేకువజామున) చేసి ఆలయాలు సందర్శిస్తే పాపాల నుంచి విముక్తులు అవుతారు. దాన ధర్మాలు చేయడం వల్ల దేవతా అనుగ్రహం కలుగుతుంది.

– నూర నారాయణమూర్తి, అర్చకులు, శ్రీముఖలింగం దేవస్థానం (ఫొటో62సి)

**మోక్షం కలుగుతుంది..**



కార్తిక మాసంలో శివకేశవులను పూజిస్తే మోక్షం కలుగుతుంది. మహాశివుడిని తెల్ల జిల్లేడు పూలతో పూజిస్తే దీర్ఘాయుష్సు, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుంది.

– పంచాది రేవతి, భక్తురాలు, శ్రీముఖలింగం



శ్రీముఖలింగం ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

## 7 నుంచి జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు



వాలీబాల్ గేమ్‌కు సన్నద్ధమవుతున్న బాలురు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల క్రీడల(స్కూల్ గేమ్స్) పోటీల రెండో దశ పోరుకు షెడ్యూల్ ఖరారైంది. ఇప్పటికే వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలు జరిగిన విషయం తెలిసిందే. వీటికి కొనసాగింపుగా వాలీబాల్, కబడ్డీ, ఖోఖో మూడు క్రీడాంశాలను కలుపుకొని మొత్తం 32 కేటగిరీల్లో నవంబర్ 7 నుంచి 10 వరకు జిల్లాస్థాయి అండర్-14, అండర్-17 ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంతోపాటు కోడిరామ్మూర్తి స్టేడియంలో నిర్వహించనున్నట్టు ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, డీఈఓ గార పగడాలమ్మ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ తెలిపారు.

## క్లుప్తంగా

### 30న సూత్రా ఫౌండేషన్ వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: ఈ నెల 30న సూత్రా ఫౌండేషన్ 8వ వార్షికోత్సవం జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకుడు నిక్కు హరిసత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముగ్గురు ప్రముఖులకు సత్కారం, పేద కళాకారులకు వస్త్రాల పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు. శివశ్రీనృత్య కళానికేతన్ శ్రీకాంత్ శిష్యబృందం నృత్య ప్రదర్శన ఉంటుందని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### పశువులకు లంపీస్కిన్ టీకాలు


అదపాకలో ఆవుకు టీకా చేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్

లావేరు: పశువులకు లంపీ స్కిన్ వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని బెజ్జిపురం పశువైద్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జి.లావణ్య అన్నారు. అదపాక, బెజ్జిపురం గ్రామాల్లో మంగళవారం సచివాలయాల వెటర్నరీ అసిస్టెంట్లు పశువులకు లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ దోమలు, ఈగలు కుట్టడం వల్ల కాప్రీపోక్సు అనే వైరస్ ద్వారా పాడి పశువులకు లంపీ స్కిన్ సోకుతుందన్నారు. జ్వరం, దద్దుర్లు, కడతలు, కాళ్ల వాపులు, పాల ఉత్పత్తి తగ్గడం, చూడు నిలవకపోవడం వంటి లక్షణాలు ఉంటాయని వివరించారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు టీకాలు వేస్తే వ్యాధి రాకుండా ఉంటుందని తెలిపారు.

### వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ


సాయికుమార్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ చంద్రశేఖర్

రణస్థలం: పాతర్లపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ తండ్రి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మామయ్య పిన్నింటి రామచంద్ర నాయుడు సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సుభద్రాపురంలో ఫీవర్ సర్వే


ఫీవర్ సర్వే చేపడుతున్న వైద్య సిబ్బంది

లావేరు: మండలంలోని సుభద్రాపురంలో విషజ్వరాలు ప్రబలడంతో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తాళ్లవలస సచివాలయం ఏఎన్‌ఎం బి.భారతి, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ కార్యకర్తలు మంగళవారం గ్రామంలో పర్యటించి ఫీవర్ సర్వే చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు పారిశుధ్య పనులు చేయించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

### అందుబాటులో ఆధార్ సేవలు


వివరాలు అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంతవురిటి పంచాయతీ సర్పంచ్ బుడారి లక్ష్మణరావు కోరారు. పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డులో ఎటువంటి లోపాలు ఉన్నా సరిచేసుకోవాలన్నారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల పిల్లలు ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ వి.వైకుంఠరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ గొర్లె నాగరాజు, కార్యదర్శి హిమబిందు, వీఆర్‌ఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహన వేలం నేడు

గార: మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పట్టుబడిన ఎక్సెల్ వాహనాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఉదయం 11 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నామని ఎస్‌ఐ ఎం.మధుసూదనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంవీఐ అంచనా మేరకు రూ.18 వేలుగా నిర్ణయించామని, ఆసక్తి కలిగిన వారు రూ.100 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

# వెలుగుల వేడుక

అరసవల్లి:ఇంటింటా దీపాల కాంతులు, టపాసుల వెలుగుల నడుమ దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. పెద్దల ఆశీస్సులు ఉండాలని మొక్కుతూ రకరకాల పిండివంటలను నివేదన చేస్తూ దీపాలు వెలిగించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అంతా టపాసులు కాల్చుతూ ఆనందోత్సాహాలతో సందడి చేశారు. పలు ఆలయాల్లో లక్ష్మీపూజలు ఘనంగా నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


టపాసుల వెలుగులు


శ్రీకాకుళం నగరంలో దీపావళి సంబరాలు


శ్రీకాకుళంలో బాణసంచా కాల్చుతున్న చిన్నారి


జీటీ రోడ్డులో మందుగుండు కాల్చుతూ..


లావేరు: వస్త్రపురి కాలనీలో దీపాల వెలుగులో క్రాకర్స్ కాల్చుతున్న మహిళలు


సూర్యమహల్ వద్ద నరకాసురుడి దిష్టిబొమ్మను దహనం చేస్తూ..



అరసవల్లి: ఆదిత్యుని సన్నిధిలో బాణసంచా వెలుగులు


శ్రీకాకుళం నగరంలో దీపావళి సంబరాలు


శ్రీకాకుళం నగరంలో టపాసులు కాల్చుతూ సందడి చేస్తున్న యువత


శ్రీకాకుళం కల్చరల్: కోదండ రామాలయంలో ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు


శ్రీకాకుళం కల్చరల్: ఏపీహెచ్‌బీ కాలనీలోని చిన్మయ మిషన్‌లో లక్ష్మీదేవికి పూజలు


ఆకాశ దీపాన్ని ఎగురవేస్తున్న దృశ్యం

## ఆకతాయిలపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ గొండు రఘురామ్

గార: మండలంలో ఆకతాయిలు బైక్‌లపై మితిమీరిన వేగంతో వెళ్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే తగు చర్యలు చేపట్టాలని ఎంపీపీ గొండు రఘురామ్ ఎస్‌ఐ మధుసూదన్‌ను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీసీ రోడ్డు, బూరవెల్లి రోడ్డులో బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించాలని సూచించారు. తహశీల్దార్ సనపల సుధాసాగర్ మాట్లాడుతూ ఆరు పంచాయతీల పరిధిలో భూసర్వే పూర్తయ్యిందని, ప్రతి పొలానికి కొత్త నెంబరు కేటాయించామన్నారు. ఇప్పటికే వివరాలను ఆన్‌లైన్ చేశామని, అన్నీ సక్రమంగా ఉన్నవారికి ఒన్‌బీ కాపీలు అందజేస్తామని చెప్పారు. ఎంపీడీఓ శిమ్మ రామ్మోహనరావు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఇప్పటివరకు 10 పంచాయతీల్లో పూర్తయ్యిందని, ప్రజల విన్నవించిన పనుల కోసం ప్రత్యేక గ్రాంటు విడుదల చేయాలని అంచనాలు వేసి ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు.

## పేదల ఇంటి వద్దకే వైద్యం


రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

జి.సిగడాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల ఇంటి వద్దకే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేత పున్నాన అక్కలనాయుడు అన్నారు. మంగళవారం పెంట పంచాయతీ సర్పంచ్ పున్నాన సోనియా ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచాలకే పరిమితమై కదల్లేని స్థితిలో ఉన్న రోగులకు ఇంటి వద్దకు వచ్చి వైద్యసేవలు అందించడం వరంలాంటిదన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం వైద్యులు గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఆకాశం రాము, బి.సాయి దివ్య, ఆశపు సుభాషిణి, భాస్కరరావు, ఏఎన్‌ఎం నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెల్లదోమపై అప్రమత్తం


నరసన్నపేట: వరి పైరుపై దోమ పోటును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నరసన్నపేట: వరి పైరుకు తెల్లదోమ ఆశిస్తుందని రైతులు నివారణ చర్యలు చేపట్టాలని రాగోలు, కేవీకే ఆమదాలవలసకు చెందిన శాస్త్రవేత్తలు టి.శ్రీలత, నీలిమ, కె.మధుకుమార్ అన్నారు. మండలంలోని రావులవలసలో మంగళవారం పర్యటించి వరి పైర్లును పరిశీలించారు. పైర్లకు దోమ ఆశించి ఉండటాన్ని గుర్తించారు. దోమ వరి దుబ్బుకు అడుగు భాగంలో ఉంటుందని, క్రిమిసంహారిక మందులు అడుగు భాగాన పిచికారీ చేయాలన్నారు. పరుగు మందులు పిచికారీ ఉదయం కాకుండా సాయంత్రం వేళల్లో చేయడం మంచిదని తెలిపారు. నీటి యాజమాన్య పద్ధతులు వివరించారు. నరసన్నపేట వ్యవసాయాధికారి కె.సునీత ఉన్నారు.

**వరి పంటను ఆశించిన సుడిదోమ**

పోలాకి: వరి పంట ఆఖరి దశలో చాలాచోట్ల సుడిదోమ (బిపిహెచ్) ఆశించటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సాంబమసూరి (బిపిటి), సాధన (అంకూర్), జగిత్యాల సన్నాలు (జెజిఎల్) వంటి వరిపంటకు ఎక్కువ తీవ్రత ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. రైతు భరోసా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్లను సంప్రదించి పురుగు మందులను పిచికారీ చేపడుతున్నారు. ఏఓ చిరంజీవి పలు గ్రామాల్లో దోమ ఆశించిన పంటను పరిశీలించారు. వాతావరణంలో మార్పులు కారణంగా దోమ ఉద్ధృతి పెరిగిందన్నారు. నివారణకు పైమెట్రోజిన్, బప్రోబెజిన్, థయామాధిక్సామ్ వంటి రసాయనాలను మోనోక్రోటోఫాస్‌తో కలిపి తగిన మోతాదులో పిచికారీ చేయాలని సూచించారు.

## కిరాణా దుకాణం దగ్ధం

సరుబుజ్జిలి: పెద్దపాలెం పంచాయతీ పరిధిలోని చినపాలెం గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో వెంపాడ మల్లేశ్వరరావుకు చెందిన కిరాణా దుకాణం పూర్తిగా కాలిపోయింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. ప్రమాదంలో ఫ్రిజ్, నగదు, సామానులు, ద్విచక్రవాహనం పూర్తిగా దగ్ధమైయ్యాయన్నారు. ఘటనా స్థలాన్ని సర్పంచ్ సర్ధరి గురువులునాయుడు, ఎస్సై కృష్ణప్రసాద్, రెవెన్యూ ఇనస్పెక్టర్ వెంకటగిరి పరిశీలించారు.


పూర్తిగా కాలిపోయిన దుకాణం

### బాధ్యులను కఠినంగా శిక్షించాలి

శ్రీకాకుళం: కవిటి మండలం శిలగాం సమీపంలో కోతుల మృతి విచారకరమని, ఈ ఘటనపై అటవీశాఖ సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కఠిన చర్యలు చేపట్టాలని గ్రీన్‌మెర్సీ సంస్థ సీఈఓ రమణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వన్యప్రాణుల మనుగడకు విఘాతం కలిగించే వారి కదలికలపై నిఘా ఉంచాలని కోరారు. వానరాల సామూహిక ఊచకోత వ్యవహారాన్ని కలెక్టర్‌కు, జిల్లా అటవీ శాఖ అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

### జాతీయస్థాయి ఖోఖో పోటీలకు క్రీడాకారుల పయనం


బాలికల జట్టుతో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

ఇచ్ఛాపురం: ఈనెల 29వ తేదీ నుంచి పూణేలోని పల్టాన్‌లో జరుగనున్న 32వ జాతీయ స్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు బాలికల జట్టు పయనమైందని కోచ్ కె.లత తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పురపాలక బాలికోన్నత పాఠశాల ఆవరణలో క్రీడాకారులను అభినందించారు. ఆంధ్రప్రదేశ్ తరఫున పోటీల్లో పాల్గొంటున్న బాలికల జట్టుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మవల్లి, పెద్దలు, రోటరీ క్లబ్ ప్రతినిధులు, దాతలు మాట్లాడుతూ.. పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

### జాతీయ స్థాయిలో ప్రతిభ


గాయిత్రి

నరసన్నపేట: జాతీయ స్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మండలంలోని మాకివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె.గాయిత్రి ప్రథమ స్థానం సాధించింది. శాస్త్రవేత్త మోల్ జయంతిలో భాగంగా ఈ నెల 23న అంతర్జాతీయ మోల్ దినోత్సవం నిర్వహించారు. రేవతి సైన్స్ ఫౌండేషన్ రామచంద్రపురం ఆధ్వర్యంలో 'రసాయన శాస్త్రంలో మోల్ పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. దీంట్లో 310 మంది పాల్గొనగా గాయిత్రి ప్రథమ స్థానంలో నిలిచారని హెచ్‌ఎం సుజాత తెలిపారు. విద్యార్థినికి ప్రశంసాపత్రంతో పాటు రూ.1000 నగదు అందజేశారన్నారు. విద్యార్థినికి సైన్స్ ఉపాధ్యాయుడు ప్రగడ చౌదరినాయుడు, లక్ష్మీనారాయణ తదితరులు అభినందించారు.

## బీటీ రోడ్డు మరమ్మతులకు రూ.16.50 లక్షలు


మంత్రి ధర్మానకు సమస్య వివరిస్తున్న డి.మత్స్యలేశం గ్రామస్తులు

శ్రీకాకుళం రూరల్: గార మండలం కె.మత్స్యలేశం పంచాయతీ రామకోటి స్తంభం నుంచి బందరువానిపేట బ్రిడ్జి వరకూ తారురోడ్డు మరమ్మతుల నిమిత్తం రూ.16.50 లక్షలు మంజూరైనట్లు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. మంగళవారం పెదపాడులోని క్యాంపు కార్యాలయానికి కె.మత్స్యలేశం పంచాయతీ పెద్దలు విచ్చేసి రోడ్డు పరిస్థితిని వివరించారు. మంత్రి ధర్మాన వెంటనే స్పందించి ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ ఎల్.శ్రీనివాసరెడ్డితో ఫోన్లో మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా గతంలో రూ.16.50 లక్షలు అంచనా వేశారని, దాన్ని వెంటనే మంజూరు చేస్తున్నట్లు వివరించారు. భవిష్యత్‌లో ఈ రోడ్డును శాశ్వతంగా సిమెంట్ రోడ్డుగా మార్చేందుకు అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డా లలిత, బొడ్డా ఎర్రన్న, కెప్టెన్ మైలపల్లి ఎర్రన్న, వాసుదేవరావు, గుంటు రామచంద్రరావు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుడికి ఘన నివాళి


శ్రీనివాసరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పోలీసులు, గ్రామస్తులు

రణస్థలం: అమరవీరుడైన రొక్కం శ్రీనివాసరావుకు కాకినాడ ఏపీఎస్‌పీ పోలీస్ సిబ్బంది మంగళవారం ఘన నివాళులు అర్పించారు. మండల కేంద్రంలోని జె.ఆర్.పురం గ్రామానికి చెందిన రొక్కం అలివేణి భర్త రొక్కం శ్రీనివాసరావు గ్రేహౌండ్స్‌లో పనిచేస్తూ ఉమ్మడి విజయనగరం జిల్లా కొమరాడ మండలంలో 1980 ఆగస్టు 9న మావోయిస్టుల ఎదురుకాల్పులో ప్రానాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాలను పురస్కరించుకని కాకినాడ 3వ బెటాలియన్ ఏపీఎస్‌పీ పోలీసు సిబ్బంది, గ్రామపెద్దలు, నివాళులు శ్రీనివాసరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

## దోమల నివారణకు చర్యలు


స్ప్రే చేయిస్తున్న సర్పంచ్, పంచాయతీ సిబ్బంది

లావేరు: మండలంలోని గోవిందపురం పంచాయతీ గోవిందపురం, ఇజ్జాడపాలెం, భరిణికాం, లుకలాపుపేట గ్రామాల్లో దోమలు, కీటకాలు నివారణకు మంగళవారం పారిశుధ్య కార్మికులతో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు. సర్పంచ్ పిల్లా రాము, పంచాయతీ కార్యదర్శి పి.లక్ష్మీనారాయణ పనులు పర్యవేక్షించారు. ఏఎన్‌ఎం ఎస్.రమణమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ, సచివాలయ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలయాలు మూసివేత


మూతపడిన పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయం


శ్రీచక్రపీఠంలో మహామేరువుకు పూజలు చేస్తున్న ఆలయ పీఠాధిపతి బాలభాస్కరశర్మ

శ్రీకాకుళం కల్చరల్/ఎచ్చెర్ల/క్యాంపస్: సూర్యగ్రహణం నేపథ్యంలో పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత దేవాలయాన్ని మంగళవారం ఉదయం 9 గంటలకు మూసివేశారు. బుధవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శన అవకాశం కల్పిస్తామని అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ పేర్కొన్నారు. ఎచ్చెర్ల మండలం కొంచాల కూర్మయ్యపేటలోని శ్రీచక్రపీఠంలోని 1001 మేరువుల ఆలయాన్ని ఉదయం 9 గంటలకు మూసివేశారు. బుధవారం సంప్రోక్షణ అనంతరం ఉదయం 7 గంటలకు అభిషేకం, నిత్య అర్చన నిర్వహించనున్నట్లు ఆలయ పీఠాధిపతి బాలభాస్కరశర్మ తెలిపారు.

## క్లుప్తంగా...

### కనువిందు చేసిన పాక్షిక సూర్యగ్రహణం

న్యూఢిల్లీ: దేశంలోని చాలా ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం సంభవించిన పాక్షిక సూర్యగ్రహణాన్ని జనం ఆసక్తికరంగా తిలకించారు. లద్దాఖ్‌లోని హన్లే, ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్‌లలోని ఖగోళ టెలిస్కోపుల్లో పరిశోధకులు, ఔత్సాహికుల్లో పాక్షిక గ్రహణాన్ని వీక్షించారు. శ్రీనగర్‌లో గరిష్టంగా 55% గ్రహణం కనిపించగా, ఢిల్లీలో 43%, బెంగళూరులో 9.9% సంభవించింది. భారత్‌లో తర్వాతి సూర్యగ్రహణం 2032లో కన్పించనుంది.

### శ్వేతసౌధంలో దీపావళి



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షభవనం వైట్‌హౌస్‌లో సోమవారం భారీ ఎత్తున దీపావళి వేడుకలు జరిగాయి. చారిత్రక ఈస్ట్ రూంలో అధ్యక్షుడు బైడెన్ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ సహా 200 మంది ప్రముఖ భారతీయ అమెరికన్లు పాల్గొన్నారు. 'అమెరికా అభివృద్ధికి అడుగడుగునా సహకారం అందిస్తూ దేశం ఆత్మను ప్రతిబింబిస్తున్న దక్షిణ ఆసియన్లకు అధ్యక్షుడు బైడెన్, ఆయన సతీమణి జిల్ బైడెన్ కృతజ్ఞతలు తెలిపారు. 'మిమ్మల్ని ఈ కార్యక్రమానికి ఆహ్వానించినందుకు గర్వంగా ఉంది. ఇక్కడ ఇంతటి భారీ స్థాయిలో దీపావళి వేడుకలు జరపడం ఇదే మొదటిసారి. చరిత్రలో మునుపెన్నడూ లేనంతగా ఎక్కువ మంది ఆసియా–అమెరికన్లు ఇక్కడ ఉన్నారు. దీపావళి వేడుకను అమెరికన్ సంస్కృతిలో సంతోషకరమైన భాగంగా చేసినందుకు ధన్యవాదాలు' అని బైడెన్ పేర్కొన్నారు. ఆహూతులు భారతీయ సంప్రదాయ దుస్తులు చీర, లెహెంగా, షెర్వాణీ వంటివి ధరించి వచ్చారు. వేడుకల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భారతీయ వంటకాలను వడ్డించారు.

### కర్ణాటకలో స్వామీజీ ఆత్మహత్య

దొడ్డబళ్లాపురం: కర్ణాటకలో మరో స్వామీజీ బలవన్మరణానికి పాల్పడ్డారు. బెంగళూరు సమీపంలోని రామనగర జిల్లా మాగడిలోని శ్రీ కంచుగల్ బండెమఠానికి చెందిన బసవలింగ స్వామీజీ (45) డెత్‌నోట్ రాసి సోమవారం అర్ధరాత్రి కిటికీ ఊచలకు ఉరేసుకున్నారు. ఈ మఠానికి భారీగా ఆస్తులున్నాయి.

# 'డర్టీ బాంబ్' కలకలం!



**ఉక్రెయిన్, రష్యా పరస్పర ఆరోపణలు**

కీవ్: 'డర్టీ బాంబ్'తయారీపై ఉక్రెయిన్, రష్యాల పరస్పర ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. అణు ధార్మికత కలిగిన డర్టీ బాంబ్‌ను తమపై ప్రయోగించి రెచ్చగొట్టేందుకు ఉక్రెయిన్ ప్రయత్నాలు చేస్తోందంటూ రష్యా రక్షణ మంత్రి సెర్గీ షోయిగూ ఆరోపించారు. ఉక్రెయిన్ ప్రయత్నాలను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. పశ్చిమదేశాలు ఉక్రెయిన్‌కు వంతపాడుతున్నాయని ఆరోపించారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని బ్రిటన్, ఫ్రాన్సు, టర్కీ, అమెరికాలను కోరతామన్నారు. ఈ ఆరోపణలపై ఉక్రెయిన్ తీవ్రంగా స్పందించింది. రష్యా సేనలు ఆక్రమించుకున్న జపొరిఝియా అణు ప్లాంట్ వద్ద వారం రోజుల నుంచి రహస్య కార్యకలాపాలు సాగుతున్నాయని ఉక్రెయిన్ అణు ఇంధన సంస్థ స్పష్టం చేసింది. దీనిపై దర్యాప్తు జరిపితే డర్టీబాంబ్ ఆరోపణల్లో నిగ్గు తేలుతుందని పేర్కొంది. డర్టీబాంబ్‌ను తమ దేశంలోకి ప్రయోగించేందుకు కుట్ర పన్నుతున్న రష్యా..ప్రపంచ దేశాల దృష్టి మళ్లించేందుకే ఇటువంటి ఆరోపణలు చేస్తోందని ఉక్రెయిన్ కొట్టిపారేసింది. ఆ ప్రాంతంలో ఏం జరుగుతోందో తెలుసుకునేందుకు వెళ్లిన జపొరిఝియా ప్లాంట్ ఉక్రెయిన్ సిబ్బందిని, అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) పరిశీలకులను గానీ రష్యా బలగాలు అనుమతించడం లేదని మంగళవారం ఆరోపించింది. నిల్వ ఉంచిన అణు ధార్మిక వ్యర్థాలు, అణు పదార్థాలను వినియోగించుకుని ఉగ్రదాడి జరిపేందుకే రష్యన్లు ప్రయత్నిస్తున్నట్లు భావించాల్సి వస్తోందని అనుమానాలు వ్యక్తం చేసింది. అణు ప్లాంట్‌లోని 174 కంటైనర్లలో వినియోగించిన అణు ఇంధన పదార్థాలున్నాయని వెల్లడించింది. పేలుడు జరిపి వీటిని ధ్వంసం చేయడం వల్ల ఉక్రెయిన్‌తోపాటు చుట్టుపక్కల దేశాల్లో కూడా వందల కొద్దీ కిలోమీటర్ల దూరం వరకు ప్రమాదకరమైన అణు ధార్మికత వ్యాపిస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. రష్యా ఆధీనంలోని జపొరిఝియాలో ఏం జరుగుతోందో తెలుసుకోవాలని అణు శక్తి సంస్థను ఉక్రెయిన్ అణు ఇంధన సంస్థ కోరింది. రష్యా ఆరోపణలను అమెరికా కూడా కొట్టి పారేసింది. ఉక్రెయిన్ డర్టీబాంబ్‌ను తయారు చేస్తోందన్న వార్తలు అబద్ధాలు మాత్రమేనని పేర్కొంది. తాము చేయాలనుకున్న వాటిని ఇతర దేశాలపై రుద్దుతూ ఆరోపణలు చేయడం రష్యాకు అలవాటేనంది. కాగా, తమ హెచ్చరికలను కొట్టిపారేయడాన్ని రష్యా ప్రతినిధి పెష్కోవ్ ఖండించారు. తీవ్రంగా తీసుకోవాల్సిన విషయాన్ని తేలిగ్గా తీసిపారేయడం ఆమోదయోగ్యం కాదన్నారు.

### దళిత కుటుంబంపై కాల్పులు

**మధ్యప్రదేశ్‌లో ఘోరం... ముగ్గురి మృతి**

దామోహ్: తన భార్య వైపు చూస్తున్నాడనే ఆగ్రహంతో ఓ వ్యక్తి జరిపిన కాల్పుల్లో ఓ దళితుడు, అతడి తల్లిదండ్రులు ప్రాణాలు కోల్పోగా అతడి ఇద్దరు సోదరులు గాయపడ్డారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం దామోహ్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. దేవ్‌రన్ గ్రామానికి చెందిన దళిత వ్యక్తి(32) తరచూ తన భార్య వైపు చూస్తున్నాడంటూ అదే గ్రామానికి చెందిన జగ్‌దీశ్ పటేల్ ఆగ్రహంతో ఉన్నాడు. ఇదే కారణంతో మంగళవారం ఉదయం గ్రామానికే చెందిన మరికొందరితో కలిసి తుపాకీతో కాల్పులు జరిపాడు. కాల్పుల్లో సదరు దళితుడు, అతని తల్లిదండ్రులు(60, 52) చనిపోగా సోదరులు (30, 28) గాయపడ్డారు. క్షతగాత్రులిద్దరూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు జగదీశ్ పటేల్‌ను అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మరో ఐదుగురు నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు ఎస్పీ డీఆర్ తేనివార్ చెప్పారు. నిందితులపై అట్రాసిటీ కేసు సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు.

### తమిళనాడు పేలుడు.. ఐదుగురి అరెస్ట్

కోయంబత్తూర్: తమిళనాడులో కోయంబత్తూర్‌లో ఆదివారం కారులో పేలుడు సంభవించి ఒకరు మృతి చెందిన ఘటనపై కఠినమైన చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం కింద కేసు నమోదైంది. పేలుడుకు సంబంధమున్నట్లు అనుమానిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసి, ఉగ్ర కోణంలోనూ దర్యాప్తు చేపట్టినట్లు కోయంబత్తూర్ నగర పోలీస్ కమిషనర్ బాలకృష్ణన్ చెప్పారు. అరెస్టయిన వారిలో కొందరిని జాతీయ దర్యాప్తు సంస్థ 2019లోనే ప్రశ్నించిందన్నారు. వీరి కార్యకలాపాలపై అప్పటి నుంచి రాష్ట్రపోలీసులు కన్నేసి ఉంచారని కూడా చెప్పారు. వీరిలో కొందరు కేరళకు కూడా రాకపోకలు సాగిస్తున్నారన్నారు. సిలిండర్ పేలి చనిపోయిన జెమిషా ముబీన్‌కు మొహమ్మద్ అజారుద్దీన్‌కు లింకుందా అని దర్యాప్తు చేస్తున్నారు.

### 'నిషేధం'లోనూ పేలిన బాణాసంచా

**ఢిల్లీలో విషమ స్థాయికి వాయు కాలుష్యం**

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో బాణాసంచాపై నిషేధం వెలవెలబోయింది. దీపావళి రోజు అర్ధరాత్రి వరకు చాలా ప్రాంతాల్లో ప్రజలు పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చారు. ఢిల్లీలో వాయు కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాణాసంచా కాల్చరాదని ప్రజా చైతన్య యాత్రల వంటివి నిర్వహించాయి. బాణాసంచా కాలిస్తే జరిమానా, 6 నెలల జైలు శిక్ష అంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయినప్పటికీ ప్రజలు పట్టించుకోలేదు. సిస్టమ్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్ కాస్టింగ్ అండ్ రీసెర్చ్ (సఫర్) ప్రకారం మంగళవారం ఉదయం ఢిల్లీలోని గాలి నాణ్యత చాలా పేలవంగా ఉంది. దీపావళి రాత్రి ఢిల్లీ, దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లోని అనేక ప్రాంతాల్లో పీఎం 2.5 స్థాయి 400 దాటింది. సఫర్ ప్రకారం మంగళవారం ఉదయం ఢిల్లీలోని ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 323 (చాలా పేలవమైన) కేటగిరీలో ఉంది. అక్షరధామ్, ఇండియా గేట్, అశోక్ విహార్, ఐటీఓ, ముండ్కా సహా ఇతర ప్రాంతాల్లో పొగమంచు కనిపించింది. అదే సమయంలో, సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సీపీసీబీ) ప్రకారం, సోమవారం రాత్రి 10 గంటలకు ఐటీఓ ప్రాంతంలో పీఎం 2.5 స్థాయి 458 కాగా, మంగళవారం ఉదయం 339గా నమోదైంది. ఢిల్లీలోపాటు తమిళనాడు, హరియాణా, పంజాబ్, యూపీ, రాజస్తాన్‌ల్లోని చాలా నగరాలు పట్టణాల్లోనూ వాయు నాణ్యత పేలవం, అతి పేలవంగా నమోదైందని అధికారులు తెలిపారు. దేశ రాజధాని ప్రాంతంలోని ఇతర నగరాల్లోనూ దాదాపు ఇలాంటి పరిస్థితే నెలకొంది. సోమవారం రాత్రి 11 గంటలకు ఘజియాబాద్‌లోని ఇందిరాపురంలో పీఎం 2.5 స్థాయి 500, నోయిడా సెక్టార్–62లో పీఎం 2.5 స్థాయి 500, గురుగ్రామ్‌లోని సెక్టార్–51లో రాత్రి 9 గంటల ప్రాంతంలో పీఎం 2.5 స్థాయి 447గా నమోదైంది. దీపావళి తర్వాత.. మంగళవారం ఉదయం, ఢిల్లీ యూనివర్సిటీ నార్త్ క్యాంపస్‌లో ఏక్యూఐ 382, ద్వారక 369, ఆర్కేపురం 360, నెహ్రూ నగర్ 371, ఇండియా గేట్ 347, పూసా 322 గా నమోదయ్యాయి. కాగా సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు గణాంకాల ప్రకారం గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దీపావళి సందర్భంగా వాయు కాలుష్య తీవ్రత కాస్త తక్కువగా ఉంది.

### కొరడాతో కొట్టించుకున్న సీఎం



దుర్గ్: గౌరీ–గౌరా పూజ సందర్భంగా ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్ కొరడా దెబ్బలు తిన్నారు. దుర్గ్ జిల్లాలో దీపావళి మరుసటి రోజు గౌరా–గౌరీ పూజ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా జరిగే ఉత్సవంలో చెడు తొలగించేందుకు పూజారులు భక్తుల చేతిపై కొరడాతో కొడతారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా సీఎం భూపేశ్ బఘేల్ ఈ వేడుకలో పాల్గొన్నారు. చేతి మణికట్టుపై కొరడా దెబ్బలు కొట్టించుకున్నారు. రాష్ట్ర ప్రజల కోసం వేడుకలో పాల్గొన్నట్లు ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

# ...అయినను ప్రధాని అయ్యాడు!



"నేను ఇండియాకో, సౌదీకో ప్రధాని కాగలనా? మీరే చెప్పండి. అలా జరుగుతుందని ఊహకు కూడా అందడం లేదు. అస్సలు అవకాశమే లేదు కదా! బ్రిటన్లో 85 శాతం శ్వేతజాతీయులే. వాళ్లు తమ ప్రధానిగా తమలో ఒకరిని చూడాలనుకుంటారే తప్ప శ్వేతేతరుణ్ని కాదు. అంతెందుకు, నేనిప్పుడు ఇండియా వెళ్లి ప్రధాని పదవి చేపట్టగలనా? అక్కడి వాళ్లు నాకా అవకాశమిస్తారా?"

– బ్రిటన్‌లో ప్రజాదరణ పొందిన ఓ రేడియో షోలో వ్యాఖ్యాత గొంతెత్తుకుని అరుస్తున్నాడు. రిషి ప్రధాని కావడంపై బ్రిటన్లోని సాధారణ పౌరుల్లో కూడా చాలామందిది ఇదే భావన. కానీ మర్యాద ముసుగులో బయటపడటం లేదంతే. బ్రిటన్లో స్థిరపడ్డ ఓ హిందూ మూలాలున్న వ్యక్తి 10–డౌనింగ్ స్ట్రీట్లో అడుగు పెట్టడం అక్కడివాళ్లకు అస్సలు రుచిస్తున్నట్టు లేదు. కొన్ని ప్రధాన పత్రికలు దీనిపై బాహాటంగానే పతాక శీర్షికల్లో అసంతృప్తి వెళ్లగక్కాయి. కానీ, ఎంపీలు ఎన్నుకున్నారు. రాజు ఓకే చెప్పేశాడు. బ్రిటన్‌లో ఓ హిందూ మూలాలున్న వ్యక్తి పాలన మొదలైపోయింది కూడా! పోటీ నుంచి అర్ధాంతరంగా తప్పుకున్న బోరిస్ జాన్సన్ గానీ, పెన్నీ మోర్డంట్ గానీ, లోలోపల తెగ ఇబ్బంది పడుతున్న సామాన్య పౌరులు గానీ ఇప్పుడిక చేసేదేమీ లేదు. రిషిని ఇప్పటికిప్పుడు పదవి నుంచి దించడం ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యం కూడా కాదు. నిజానికి రిషి ప్రధాని కావడం బ్రిటన్ చరిత్రలో ఓ కీలక మలుపు. ప్రజాస్వామ్య విలువలకు మైలురాయి.

**అతనే దిక్కు!**

బ్రిటన్‌ను ఆర్థికంగా నిండా ముంచినంత పనిచేసిన తాజా మాజీ ప్రధాని లిజ్ ట్రస్ అసంబద్ధ నిర్ణయాలను సరిచేయడం రిషి ముందున్న సవాళ్లలో అతి ప్రధానమైనది. రాణి కన్నుమూసింది. కొత్త రాజు ఇంకా కుదురుకోవాల్సి ఉంది. పౌండ్ విలువ నానాటికీ పతనమవుతోంది. మొత్తమ్మీద బ్రిటన్ క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఆర్థిక మంత్రిగా సమర్థంగా పని చేసిన అనుభవమున్న రిషికి ఈ పరిస్థితుల్ని చక్కదిద్దడం అంత కష్టం కాకపోవచ్చు. నిజానికి బ్రిటన్‌కు ఇప్పుడతనే దిక్కు. ట్రబుల్ షూటర్ కూడా! రానున్న రోజుల్లో బ్రిటన్ ఆర్థిక పరిస్థితి పుంజుకుంటుందా, మరింత దిగజారుతుందా అన్నది కాలమే తేలుస్తుంది. ఏది ఏమైనా బ్రిటన్‌ను ఓ హిందువు ఏలుతుండటం సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన ఘట్టం. అయితే ఇది జాతివివక్ష లేని బ్రిటన్‌కు తార్కాణం మాత్రం కాదు. ఇటీవల హిందూ ప్రార్థనా స్థలాలపై అక్కడి లీసెస్టర్‌షైర్ వంటి చోట్ల జరిగిన దాడులను ఇంకా ఎవరూ మర్చిపోలేదు. అందుకే, 'రిషి హిందువు అయినప్పటికీ ప్రధాని అయ్యాడు తప్పితే హిందువు కావడం వల్ల మాత్రం కాద'న్న ఓ విశ్లేషకుని వ్యాఖ్య అక్షరసత్యం.

**హిందూ ఫోబియా**

అసలు విషయానికొస్తే, హిందువులపై జరిగిన దాడులను అక్కడి పత్రికలు ఎంత ఘోరంగా చిత్రించిందీ అందరికీ తెలుసు. ఒకరకంగా వారిలో హిందూ ఫోబియా (హిందువులంటే భయం) కన్పించింది. అక్కడి చాలామంది మేధావుల్లో, విశ్లేషకుల్లో కూడా హిందువులంటే అంత మంచి అభిప్రాయమేమీ లేదు. వారి వ్యాఖ్యల్లో ఈ విషయం పదేపదే గోచరిస్తుంది. రిషి అత్యున్నత స్థానాన్ని అధిష్టించడం ఈ పెడ ధోరణిని మారుస్తుందా అంటే, ఇప్పుడే చెప్పలేం. అయినా వీటిని రిషి పెద్దగా పట్టించుకోకపోవచ్చు. ప్రస్తుతానికి ఆయన దృష్టంతా బ్రిటన్ ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టడంపైనే ఉంటుంది.

**కొసమెరుపు:** ఒకప్పుడు ఇదే 10–డౌనింగ్ స్ట్రీట్ నుంచి ఏళ్ల తరబడి బ్రిటన్‌ను ప్రధానిగా ఏలిన విన్‌స్టన్ చర్చిల్ హిందువులపై, భారతీయులపై అప్పట్లో అసందర్భ, అసంబద్ధ వ్యాఖ్యలు చేసి కించపరిచాడు. ఇప్పుడు ఆ హిందువుల్లోనే ఒకరు అదే 10–డౌనింగ్ స్ట్రీట్లోకి సగర్వంగా అడుగు పెట్టాడు. అది కూడా ఆ దేశ ప్రధాని హోదాలో!

– ఎస్.రాజమహేంద్రారెడ్డి

## క్లుప్తంగా

### 31న విజ్ఞాన్‌లో ఇన్‌బిక్స్–22 అంతర్జాతీయ కాన్ఫరెన్స్

**హాజరుకానున్న నోబెల్ బహుమతి గ్రహీత రాబర్ట్స్**



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న లావు శ్రీకృష్ణదేవరాయలు, తదితరులు

చేబ్రోలు: గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీకి ఈ నెల 31న నోబెల్ బహుమతి గ్రహీత సర్ రిచర్డ్ జె.రాబర్ట్స్ రానున్నట్టు వర్సిటీ వీసీ కార్యాలయం మంగళవారం తెలిపింది. విజ్ఞాన్‌లో ఫ్రాంటీర్స్ ఇన్ న్యూట్రిషన్, మెడికల్ జీనోమిక్స్ అండ్ డ్రగ్ డిస్కవరీ (ఇన్‌బిక్స్–22) అనే అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు సర్ రిచర్డ్ జె.రాబర్ట్స్ హాజరవుతారని పేర్కొంది. ఈయనతో పాటు బెంగళూరులోని ఐఐఎస్సీ మాజీ డైరెక్టర్, బైరాక్ చైర్మన్, పద్మభూషణ్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ జి.పద్మనాభన్, గౌరవ అతిథులుగా యూఎస్‌ఏ–కొలంబస్‌లోని ఓహియో స్టేట్ వర్సిటీ ప్రొఫెసర్ డీపీఎస్ వర్మ, హైదరాబాద్‌లోని సీడీఎఫ్‌డీ డైరెక్టర్ కె.తంగరాజ్, తదితరులు హాజరు కానున్నారు. ఇన్‌బిక్స్–22 అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన బ్రోచర్‌ను విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు మంగళవారం ఆవిష్కరించారు.

### ముఖ్యమంత్రిని కలిసిన ఏపీ సడా వైస్ చైర్మన్ రఘురాం



తాడేపల్లిగూడెం: సీఎం వైఎస్ జగన్‌ను క్యాంపు కార్యాలయంలో ఏపీ సడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆక్వా రైతుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సాధికారత కమిటీలో స్థానం కల్పించినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఆక్వా జోన్ పరిధిలోకి వచ్చిన రైతులకు యూనిట్‌కు రాయితీ ధరతో విద్యుత్ అందించడం, దాణా ధరలు అందుబాటులోకి రావడానికి, కౌంటుల వారీగా గిట్టుబాటు ధరలు లభించడానికి ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం అందించడం వల్ల ఆక్వా రైతులు ఆనందంగా ఉన్నారని వివరించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధమవ్వండి

**ఎమ్మెల్యేలు చెవిరెడ్డి, అనిల్‌కుమార్ పిలుపు**



మాట్లాడుతున్న చెవిరెడ్డి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ఎమ్మెల్సీ ఎన్నికలకు తూర్పు రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ జిల్లా పరిశీలకులు, ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించి జగనన్నకు కానుకగా ఇద్దామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు పార్టీ నేతలను సమాయత్తం చేసేందుకు మంగళవారం తిరుపతి శిల్పారామంలో చెవిరెడ్డి అధ్యక్షతన చంద్రగిరి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఆదిమూలం, తదితరులు పాల్గొన్నారు.

**నా ఆదాయం, ఆస్తుల్లో 70 శాతం నియోజకవర్గ ప్రజలకే: చెవిరెడ్డి**

తన ఆదాయం, ఆస్తుల్లో 70 శాతం చంద్రగిరి నియోజకవర్గం ప్రజల కోసమే వెచ్చిస్తున్నట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. 25 శాతం తన కుటుంబానికి, మిగతా 5 శాతం తన వ్యక్తిగత ఖర్చుల కోసం కేటాయిస్తున్నట్లు ఆయన వివరించారు.

### ప్రాథమిక మెరిట్ జాబితా విడుదల



సాక్షి, అమరావతి: పీజీ డెంటల్ డిగ్రీ/డిప్లొమో కోర్సుల్లో 2022–23 విద్యా సంవత్సరానికి రాష్ట్ర కోటా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న నాన్–సర్వీస్ వైద్యుల ప్రాథమిక మెరిట్ జాబితాను ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ మంగళవారం విడుదల చేసింది. సవరించిన నీట్–ఎండీఎస్ 2022 స్కోర్ ఆధారంగా దరఖాస్తులు పరిశీలించి జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు. మెరిట్ జాబితాలో 591 మంది వైద్యులకు స్థానం దక్కింది.

# 291 మంది స్పెషలిస్ట్ వైద్యుల నియామకం

**డీఎంఈలో 74, ఏపీ వీవీపీలో 217 పోస్టులు భర్తీ**

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య శాఖ చరిత్రలో ముందెన్నడూ లేనివిధంగా స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యుల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, వైద్య, ఇతర సిబ్బంది కొరత ఉండకూడదన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఏకంగా 40 వేలకు పైగా పోస్టులను భర్తీ చేశారు. 2019 వరకు ఖాళీగా పోస్టులను భర్తీ చేయడంతోపాటు పెరిగిన జనాభా, ఆస్పత్రుల్లో రోగుల తాకిడి, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త పోస్టులను వేలాదిగా సృష్టించారు.



మూడు రోజుల్లో 291 మంది స్పెషలిస్ట్‌ల నియామకం

ఈ క్రమంలో డీఎంఈలో 223 అసిస్టెంట్ ప్రొఫెసర్, ఏపీ వైద్య విధాన పరిషత్ (ఏపీ వీవీపీ)లో 400 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్(సీఏఎస్ఎస్) పోస్టుల భర్తీకి గత వారంలో మూడు రోజులపాటు వాక్–ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీటికి వైద్యుల నుంచి మంచి స్పందన లభించింది. మూడు రోజుల్లో డీఎంఈ విభాగంలో స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీలకు సంబంధించి 74 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్, ఏపీ వీవీపీలోని 14 స్పెషాలిటీలకు సంబంధించి 217 సీఏఎస్ఎస్ పోస్టులను వైద్య శాఖ భర్తీ చేసింది. వీరందరికీ ఏ రోజుకు ఆ రోజే పోస్టింగ్ ఉత్తర్వులను జారీ చేశారు. ఉత్తర్వులు పొందిన అభ్యర్థులు చాలామంది ఇప్పటికే తమకు కేటాయించిన స్థానాల్లో రిపోర్ట్ చేశారు. మిగిలిన పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని ఏపీవీవీపీ కమిషనర్ వినోద్‌కుమార్ తెలిపారు. పలు పోస్టుల్లో అభ్యర్థులు ఉన్నప్పటికీ రిజర్వేషన్ నిబంధనలు వర్తించక భర్తీ కాలేదన్నారు. ఆయా పోస్టులకు ఎన్నిసార్లు నోటిఫికేషన్లు ఇచ్చినా కొన్ని రిజర్వేషన్‌లో అభ్యర్థులు లేక మిగిలిపోతున్నాయన్నారు. ఈ క్రమంలో నిబంధనలకు అనుగుణంగా రిజర్వేషన్లలో మార్పులు చేసి మిగిలిపోయిన పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

# పెరగనున్న సీనియర్ రెసిడెంట్ సీట్లు

- ప్రస్తుతం ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 800కు పైగా ఎస్ఆర్ సీట్లు
- ఇక దంత కళాశాలల్లోనూ, ఆస్పత్రుల్లోనూ ఎస్ఆర్ సీట్లు
- మొత్తం సీట్లు 1,400కు చేరే అవకాశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లో సీనియర్ రెసిడెంట్ (ఎస్ఆర్) డాక్టర్ల సంఖ్యను పెంచాలని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అధికారులు యోచిస్తున్నారు. ప్రస్తుతం 800 ఎస్ఆర్ సీట్లు ఉండగా ఇవి 1,400కు చేరే అవకాశం ఉందని చెబుతున్నారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా యూనిట్‌కు ఒక ఎస్ఆర్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 11 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉన్నాయి. వీటిలో 800కు పైగా ఎస్ఆర్ సీట్లు ఉన్నాయి. ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా వైద్య కళాశాలలు, ఆస్పత్రులతోపాటు దంత కళాశాలలు, ఆస్పత్రుల్లోనూ ఎస్ఆర్ పోస్టులను అందుబాటులోకి తీసుకు రాబోతున్నారు. దీంతో క్లినికల్, నాన్ క్లినికల్‌లో పీజీ, ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీ ఇలా అన్ని విభాగాల్లో సీనియర్ రెసిడెంట్ సీట్ల సంఖ్య 1,400కు చేరే అవకాశం ఉంది. ఆయా కోర్సులు పూర్తి చేసిన అనంతరం ఏడాది పాటు ఎస్ఆర్‌లుగా సేవలు అందిస్తారు. రెసిడెంట్ స్పెషలిస్ట్ డిగ్రీ (పీజీ) అభ్యర్థికి నెలకు రూ.70 వేలు, రెసిడెంట్ డెంటల్(పీజీ) అభ్యర్థికి రూ.65 వేలు, రెసిడెంట్ సూపర్ స్పెషలిస్ట్‌కు రూ.85 వేలు చొప్పున ప్రభుత్వం స్టైపెండ్ ఇస్తుంది. ప్రభుత్వ నియామకాల్లో ఎస్ఆర్‌గా పనిచేసిన వారికే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో ఎస్ఆర్‌లకు డిమాండ్ ఎక్కువగానే ఉంటోంది.

**పెరగనున్న వైద్యుల సంఖ్య**

ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా ఎస్ఆర్ సీట్ల సంఖ్యను పెంచాలని నిర్ణయించాం. ఇందుకు కసరత్తు చేస్తున్నాం. త్వరలో నోటిఫికేషన్ జారీ చేస్తాం. దరఖాస్తు చేసుకున్న వైద్యుల మెరిట్ జాబితా ఆధారంగా ఎంపిక చేపడతాం. ఇప్పటికే వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లో వైద్యుల కొరతకు తావులేకుండా రెండు వేలకు పైగా పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. ఎస్ఆర్ సీట్ల పెంపుతో ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో ఇంకా వైద్యులు అందుబాటులోకి వస్తారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతాయి. ప్రొఫెసర్‌లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు వైద్య సేవలతోపాటు బోధనపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. కానీ ఎస్ఆర్‌లు కేవలం వైద్య సేవలకే పరిమితమవుతారు. ఈ నేపథ్యంలో రోగులకు మరిన్ని వైద్య సేవలు అందుతాయి.

– డాక్టర్ వినోద్ కుమార్, ఇన్‌చార్జ్ డీఎంఈ

తెలంగాణ

# బీజేపీ పతనం మునుగోడుతోనే ప్రారంభం

**విద్యుత్ శాఖమంత్రి జగదీశ్‌రెడ్డి**



మునుగోడు: కేంద్రంలో తమకు మించిన పార్టీ మరొకటి లేదని విర్రవీగుతున్న బీజేపీ.. మునుగోడు ఉపఎన్నిక తర్వాత పతనం అవుతుందని విద్యుత్ శాఖమంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. దేశ వ్యాప్తంగా సీఎం కేసీఆర్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బీజేపీ నాయకులు మునుగోడు ఉప ఎన్నిక తీసుకొచ్చారని ఆరోపించారు. మంగళవారం ఆయన మునుగోడులో టీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీజేపీకి అమ్ముడుపోయిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. ఓటర్లను కొనుగోలు చేసి గెలిచేందుకు ఎత్తులు వేస్తున్నారని, ఆయన ఎత్తులను చిత్తు చేసేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో టీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఉందని, అయితే బీజేపీ నాయకులు మాత్రం వారికే అనుకూలంగా ఉందని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

### జ్వరం బారిన రాజగోపాల్‌రెడ్డి



మునుగోడు: మునుగోడు బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జ్వరం బారినపడ్డారు. మంగళవారం నాంపల్లి మండలంలో ఆయన ప్రచారం చేయాల్సి ఉండగా.. రద్దు చేసుకుని మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో చికిత్స పొందారు. బుధవారం ఆయన మునుగోడు మండలంలో ప్రచారం చేస్తారని బీజేపీ నాయకులు తెలిపారు.

### లక్ష మందితో 30న టీఆర్ఎస్ సభ!

**హాజరుకానున్న సీఎం కేసీఆర్**



సాక్షి, హైదరాబాద్: మునుగోడు ఉప ఎన్నిక ప్రచారం మరో వారం రోజుల్లో ముగియనుండటంతో అధికార టీఆర్ఎస్ పార్టీ తన ప్రచార వ్యూహానికి మరింత పదును పెడుతోంది. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ఎదురైన అనుభవాలు మునుగోడులో పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. నియోజకవర్గాన్ని 86 యూనిట్లుగా విభజించి ప్రతి ఓటరును కలిసేలా ప్రణాళిక అమలు చేస్తోంది. ఈ నెల 30న చండూరులో భారీ బహిరంగ సభకు సన్నాహాలు చేస్తున్నారు. సీఎం కేసీఆర్ ఈ సభలో పాల్గొననున్నారు. కాగా, ప్రతి ఓటును కీలకంగా భావిస్తున్న టీఆర్ఎస్.. పోస్టల్ బ్యాలెట్లపైనా దృష్టి సారించింది.


### పెండింగ్‌లో ఏడు బిల్లులు

- తెలంగాణ రాష్ట్ర సర్కారుకు గవర్నర్ తమిళిసై షాక్
- తనకు విస్తృత అధికారాలున్నాయని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ మధ్య విభేదాలు, వివాదాలు తారస్థాయికి చేరుతున్నాయి. రాష్ట్ర శాసనసభ, శాసనమండలి ఆమోదం పొందిన బిల్లులను రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నెలన్నర రోజులుగా పెండింగ్‌లో ఉంచడం చర్చనీయాంశమవుతోంది. దీపావళి సందర్భంగా సోమవారం రాజ్‌భవన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించిన గవర్నర్, సామాన్య ప్రజానీకం నుంచి పండుగ శుభాకాంక్షలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ బిల్లుల విషయమై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. 'శాసనసభలో పాసైన బిల్లులకు ఆమోదం తెలిపే అంశం పూర్తిగా నా పరిధిలోనిది. గవర్నర్‌గా నాకు విస్తృత అధికారాలుంటాయి. నా పరిధిలోనే నేను నడుచుకుంటున్నాను..'అని తమిళిసై స్పష్టం చేశారు. మరోవైపు తనకయ్యే ఖర్చును తానే సొంతంగా చెల్లిస్తున్నానని, ప్రభుత్వ సొమ్మును ఉపయోగించుకోవడం లేదని తెలిపారు. గవర్నర్ సోదరి ఒకరు కొంత కాలం పాటు రాజ్‌భవన్‌లో ఉండటంపై అభ్యంతరాలు వచ్చిన నేపథ్యంలో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

# చేనేతపై జీఎస్టీ కోరింది కేటీఆరే

**ప్రధానికి పోస్ట్ కార్డు రాయడంపై బండి సంజయ్ ఆగ్రహం**



సాక్షి, హైదరాబాద్/ చౌటుప్పల్: చేనేతపై జీఎస్టీని రద్దు చేయాలంటూ ప్రధానికి మంత్రి కేటీఆర్ పోస్ట్ కార్డు రాయడంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మండిపడ్డారు. చేనేత వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ విధించాలంటూ కేంద్రాన్ని కోరింది కేటీఆరేనని పేర్కొన్నారు. ఈ విషయమై కేటీఆర్ మాట్లాడిన వీడియో క్లిప్పింగులు కూడా ఉన్నాయన్నారు. 'జీఎస్టీ సమావేశాల్లో పాల్గొన్నప్పుడు చేనేతపై జీఎస్టీ రద్దు చేయాలని ఎందుకు కోరలేదు? ట్విట్టర్ టిల్లు దీనికేం సమాధానం చెబుతారు?' అని సోమవారం ఒక ప్రకటనలో నిలదీశారు. చౌటుప్పల్‌లో మీడియాతో మాట్లాడుతూ కూడా ఈ మేరకు ప్రశ్నించారు. చేనేతపై జీఎస్టీ అంశానికి సంబంధించి మంత్రి కేటీఆర్, ఇతర నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్విట్టర్ టిల్లు మునుగోడు ఓట్ల కోసం ఇప్పుడు ఏదేదో మాట్లాడుతున్నారని, అప్పటి జీఎస్టీ సమావేశంలో తాగి పాల్గొన్నారా? అని ఎద్దేవా చేశారు.

సాక్షి ఫ్యామిలీ

శ్రీకాకుళం

బుధవారం ॥ 26-10-2022



దీప్‌మాలా పాండే

స్పెషల్లీ ఛాలెంజ్డ్ పిల్లలను
మిగతా సాధారణ పిల్లల్లాగే తీర్చిదిద్దాలంటే ఎంతో సహనం కావాలి.
తల్లిదండ్రులకే వారి పెంపకం పెద్ద పరీక్షలా అనిపిస్తుంది.
వాళ్ల పనులు వారు చేసుకుంటే చాలు అనే స్థితికి వచ్చేస్తుంటారు.
కొందరు అలాంటి స్పెషల్ స్కూల్స్ ఎక్కడ ఉన్నాయో
అక్కడకు తీసుకెళ్లి జాయిన్ చేస్తుంటారు.
కానీ, అందరు పిల్లలు చదువుకునే స్కూళ్లలోనే
600 మంది స్పెషల్ చిల్డ్రన్‌ని చేర్పించి ప్రత్యేక శిక్షణ ఇస్తూ,
సాధారణ పౌరులుగా తీర్చడానికి కృషి చేస్తోంది దీప్‌మాలా పాండే.
ఇటీవల మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆమె కృషిని
ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించారు.
బరేలీలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రిన్సిపల్‌గా ఉన్న దీప్‌మాలా
కృషి గురించి తెలుసుకుంటే ఈమెను 'స్పెషల్ టీచర్' అనకుండా ఉండలేం.
ఇలాంటి టీచర్లు మన దగ్గరా ఉండాలని కోరుకోకుండా ఉండలేం.



స్కూల్‌లో విద్యార్థులతో దీప్‌మాలా పాండే

# స్పెషల్ టీచర్

బరేలీ మధ్యప్రదేశ్‌లోని ఒక సిటీ. ఇక్కడి ప్రాథమికోన్నత పాఠశాల ప్రిన్సిపల్‌గా విధులు నిర్వర్తిస్తోంది దీప్‌మాలా. సాధారణ పిల్లలతోపాటు ప్రత్యేకమైన పిల్లలను కూడా కూర్చోబెట్టి, వారికి పాఠాలను బోధించడమే కాదు రాయడంలోనూ మిగతావారిలాగే సమర్థులుగా తీర్చిదిద్దాలనే ప్రయత్నం చేస్తున్నారు. 'దీనిని నేను ఒంటరిగానే ప్రారంభించాను. కానీ, ఇప్పుడదే ప్రత్యేకంగా మారింది' అని వివరిస్తారామె.

**చదువులో ముందంజ**

దీప్‌మాలా సివిల్ సర్వీసెస్‌కు వెళ్లాలనేది ఆమె తండ్రి కోరిక. ఎందుకంటే, తన ముగ్గురు సంతానంలో దీప్‌మాలా చిన్ననాటి నుంచి చదువులో ఎప్పుడూ ముందుండేది. అలాగని తన ఆలోచనను ఆమె మీద ఎప్పుడూ రుద్దలేదు. కెమిస్ట్రీలో మాస్టర్స్ డిగ్రీ, ఆ తర్వాత బీఈడీ చేసిన దీప్‌మాలా



ఆరుబయట పాఠాలు చెబుతూ..

కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్ట్ టీచర్‌గా ఉద్యోగంలో చేరింది. ఆ తర్వాత బరేలీకి 76 కిలోమీటర్ల దూరంలో ఉన్న దమ్‌ఖుదా బ్లాక్ లోని స్కూల్లో టీచర్‌గా పోస్టింగ్ వచ్చింది. 'అంత దూరంలో పోస్టింగ్, నా పిల్లల భవిష్యత్తు కళ్ల ముందు కదులుతున్నా నా పనిని నిజాయితీగా చేయాలనుకున్నాను. అలాగే చేశాను కూడా. 2015లో బరేలీలోని దభౌరా గంగాపూర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలకు ట్రాన్స్‌ఫర్ అయ్యింది. అప్పటినుంచి ఇక్కడే ప్రిన్సిపాల్‌గా సేవలు అందిస్తున్నాను' అని టీచర్‌గా తన ప్రయాణం గురించి తెలియజేస్తారు.

**సృజనాత్మక ఆలోచనలు**

'ఒకసారి గురుకుల పిఎల్‌సి కార్యక్రమం పేరుతో వివిధ పాఠశాలల ఉపాధ్యాయుల బృందాన్ని ఏర్పాటు చేశారు. టీచర్ల గ్రూప్‌లో వారు పనిచేసిన సృజనాత్మక ప్రాజెక్ట్‌ల ఫొటోలు, వీడియోలు, చేయబోయే పనులకు సంబంధించిన ఆలోచనలు పంచుకున్నారు. అందులో భాగంగానే అయిదేళ్ల క్రితం రాష్ట్రంలోని 400 మందికి పైగా టీచర్లతో కలిసి నేను కూడా ఎన్‌సిఇఆర్‌టి స్పెషల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ట్రెనింగ్ తీసుకున్నాను. ఆ సమయంలో వికలాంగ పిల్లలను సాధారణ పాఠశాలకు తీసుకువచ్చి, వారికి ఎలా నేర్పించాలో ప్లానింగ్ సిద్ధం చేశాం. వాస్తవానికి గ్రామీణ ప్రాంతాల్లోని స్పెషల్ చిల్డ్రన్ తల్లిదండ్రులకు తమ పిల్లలను ఎక్కడ చేర్చాలో తెలియదు. ఈ పిల్లలకు సాధారణ స్కూల్స్ వారు అడ్మిషన్ ఇవ్వరు.

కొంతమంది తల్లిదండ్రులు స్పెషల్ చిల్డ్రన్ కోసం కేటాయించిన స్కూళ్లలో జాయిన్ చేస్తారు. ఆ తర్వాత ఆ పిల్లలు తమలాంటి మరికొంత మంది పిల్లలతో కలిసి బాగానే ఉంటారు. కానీ, వారు ఏదైనా నలుగురిలో కలిసే కార్యక్రమాలకు వెళ్లినప్పుడు మాత్రం చాలా ఇబ్బంది పడతారు. అందుకే ఈ సమస్య తలెత్తకుండా సాధారణ పిల్లలతో కలిపి ఈ ప్రత్యేకమైన పిల్లలకు చదువు చెప్పాల్సిన అవసరం ఉందని గుర్తించాను' అని స్పెషల్ పిల్లల ఎడ్యుకేషన్‌కు సంబంధించిన ప్రారంభ రోజులను గుర్తు చేసుకుంటారామె.

**ఓ అబ్బాయితో మొదలు...**

మొదటి అడుగు పడిన నాటి సంఘటనను ఒకటి వివరిస్తూ 'ఓ రోజున పిల్లలకు క్లాస్‌రూమ్‌లో పాఠాలు చెబుతున్నాను. అప్పుడు క్లాస్‌రూమ్ బయటినుంచి లోపలికి ఆత్రంగా చూస్తున్న ఓ అబ్బాయి మీదకు నా దృష్టి వెళ్లింది. ఆ పిల్లవాడిని లోపలికి పిలిచి, ఒక సీటులో కూర్చోబెట్టాను. అతనితో మాట్లాడటానికి ప్రయత్నిస్తే మాట్లాడలేదు. వినలేదు, దృష్టి నిలకడగా లేదు. సైగలు చేస్తున్నాడు. ఆ అబ్బాయికి క్లాసులో కూర్చోవడం ఇష్టం అనేది అర్థమైంది. అలా మా స్కూల్‌కి వచ్చిన ఆ మొదటి స్పెషల్ చైల్డ్ పేరు అన్మోల్. అక్కణ్ణుంచి ఇలాంటి పిల్లలను సాధారణ పిల్లలతో చేర్చాలి అనుకున్నాను. ఎక్కడైనా స్పెషల్ చిల్డ్రన్ ఉంటే మా స్కూల్‌లో చేర్చాలని మా పిఎల్‌సి గ్రూపులో మిగతా టీచర్లకు విజ్ఞప్తి చేశాను. మా గ్రూప్‌లో ఉన్న టీచర్లు దివ్యాంగ పిల్లల బాధ్యత తీసుకుంటే జిల్లా వ్యాప్తంగా సుమారు మూడు వేల మంది పిల్లలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావచ్చు. ఇదే లక్ష్యంగా నా ప్రయత్నం కొనసాగింది. ఈ ఆలోచన తర్వాత మిగతా టీచర్లకు కూడా మా ఫ్యాకల్టీ సహకారంతో ప్రొఫెషనల్ లెర్నింగ్ కోర్సులతో ట్రెనింగ్ ఇవ్వడం ప్రారంభించాను. దీనివల్ల స్పెషల్ చిల్డ్రన్‌ని వారు బాగా అర్థం చేసుకోవచ్చు, బోధించవచ్చు' అనే ఆలోచనను తెలియజేస్తారు.

**సోషల్ మీడియా ద్వారా విస్తరణ**

ఒక మంచి ఆలోచనను ఇంకొంతమందికి పంచితే సమాజంలో మార్పు రావడం సహజం. అందుకు వేదికైనా సోషల్‌మీడియాను ఎంచుకున్నారు దీప్‌మాలా. కరోనా కాలంలో సాధారణ పిల్లలతోపాటు దివ్యాంగ పిల్లల భవిష్యత్తుకు ఏం చేయాలనే విషయంలో చాలా మందికి తెలియలేదు. అయితే, దీప్‌మాలా మాత్రం 'వన్ టీచర్ వన్ కాల్' పేరుతో ఫేస్‌బుక్ పేజీని సృష్టించారు. దీని ద్వారా టీచర్లు స్పెషల్ చిల్డ్రన్‌కి బోధిస్తారనే ప్రచారం బాగా జరిగింది. రాష్ట్రంలోనే కాదు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా టీచర్లు ఆ ఫేస్‌బుక్ పేజీలో చేరారు. వారంతా తమ ప్రాంతాలలోని దివ్యాంగ పిల్లలను స్కూల్ ద్వారా అడ్మిషన్లు తీసుకొని, బోధించడం ప్రారంభించారు. ఇప్పటివరకు వివిధ జిల్లాల్లోని సాధారణ పాఠశాలలో 600 మందికి పైగా స్పెషల్ చిల్డ్రన్‌ని చేర్పించడంతో పాటు టీచర్లు కూడా ఇందుకోసం ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ఇంకా మరికొంతమంది తీసుకుంటున్నారు.

**స్త్రీల అక్షరాస్యత**

స్పెషల్ చిల్డ్రన్ కోసమే కాదు కరోనా కాలంలో తను పని చేస్తున్న చుట్టుపక్కల గ్రామాల్లో ఒక సర్వే నిర్వహించారు దీప్‌మాలా. అందులో 90 శాతం మంది మహిళలు నిరక్షరాస్యులు అని తేలడంతో ఆ తర్వాత వారికి దశలవారీగా చదువు చెప్పే పనిని చేపట్టారు. వారిలో చాలా మంది వేలి ముద్ర నుంచి సంతకం చేసేంతగా చదువు నేర్చుకున్నారు.

మొదట ఏ మంచి పని తలపెట్టినా అది ఆచరణ యోగ్యమేనా, సాధించగలమా.. అనే సందేహం తలెత్తకమానదు. కానీ, నలుగురికి ఉపయోగపడే ఏ చిన్న ప్రయత్నమైనా గమ్యానికి చేరువ అవుతుందని దీప్‌మాలా టీచర్ ప్రయాణం రుజువు చేస్తోంది.

## ప్రధాని ప్రశంసలు

ఇటీవల 'మన్ కి బాత్' కార్యక్రమంలో దీప్‌మాలా చేస్తున్న కృషిని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. 'ఆ రోజు గుర్తుకు వచ్చినప్పుడల్లా ఇలాంటి పిల్లల కోసం ఇంకా ఎక్కువ పని చేయాలనే ప్రేరణ కలుగుతుంది. ఆ రోజు నేను మా అమ్మవాళ్లింటికి వెళ్లాను. నాపేరు ప్రకటించినప్పుడు నా భర్త ఆ కార్యక్రమాన్ని వింటున్నాడు. అతను నాకు ఫోన్ చేసి చెప్పడంతో, నమ్మలేకపోయాను. కానీ, మీడియా వారి నుంచి కాల్స్ రావడం ప్రారంభమయ్యాయి. దీంతో నా ప్రయత్నాలు ఫలిస్తున్నాయని నాకు అనిపించింది' అని తన సంతోషాన్ని వ్యక్తం చేశారామె.



యూకే ఫస్ట్ లేడీ అక్షతామూర్తి

రిషి సునాక్‌కు అక్షతామూర్తి
భార్య మాత్రమే కాదు.
తన మనోప్రపంచం తెలిసిన క్లోజ్‌ఫ్రెండ్, గైడ్.
సునాక్ ఒత్తిడిని మటుమాయం చేసే
మాటల మాంత్రికురాలు.
ఐటీ మొదలు ఫ్యాషన్ ప్రపంచం వరకు
ఎన్నో రంగాలలో తనను తాను
నిరూపించుకున్న ప్రతిభావంతురాలు.
కుటుంబ జీవితాన్ని, వ్యాపార జీవితాన్ని
తేలికగా ఎలా సమన్వయం చేసుకోవాలో
తన చేతల ద్వారా చూపించిన
తెలివైన మహిళ....

# మూర్తీభవించిన సమయస్ఫూర్తి

తన మామగారు నారాయణమూర్తి గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు రిషి సునాక్ కళ్లలో ఒక మెరుపు కనిపిస్తుంది. మూర్తిపై అభిమానం ఆయన మాటల్లో వ్యక్తం అవుతుంది. అది ఒక మామ గురించి అల్లుడి అభిమానం కాదు. గొప్ప వ్యాపారవేత్త గురించి ఒక ఆలోచనపరుడి అభిమానం.

'ఆయన సంపన్న కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన వ్యక్తి కాదు. అయితే అదేమీ తన ప్రతికూలత కాలేదు. ఎందుకంటే ఆయనకు ఆశయాలు ఉన్నాయి. తన మీద తనకు నమ్మకం ఉంది. డబ్బులు లేని పరిస్థితులలో నారాయణమూర్తికి సుధామూర్తి తాను దాచుకున్న డబ్బులు ఇచ్చారు. ఇక అప్పటినుంచి ఆయన వెనక్కి తిరిగి చూసుకోలేదు. సుధామూర్తి ఇచ్చింది డబ్బులు మాత్రమే కాదు అంతులేని ఆత్మస్థైర్యం' అని ఒకానొక సందర్భంలో తన మామగారు నారాయణమూర్తి గురించి చెప్పారు సునాక్.

ఒక స్త్రీ పురుషుడిని ఎలా ముందుకు నడిపించగలదు, విజేతగా నిలపగలదో సునాక్ తన మాటలతో చెప్పకనే చెప్పారు.

మరి తన విషయంలో భార్య అక్షతామూర్తి పాత్ర ఏమిటి?

సునాక్ మాటల్లో చెప్పాలంటే...

'కుటుంబానికి తగిన సమయం కేటాయించలేకపోతున్నాను అనే బాధను ఆమె తీరుస్తుంది. అన్ని విషయాల్లో నాకు తోడుగా ఉంటుంది. సమయస్ఫూర్తి ఎక్కువగా ఉన్న మహిళ' అంటాడు సునాక్.



కుమార్తెలు కృష్ణ సునాక్, అనౌష్క సునాక్, భర్త రిషి సునాక్‌లతో అక్షతామూర్తి

కర్ణాటకలోని హుబ్లీలో జన్మించిన అక్షతామూర్తి బెంగళూరు శివారులోని జయనగర్‌లో ఎలాంటి ఆడంబరాలు, అట్టహాసాలు లేకుండా మధ్యతరగతి జీవిత విలువలతో పెరిగింది.

ఖరీదైన బర్త్‌డే పార్టీలు ఉండేవి కాదు. పరిమితమైన పాకెట్ మనీ మాత్రమే ఉండేది.

అలా అని అక్షతా ఎప్పుడూ తల్లిదండ్రుల మీద అలక పూనలేదు. దీనికి కారణం వారు తనకు చిన్నప్పటి నుంచే నైతిక విలువలు, నిరాడంబర జీవన విధానం గురించి చెబుతూ వచ్చారు.

బెంగళూరులోని బాల్డ్‌విన్ గర్ల్స్ హైస్కూల్‌లో చదువుకుంది అక్షతామూర్తి. స్కూల్లో ఎప్పుడూ ఆడంబరం ప్రదర్శించేది కాదు. కాలిఫోర్నియాలో ఎకనామిక్స్, ఫ్రెంచ్ చదువుకున్న అక్షత లాస్ ఏంజెల్స్‌లో ఫ్యాషన్ డిజైనింగ్‌లో డిప్లొమా చేసింది. స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీలో ఎంబీఏ చేసింది. ఆ సమయంలోనే సునాక్‌తో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది. 2009లో వీరి వివాహం బెంగళూరులో జరిగింది. సునాక్-అక్షతామూర్తి దంపతులకు ఇద్దరు అమ్మాయిలు... కృష్ణ, అనౌష్క.

క్లీన్‌టెక్ సంస్థ 'టెండ్రిస్'లో మార్కెటింగ్ డైరెక్టర్‌గా చేరిన అక్షతామూర్తి రెండు సంవత్సరాల తరువాత 'అక్షత డిజైన్స్' పేరుతో సొంతంగా ఫ్యాషన్ కంపెనీ ప్రారంభించింది. ఆ తరువాత భర్తతో కలిసి మొదలుపెట్టిన ఒక వెంచర్ క్యాపిటల్‌కు డైరెక్టర్‌గా వ్యవహరించింది.

ఐటీ బిజినెస్ నుంచి బ్యూటీ డిజైన్స్ వరకు ప్రతి వ్యాపారంలో తనదైన ముద్ర వేసింది అక్షతామూర్తి.

'అక్షతామూర్తి ఒక ఇంట్లో పెరిగింది అనడం కంటే ఒక విశ్వవిద్యాలయంలో పెరిగింది అనడం సబబు' అంటారు కొందరు ఆమె తల్లిదండ్రులను గుర్తు చేసుకుంటూ.

నిజమే మరి...

ఆ కుటుంబ విశ్వవిద్యాలయంలో వైజ్ఞానిక విషయాల నుంచి వ్యాపార విజయాల వరకు ఎన్నో విషయాలు నేర్చుకుంది. అవి తనకు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

'నాన్న వ్యాపార నైపుణ్యం, అమ్మ సామాజిక సేవ అనే రెండు ప్రపంచాలను చూస్తూ పెరిగాను. అవి రెండు విడి ప్రపంచాలు కాదు. ఒకదానితో ఒకటి సంబంధం ఉన్న ప్రపంచాలు. వ్యాపారవేత్తగా సామాజిక సేవ ఎంత బాగా చేయవచ్చో తెలుసుకున్నాను' అంటుంది అక్షతామూర్తి.

'ఆమె నా వెంట ఉంటే చాలు' అని ఎన్నో ఇంటర్వ్యూలలో అక్షరతామూర్తి గురించి చెప్పకనే చెప్పాడు సునాక్.

లండన్‌లోని వెంబ్లీలో జరిగిన మొన్నటి ఎన్నికల ప్రచార సభలో ప్రేక్షకుల్లో కూర్చున్న భార్యను చూస్తూ...

'నా జీవితంలో నువ్వెంత ముఖ్యమో నాకే కాదు. నీకు కూడా తెలుసు. నీ రుణం తీర్చుకోలేనిది' అన్నాడు సునాక్.

రాజకీయాలు అంటే మాటలు కాదు... ఏ సవాలు ఎటు నుంచి దూసుకువస్తుందో తెలియదు. ఏ అడుగులో ఏ ప్రమాదం దాగి ఉందో తెలియదు. క్షణం తీరిక లేని పనుల్లో ఏది మంచో, ఏది చెడో విశ్లేషించుకునే విచక్షణ అవసరం. ఇలాంటి సమయంలోనే ఆత్మీయులు అత్యవసరం.

స్నేహితురాలు, భార్యగా సునాక్ మనోప్రపంచం అక్షతామూర్తికి తెలుసు. అతని పరిమితులు, బలం ఏమిటో అందరికంటే బాగా తెలుసు. అందుకే ఇప్పుడు బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌కు అక్షతామూర్తి బలమైన తోడు ఎంతో అవసరం.

# డాన్స్ నేర్చుకుంటారా పిల్లలూ?

**నృత్యానికి మించిన వ్యాయామం లేదు.**
**ఇంటి పరిసరాల్లో, స్కూల్లో ఆటస్థలాలు మాయమైతే**
**డాన్స్‌కు మించిన ప్రత్యామ్నాయం లేదు.**
**ఒడిస్సి నృత్యకారిణి జయామెహతా తనకో కూతురు పుట్టాకే**
**పిల్లలకు డాన్స్ ఎంత అవసరమో తెలుసుకుంది.**
**కూతురి కోసం తయారు చేసిన ఒడిస్సీ వర్క్‌షాప్**
**హిట్ అయ్యాక పిల్లల కోసమే ప్రత్యేకంగా**
**భారతీయ నృత్యాల గురించి పుస్తకం రాసింది.**
**'నృత్యకథ- ది బుక్ ఆఫ్ ఇండియన్ డాన్స్ స్టోరీస్' దాని పేరు.**
**మరో మహిళా చిత్రకారిణి సురుబ నటాలియా**
**బొమ్మలతో పిల్లల మనసును నృత్యం వైపు లాగేలా ఉందీ పుస్తకం.**
**పిల్లలే నాట్యకళను కాపాడాలి అంటుంది జయామెహతా.**





జయామెహతా

'భరతనాట్యం', 'కూచిపూడి'లలో ఏది తెలుగు నృత్యం అంటే చాలామంది తెలుగు పిల్లలు టక్కున సమాధానం చెప్పలేకపోవచ్చు. అసలు భారతదేశంలో ఎన్ని నృత్యరూపాలు ఉన్నాయో పిల్లలకు ఎవరు చెబుతున్నారు? శరీరానికి ఉల్లాసం, ఉత్సాహం, వ్యాయామం, శిక్షణ ఇచ్చే సంప్రదాయ నృత్యాలను పిల్లలకు నేర్పించడం అనే భావన మార్కుల వేటలో పడి వెనక్కు పోతోంది. వీడియో గేమ్స్‌లో పడి కుర్చీల్లో కూలబడి ఊబకాయాన్ని, సోమరితనాన్ని తెచ్చుకుంటున్న పిల్లలకు విరుగుడు ఏమిటి? డాన్స్‌లో చేర్పించడమే అంటోంది జయామెహతా.

ఢిల్లీలో స్థిరపడ్డ ఈ ఒడిస్సీ కళాకారిణి డాన్స్‌ను పిల్లలకు చేరువ చేయాలని భావించడం వెనుక ఆమె కుమార్తె అనన్య పాత్ర ఉంది. 'వారాంతం వస్తే నేను నా కూతురిని తీసుకుని ఢిల్లీలో జరిగే ఏదో ఒక డాన్స్ ప్రోగ్రామ్‌కు వెళ్లేదాన్ని. అలా ఈ దేశపు కళలు నా పాపకు పరిచయం కావాలని కోరుకున్నాను. వచ్చిన వాళ్లు డాన్స్ చూస్తున్నారుగానీ ఆ నృత్యం గురించి వివరాలు తెలుసుకోలేకపోతున్నారు. నా కూతురు కూడా ఒక డాన్స్‌ను చూసి చాలా ప్రశ్నలు వేసేది. అప్పుడు అనిపించింది పిల్లలకే కాదు పెద్దలకు కూడా అర్థమయ్యేలా డాన్స్ గురించి చెప్పాలి– ప్రదర్శన సమయంలో అని. అందుకే 'మమ్, మి, అండ్ ఒడిస్సీ' పేరుతో ఒడిస్సీ డాన్స్ గురించి చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు నాలుగు భాగాల వర్క్‌షాప్ నిర్వహించాను. అది చాలా ఆదరణ పొందింది. నృత్యాన్ని పిల్లల ద్వారా పెద్దలకు చేర్చాలని తెలిసి వచ్చింది' అంటుంది జయ మెహతా.

**■ డాన్స్ ట్రావెల్స్**

జయ మెహతా తన భర్త, కొడుకు, కూతురుతో కలిసి ప్రతి సంవత్సరం కనీసం ఒక రాష్ట్రంలో రోడ్డు మార్గం ద్వారా వేయి కిలోమీటర్లు తిరగాలని సంకల్పించుకుంది. అలానే చేస్తోంది కూడా. వాటికి 'డాన్స్ ట్రావెల్స్' అని పేరు పెట్టుకుంది. ఏ రాష్ట్రానికి వెళితే ఆ రాష్ట్రంలోని నృత్యసంప్రదాయాన్ని పిల్లలకు తెలియచేయాలి. ఆ కళాకారుల కథలు చెప్పాలి. ప్రదర్శనలో ఉండే విశేషాలు తెలియాలి. 'అలా నేను కేరళ, అస్సాం, తమిళనాడు... ఇలా చాలా రాష్ట్రాలు తిరిగాను. కేరళలో నా కూతురు కథకళి చూసి ఎంతో ఉద్వేగపడింది. మహాబలిపురంలో సముద్రం ఒడ్డు కోవెలలో భరతనాట్యం చూడటం చిన్న అద్భుతం కాదు. వీటన్నింటి గురించి నా పిల్లలు ఎంతో సంబరంతో, ఆసక్తితో తెలుసుకున్నారు. ఈ వివరాలు దేశంలోని ఇతర పిల్లలకు కూడా తెలియాలి అని పుస్తకం రాశాను అంటోంది జయ.

**■ నృత్య కథ**

'నృత్య కథ– ది బుక్ ఆఫ్ ఇండియన్ డాన్స్ స్టోరీస్' పుస్తకంలో జయ ముఖ్యమైన భారతీయ సంప్రదాయ నృత్యాలను ఆకర్షణీయమైన బొమ్మలతో పిల్లలకు అర్థమయ్యే భాషలో తెలియజేసింది. మణిపురి, భరతనాట్యం, మోహినీ ఆట్టం, బిహు, కథకళి, ఒడిస్సీ, చౌ, కథక్, కూచిపూడి...లాంటి నృత్యాలన్నింటినీ వాటితో ముడిపడ్డ కథలతోపాటుగా పిల్లలకు అర్థమయ్యేలా చెప్పింది. ఆ నృత్యాల మూలాలు చెప్పింది. ఆ నృత్యాలు ప్రదర్శించేటప్పుడు ఉండాల్సిన ఆహార్యాన్ని వివరించింది. ఇదే కాదు... నృత్యాన్ని పిల్లల దగ్గరకు తీసుకెళ్లాలని భిన్నమైన నృత్య ప్రదర్శనలను ఇస్తోందామె. 'ఢిల్లీలో ఏ మంచి రెస్టారెంట్‌లో లేదా కెఫెలో ఒక మూల దొరికినా నేను నృత్య ప్రదర్శన ఇస్తాను' అంటోంది జయ. ఎందుకంటే అక్కడే పెద్దల దృష్టి, వారితోపాటు వచ్చిన పిల్లల దృష్టి నృత్యం మీదకు వెళుతుంది. ఆసక్తి కలుగుతుంది. నేర్చుకునేవారు నేర్చుకుంటారు.

ఇదంతా ఎందుకు అంటే జయ దగ్గర సమాధానం లేదు.

కొందరు అంతే.. ఊరికే ఉండలేరు. ఇలాంటి వారి వల్లే పిల్లల ఆకాశంలో కాసిన్నయినా ఇంద్రధనువులు పూస్తూ ఉంటాయి.

## హెల్త్ టిప్



అర అంగుళం అల్లంముక్క, ఐదు లవంగాలు తీసుకుని మెత్తగా దంచుకోవాలి. ఇప్పుడు గ్లాసుపాలను గిన్నెలో పోసి స్టవ్ మీద వేడిచేయాలి. పాలు కాస్త వేడెక్కిన తరువాత దంచుకున్న అల్లం, లవంగాల మిశ్రమాన్ని పాలల్లో వేసి ఒక పొంగు రానివ్వాలి. రాత్రిపూట ఈ పాలను టీ తాగినట్టుగా సిప్ చేస్తూ తాగాలి. ఇలా నాలుగురోజుల పాటు క్రమం తప్పకుండా తాగితే ఛాతిలో కఫం, దగ్గు తగ్గుతాయి.

## కిచెన్‌టిప్స్



- బంగాళ దుంప ఫ్రైని తక్కువ నూనెలో అడుగంటకుండా త్వరగా వేయించాలంటే.. బంగాళ దుంప ముక్కల్ని కట్ చేసిన తరువాత ఒక ఐదు నిమిషాలపాటు మజ్జిగలో నానపెట్టాలి. తరువాత ఫ్రై చేస్తే తక్కువ నూనెలోనే ముక్కలు త్వరగా వేగుతాయి.
- కందిపప్పు నిల్వ చేసే డబ్బాలో ఎండు కొబ్బరి చిప్ప వేసి పెడితే ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.



## బ్యూటిప్స్

# ముఖానికి ఆటా ప్యాక్!



గోధుమపిండితో రుచికరమైన రోటీలేగాక ఎండవల్ల ముఖంపై ఏర్పడిన ట్యాన్‌ను కూడా తగ్గించవచ్చు. దీనికోసం రెండు స్పూన్ల గోధుమపిండి, స్పూను తేనె, స్పూను పెరుగు, స్పూను రోజ్ వాటర్, స్పూను ఓట్స్, అరస్పూను కొబ్బరి నూనె తీసుకోవాలి. వీటన్నింటిని ఒక గిన్నెలో వేసి పేస్టులా కలుపుకోవాలి. తరువాత ఈ పేస్టును ముఖానికి రాసి ఆరిన తరువాత ముఖాన్ని శుభ్రంగా కడిగేసుకోవాలి. ఈ 'ఆటా ఫేస్‌ప్యాక్'ను వారానికి ఒకసారి వేసుకోవడం వల్ల ముఖంపై ఉన్న మృతకణాలు తొలగడమేగాక, ట్యాన్ తగ్గుముఖం పట్టి ముఖచర్మం కాంతిమంతమవుతుంది.



- ముఖం మీద వికారంగా కనిపించే మొటిమలను ఇంటి చిట్కాతో సులభంగా వదిలించుకోవచ్చు. నాలుగు వెల్లుల్లి రెబ్బలు తీసుకుని పొట్టుతీసి మెత్తగా పేస్టులా నూరుకోవాలి. ఈ పేస్టును ముఖంపై ఉన్న మొటిమలపై రాయాలి. పేస్టు ఆరుతుంది అనుకున్నప్పుడు దానిపై బ్యాండేజ్ వేయాలి. ఈ బ్యాండేజ్‌ను రాత్రంతా ఉంచుకుని ఉదయం తీసేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేయడం ద్వారా మొటిమలు తగ్గుముఖం పడతాయి.



# ఇలాంటి ధమాకాలు కావాలంటే...


చిరంజీవి

''ఏంట్రా.. ఆడొస్తే పూనకాలు అన్నారు', 'అడుగేస్తే అరాచకం అన్నారు.. ఏడ్రా మీ అన్నయ్య.. సౌండే లేదు'' అంటూ విలన్ చెప్పే డైలాగ్‌తో 'వాల్తేరు వీరయ్య' టైటిల్ టీజర్ విడుదలైంది. చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'వాల్తేరు వీరయ్య' టైటిల్ ఖరారు చేసింది చిత్రయూనిట్. బాబీ (కేఎస్ రవీంద్ర) దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తుండగా రవితేజ కీ రోల్ చేస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'ఇలాంటి ఎంటర్‌టైనింగ్ ధమాకాలు ఇంకా చూడాలనుకుంటే లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్ టు' అంటూ చిరంజీవి చెప్పే డైలాగ్‌తో టీజర్ సాగుతుంది. సంక్రాంతికి రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: ఆర్థర్ ఎ విల్సన్.

# సంక్రాంతి బరిలో ఏజెంట్


అఖిల్


అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఏజెంట్'. సాక్షీ వైద్య హీరోయిన్. మమ్ముట్టి కీలక పాత్ర చేస్తున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, సురేందర్ 2 పతాకాలపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రంలో అఖిల్ గూఢచారిగా కనిపిస్తారు. 'ఏజెంట్' సినిమాను సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించింది చిత్రబృందం. దర్శకుడు వక్కంతం వంశీ కథ అందిస్తున్న ఈ సినిమాకు సంగీతం: హిప్ హాప్ తమిళా, సహనిర్మాతలు: అజయ్ సుంకర, దీపారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిశోర్ గరికిపాటి.

# నిర్మాణరంగంలోకి ధోని


ఎమ్మెస్ ధోని

భారత మాజీ క్రికెటర్ మహేంద్రసింగ్ ధోని సినిమా రంగంలోకి ప్రవేశిస్తున్నారు. ధోని, ఆయన సతీమణి సాక్షి కలిసి 'ధోని ఎంటర్‌టైన్‌మెంట్' అనే నిర్మాణ సంస్థను స్థాపించారు. తమిళంలో తొలి సినిమా నిర్మించనున్నారు. గ్రాఫిక్ నవల 'అధర్వ: ది ఆరిజన్' రచయిత రమేష్ తమిళ్ మణి ఈ సినిమాకు దర్శకుడు. ఈ చిత్రానికి సాక్షీ సింగ్ ధోని కాన్సెప్ట్ అందించడం విశేషం. ''చెన్నై సూపర్‌కింగ్స్ ఐపీఎల్ పోటీల నేపథ్యంలో 'రోర్ ఆఫ్ ది లయన్' పేరుతో ఓ డాక్యుమెంటరీ, క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగించే డాక్యుమెంటరీని రూపొందించనున్నాం'' అన్నారు ధోని ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ దక్షిణాది విభాగం నిర్వాహకుడు ప్రియాన్షు చోప్రా.

# రావణాసుర రాక ఎప్పుడంటే...


రవితేజ

రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'రావణాసుర'. అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజిత పొన్నాడ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాలో సుశాంత్ కీ రోల్ చేస్తున్నారు. అభిషేక్ నామా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ముందు ఈ చిత్రాన్ని ఈ ఏడాది సెప్టెంబరు 30న విడుదల చేయాలనుకున్నారు. కానీ వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల చేయనున్నట్లు కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. శ్రీకాంత్ విస్సా కథ, స్క్రీన్ ప్లే అందిస్తున్న ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్ సంగీతదర్శకులు.

# నవ్వులు ఫుల్లు


సంతోష్ శోభన్, ఫరియా

సంతోష్ శోభన్, ఫరియా అబ్దుల్లా జంటగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్'. బ్రహ్మాజీ, సుదర్శన్ కీలక పాత్రలు చేశారు. వెంకట్ బోయినపల్లి నిర్మించిన ఈ సినిమా నవంబర్ 4న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను ప్రభాస్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. సినిమా చూస్తున్నంతసేపు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు'' అన్నారు. ''వినోదాత్మకంగా తెరకెక్కిన చిత్రమిది. ప్రారంభం నుంచి చివరి వరకు నవ్వుతూనే ఉంటారు'' అన్నారు మేర్లపాక గాంధీ. ''జాతిరత్నాలు' తర్వాత అందరూ నన్ను చిట్టీ అని పిలుస్తున్నారు. 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్' చూశాక నేను చేసిన వసుధ పాత్రే గుర్తుంటుంది'' అన్నారు ఫరియా అబ్దుల్లా. ''ఈ నెల 29న మా సినిమా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించనున్నాం'' అన్నారు వెంకట్ బోయినపల్లి. నటులు బ్రహ్మాజీ, సుదర్శన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వెంకటరత్నం పాల్గొన్నారు.



## భారత కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ సింగ్



ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ హాకీ టోర్నీలో తొలి దశలో జరిగే నాలుగు మ్యాచ్‌లకుగాను భారత కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ సింగ్‌ను ఎంపిక చేశారు. ఈ టోర్నీలో భాగంగా భువనేశ్వర్‌లో అక్టోబర్ 28న, నవంబర్ 4న న్యూజిలాండ్‌తో...అక్టోబర్ 30న, నవంబర్ 6న స్పెయిన్‌తో భారత్ తలపడుతుంది. 22 మంది సభ్యులతో కూడిన జట్టును మంగళవారం ప్రకటించారు.

## ఫిల్ సిమన్స్ రాజీనామా



టి20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్ ఘోర పరాభవానికి బాధ్యత వహిస్తూ జట్టు హెడ్ కోచ్ ఫిల్ సిమన్స్ తన పదవికి రాజీనామా చేశాడు. ఈ మెగా టోర్నీలో రెండు సార్లు చాంపియన్‌గా నిలిచిన జట్టు ఈ సారి నేరుగా అర్హత సాధించలేకపోయింది. ఆపై క్వాలిఫయింగ్ దశలోనూ చతికిలపడి టోర్నీనుంచి నిష్క్రమించింది. అయితే బోర్డు సూచన మేరకు తర్వాతి రెండు టెస్టులకు మాత్రం కోచ్‌గా వ్యవహరిస్తాడు.

# స్టొయినిస్ మెరుపులతో...

- ఆస్ట్రేలియా ఘనవిజయం
- 7 వికెట్ల తేడాతో ఓడిన శ్రీలంక
- టి20 ప్రపంచకప్



పెర్త్: డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా టి20 ప్రపంచకప్‌లో బోణీ కొట్టింది. గ్రూప్–1 తొలి మ్యాచ్‌లో కివీస్ చేతిలో కంగుతిన్న ఆస్ట్రేలియా మంగళవారం శ్రీలంకతో జరిగిన కీలక పోరులో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఒత్తిడి పెరుగుతున్న వేళ ఆస్ట్రేలియన్ ఆల్‌రౌండర్, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మార్కస్ స్టొయినిస్ (18 బంతుల్లో 59 నాటౌట్; 4 ఫోర్లు, 6 సిక్సర్లు) మెరుపు వేగంతో ఆడి మ్యాచ్‌ను ముగించాడు. మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. ఓపెనర్ నిసాంక (45 బంతుల్లో 40; 2 ఫోర్లు) రాణించాడు. అనంతరం ఆస్ట్రేలియా 16.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ ఆరోన్ ఫించ్ (42 బంతుల్లో 31 నాటౌట్; 1 సిక్స్) నింపాదిగా ఆడాడు. ఆసీస్ స్టార్ స్పిన్నర్ ఆడమ్ జంపా కోవిడ్ బారిన పడటంతో మ్యాచ్ నుంచి తప్పించి అతని స్థానంలో అగర్‌కు చోటు కల్పించారు.

**రాణించిన అసలంక**

రెండో ఓవర్లోనే లంక కుశాల్ మెండిస్ (5) వికెట్‌ను కోల్పోయింది. అయితే పతున్ నిసాంక, ధనంజయ డిసిల్వా (23 బంతుల్లో 26; 3 ఫోర్లు) మరో వికెట్ పడకుండా 11 ఓవర్ల పాటు స్కోరు బోర్డును నడిపించారు. మెరుపులు కరువైనప్పటికీ ఓవర్‌కు 6 పైచిలుకు పరుగులతో లంక ఇన్నింగ్స్ సాగింది. ఈ దశలో స్థానిక ఆటగాడు, లెఫ్టార్మ్ స్పిన్నర్ అగర్... ధనంజయను అవుట్ చేసి 69 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. కాసేపటికే నిసాంక రనౌట్ కాగా, స్వల్ప వ్యవధిలో భానుక రాజపక్స (7), కెప్టెన్ షనక (3) వికెట్లను కోల్పోయింది. అయితే చరిత్ అసలంక ధాటిగా ఆడి లంక స్కోరును పెంచాడు. కమిన్స్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో అసలంక 4, 6 బాదగా, కరుణరత్నే బౌండరీ కొట్టాడు. దీంతో 20వ ఓవర్లో లంక 20 పరుగుల్ని పిండుకుంది.

**దంచేసిన స్టొయినిస్**

ఆస్ట్రేలియా లక్ష్యఛేదన చప్పగా మొదలైంది. ఒక దశలో బోర్ కొట్టించింది. ఎంతగా అంటే 7 ఓవర్ల దాకా బ్యాట్స్‌మెన్ నుంచి ఒక్క బౌండరీ రాలేదు. పొట్టి ఫార్మాట్‌లో పవర్‌ప్లే (6 ఓవర్లు)లో ఇలా జరగడం చాలా చాలా అరుదు. వార్నర్ (11) విఫలం కాగా, 7 ఓవర్లలో కంగారూ జట్టు 38/1 స్కోరు చేసింది. ఎట్టకేలకు 8వ ఓవర్ రెండో బంతిని మిచెల్ మార్ష్ (18) బౌండరీకి తరలించాడు. మళ్లీ ఆఖరి బంతినీ సిక్సర్ బాదాడు. మార్ష్ అవుటయ్యాక వచ్చిన మ్యాక్స్‌వెల్ (12 బంతుల్లో 23; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఉన్నది కాసేపే అయినా ఫోర్లు, సిక్సర్లు దంచేయడంతో... అప్పుడు టి20 మ్యాచ్‌లా అనిపించింది. 13వ ఓవర్లో మ్యాక్స్‌వెల్ ఆట ముగిసింది. అప్పటికి ఆసీస్ విజయానికి 44 బంతుల్లో 69 పరుగులు కావాలి. ఈ దశలో వచ్చీరాగానే స్టొయినిస్ మెరిపించే పనిలో పడ్డాడు. పేస్, స్పిన్ బౌలింగ్‌లను యథేచ్ఛగా ఎదుర్కొన్నాడు. భారీ షాట్లతో విరుచుకుపడటంతో అతడు వచ్చిన 4.1 ఓవర్లలోనే ఆస్ట్రేలియా లక్ష్యాన్ని చేరుకుంది. హసరంగ 15వ ఓవర్లో 2 సిక్స్‌లు, ఒక ఫోర్ కొట్టిన స్టొయినిస్... తీక్షణ వేసిన మరుసటి ఓవర్లో 3 సిక్సర్లు బాదాడు. ఈ రెండు ఓవర్లలోనే 39 పరుగులు వచ్చాయి. దీంతో 12.2 ఓవర్లలో 89/3గా ఉన్న ఆసీస్ స్కోరు... 16.3 ఓవర్లలో 158/3తో విజయం సాధించింది. స్టొయినిస్ 17 బంతుల్లోనే (4 ఫోర్లు, 5 సిక్సర్లు) అర్ధ సెంచరీ సాధించాడు.

**టి20 ప్రపంచకప్‌లో నేడు**

ఇంగ్లండ్ X ఐర్లాండ్ (ఉ.గం. 9:30 నుంచి)
అఫ్గనిస్తాన్ X న్యూజిలాండ్ (మ.గం. 1:30 నుంచి)
వేదిక: మెల్‌బోర్న్
స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

# 'చంద్రముఖిలా మారిన కోహ్లి'

**విరాట్ బ్యాటింగ్‌పై అశ్విన్**



సిడ్నీ: భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ ముగిసి రోజులు గడుస్తున్నా అది పంచిన ఉత్కంఠను మాత్రం సగటు క్రికెట్ అభిమాని ఎప్పటికీ మరచిపోలేడు. మైదానం బయటే పరిస్థితి ఇలా ఉంటే మైదానంలో చివరి పరుగు చేసిన అశ్విన్ పరిస్థితి ఏమిటి. ఆ సమయంలో అతనికి ఎలా అనిపించింది? ఈ ఆసక్తికర విశేషాలన్నీ స్వయంగా అశ్విన్ పంచుకున్నాడు. ముఖ్యంగా చివరి క్షణాల్లో తన అనుభవాన్ని అతను వివరించాడు. '45 పరుగులకే 4 వికెట్లు పడ్డాయి. ఇక కోహ్లి, హార్దిక్ చెరో 60 పరుగులు చేస్తే తప్ప గెలవలేమనిపించింది. అవసరం పడితే నేనూ బ్యాటింగ్‌లో ఒక చేయి వేయాలని అనుకున్నాను. అయితే కోహ్లి అద్భుత బ్యాటింగ్‌తో ఒక్కసారిగా మ్యాచ్‌ను మార్చేశాడు. 45 బంతుల తర్వాత అతని బ్యాటింగ్ చూస్తే చంద్రముఖి సినిమా గుర్తుకొచ్చింది. గంగనుంచి జ్యోతిక ఒక్కసారిగా చంద్రముఖిలా మారిపోయినట్లు అనిపించింది. ప్రభుతో 'నన్ను వదలవా' అంటున్నట్లు మదిలో మెదిలింది! నేను చివరకు 2 బంతుల్లో 2 పరుగులు చేయాల్సినప్పుడు క్రీజ్‌లో వచ్చాను. ఆ స్థితికి నన్ను తెచ్చినందుకు ముందుగా దినేశ్ కార్తీక్‌ను తిట్టుకున్నాను. అయితే మనమూ ఏదైనా చేయగల అవకాశం వచ్చినట్లు భావించాను. నాకైతే పిచ్ వరకు వెళ్లడం ఒక సుదీర్ఘ ప్రయాణంగా అనిపించింది. ఐన్‌స్టీన్ సిద్ధాంతం ప్రకారం మనకు ఇష్టం లేని చోట ఉండే నిమిషం కూడా గంటలా అనిపిస్తుంది. కోహ్లి వచ్చి ఎక్కడెక్కడ పరుగులు తీయవచ్చో చెప్పాడు. బాబూ... నువ్వయితే అలాంటి చోట్ల షాట్లు కొడతావు, నేనెలా ఆడగలను, నాకు వచ్చిందే చేస్తా అని మనసులో అనుకున్నా. విజయం కోసం పోరాడుతున్న ఒక వ్యక్తిని నేను నేరుగా ఎలా అనగలనని బయటకు మాత్రం చెప్పలేదు. అయితే బౌలర్ నవాజ్ ఎలా బౌలింగ్ చేస్తున్నాడు. లెగ్‌స్టంప్‌పై వేస్తున్నాడా...ఇలా పోలీస్ ఇన్వెస్టిగేషన్ తరహాలో పలు ప్రశ్నలు అడిగేశాను. అతను మాత్రం చాలా చెప్పినా...నేను మాత్రం ఖాళీ వైపు బంతిని తోసి నా జీవితం కోసం పరుగెత్తినట్లుగా సింగిల్ తీయాలని అనుకున్నా. లెగ్‌స్టంప్స్ మీద బంతిని వేస్తున్నాడు, జరిగి కవర్స్ మీదుగా కొట్టు అని చివరి సలహా ఇచ్చాడు. పరిస్థితి ఇలా ఉంది, చలి పెడుతోంది, ఇలాంటప్పుడు కవర్స్ మీదుగా కొట్టమంటాడేమిటి అని అనుకున్నాను. చివరి బంతి దిశను బట్టే అది వైడ్ అవుతుందని భావించి వదిలేశా. ఇక నా ఇంటిపై రాళ్లు వేయరులే అని ధైర్యం వచ్చింది. కోహ్లిని రవూఫ్ బౌలింగ్‌లో అంత అద్భుతమైన సిక్సర్లు కొట్టనిచ్చిన దేవుడు నన్ను ఒక్క సింగిల్ తీయనీయడా అనుకున్నా. చివరకు అలాగే జరిగింది. నిజంగా ఒక అద్భుత మ్యాచ్‌లో భాగమైనందుకు చాలా గర్వంగా ఉంది' అని అశ్విన్ నాటి పరిస్థితిని కళ్లకు కట్టినట్లు వివరించాడు.

**రాహుల్ తీవ్ర సాధన**

నెదర్లాండ్స్‌తో గురువారం జరిగే మ్యాచ్ కోసం సిడ్నీ చేరుకున్న భారత జట్టు సన్నాహకాల్లో మునిగింది. మంగళవారం ప్రాక్టీస్ సెషన్‌పై ముఖ్యంగా అందరి దృష్టి ఓపెనర్ రాహుల్‌పైనే నిలిచింది. పాక్‌తో మ్యాచ్‌లో విఫలమైన అతను ఈ సారి తనదైన ముద్ర వేయాలని పట్టుదలగా ఉన్నాడు. గత కొంతకాలంగా చూస్తే ఆఫ్‌స్టంప్ ఆవల పడిన బంతిని ఆడే ప్రయత్నంలో రాహుల్ బంతిని స్టంప్స్ పైకి ఆడుకొని తరచుగా అవుటవుతున్నాడు. ఈ లోపాన్ని సరిదిద్దుకోవడంపైనే అతను దృష్టి పెట్టాడు. ద్రవిడ్ నేతృత్వంలోని కోచింగ్ బృందం కూడా దీనిని సరిదిద్దే ప్రయత్నం చేసింది. నెట్స్‌లో బౌలింగ్ చేసిన శార్దుల్ ఠాకూర్, సిరాజ్ పదే పదే 'ఫోర్త్ స్టంప్'పైనే బంతులు వేసి రాహుల్‌కు కావాల్సిన ప్రాక్టీస్‌ను ఇచ్చారు. బుధవారం జట్టుకు విశ్రాంతి దినం కావడంతో ఇక టీమిండియా నేరుగా మ్యాచ్ కోసమే మైదానంలోకి దిగనుంది.

# నెదర్లాండ్స్‌పై బంగ్లా గెలుపు

**తస్కీన్‌కు 4 వికెట్లు**



హోబర్ట్: టి20 ప్రపంచకప్ గ్రూప్–2లో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 9 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. మొదట బంగ్లా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. అఫీఫ్ హొస్సేన్ (27 బంతుల్లో 38; 2 ఫోర్లు, 2 సిక్సర్లు), నజ్ముల్ హొస్సేన్ (20 బంతుల్లో 25; 4 ఫోర్లు), మొసాదిక్ (12 బంతుల్లో 20 నాటౌట్; 1 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. పాల్ వాన్, డి లీడే చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత నెదర్లాండ్స్ 20 ఓవర్లలో 135 పరుగుల వద్ద ఆలౌటైంది. కొలిన్ అకెర్‌మన్ (48 బంతుల్లో 62; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), పాల్ వాన్ మీకెరన్ (14 బంతుల్లో 24; 3 ఫోర్లు, 1 సిక్స్) పోరాడినా లాభం లేకపోయింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తస్కీన్ అహ్మద్ (4/25) నాలుగు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశాడు.

**సఫారీకి వర్షం దెబ్బ**

ఇదే గ్రూప్‌లో దక్షిణాఫ్రికా గెలిచే మ్యాచ్‌కు వర్షం షాకిచ్చింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 9 ఓవర్లకు కుదించగా, ఆట మధ్యలో అది 7 ఓవర్ల మ్యాచ్‌గా మారింది. అయితే చివరకు అదీ సాధ్యం కాక మ్యాచ్‌ను రద్దు చేయాల్సి వచ్చింది. మొదట జింబాబ్వే 9 ఓవర్లలో 5 వికెట్లకు 79 పరుగులు చేసింది. 7 ఓవర్లలో 64 పరుగుల లక్ష్యంగా మార్చారు. కానీ 3 ఓవర్లలో దక్షిణాఫ్రికా వికెట్ కోల్పోకుండా 51 పరుగులు చేసి గెలిచేందుకు సిద్ధమైతే... మళ్లీ కురిసిన వాన మ్యాచ్‌ను ముంచెత్తింది. డికాక్ (18 బంతుల్లో 47 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు ఇన్నింగ్స్ వర్షార్పణమైంది. తొలి 2 ఓవర్లు తనే ఎదుర్కొన్న డికాక్ వరుసగా 4, 4, 4, 6, 4, 1, నోబాల్, 0, 4, 4, 4, 0, 4 బాదడం విశేషం.

# భారత్ ఘన విజయం



జొహొర్ (మలేసియా): సుల్తాన్ ఆఫ్ జొహొర్ కప్ జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు చెలరేగింది. మంగళవారం జరిగిన పోరులో భారత్ 5–1 గోల్స్ తేడాతో జపాన్‌ను చిత్తు చేసింది. భారత్ తరఫున ఉత్తమ్ సింగ్ (3వ నిమిషం), రోహిత్ (12), జాన్సన్ పుర్తీ (21), బాబీ సింగ్ ధామి (31), అమన్‌దీప్ లక్రా (51) గోల్స్ సాధించగా...జపాన్ తరఫున నమోదైన ఏకైక గోల్‌ను ఇకుమి సయాకి (15వ నిమిషం) చేశాడు. తర్వాతి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో భారత్ తలపడుతుంది.


కైరోలో జరిగిన వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన తెలంగాణ షూటర్ ఇషా సింగ్‌ను తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. ఈ టోర్నీలో ఇషా వేర్వేరు ఈవెంట్లలో కలిపి 3 స్వర్ణాలు, ఒక కాంస్యం గెలుచుకుంది. కార్యక్రమంలో రైఫిల్ సంఘం ఉపాధ్యక్షుడు ఉదయ్ పిలానీ, 'శాట్స్' చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చాంప్ వెర్‌స్టాపెన్

**యూఎస్ గ్రాండ్‌ప్రి**



ఆస్టిన్: ఫార్ములావన్ సీజన్‌లో ఇదివరకే చాంపియన్‌షిప్ ఖాయం చేసుకున్న రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ ఖాతాలో మరో విజయం చేరింది. యూఎస్ గ్రాండ్‌ప్రిలోనూ ఈ బెల్జియం రేసర్ విజయం సాధించాడు. సర్క్యూట్ ఆఫ్ అమెరికాస్‌లో సోమవారం రాత్రి ముగిసిన 56 ల్యాపుల రేసును వెర్‌స్టాపెన్ అందరికంటే ముందుగా ముగించాడు. గంటా 42 నిమిషాల 11.687 సెకన్లలో ముగించి 2022 సీజన్‌లో 13వ టైటిల్ సాధించాడు. మాజీ చాంపియన్, మెర్సిడెజ్ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ 5.023 సెకన్ల తేడాతో రెండో స్థానంలో నిలువగా, ఫెరారి డ్రైవర్ లెక్‌లెర్క్ 7.501 సెకన్ల తేడాతో మూడో స్థానంలో నిలిచాడు. ఈ సీజన్‌లో ప్రస్తుతం 13 విజయాలతో 391 పాయింట్లతో వరల్డ్ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకోగా... చార్లెస్ లెక్‌లెర్క్ (267), సెర్గియో పెరెజ్ (రెడ్‌బుల్; 265) రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. ఈ సీజన్‌లో తదుపరి రేసు మెక్సికన్ గ్రాండ్ ప్రి 29, 30 తేదీల్లో జరుగుతుంది. సీజన్‌లో తర్వాతి రేసు మెక్సికన్ గ్రాండ్‌ప్రిగా ఉంటుంది.

# 'దక్షిణాఫ్రికా టాంపరింగ్ చేసింది'

**టిమ్ పెయిన్ వెల్లడి**

సిడ్నీ: 2018లో కేప్‌టౌన్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా టెస్టు సందర్భంగా జరిగిన 'బాల్ టాంపరింగ్' ఉదంతం క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపర్చింది. దాంతో స్మిత్, వార్నర్, బాన్‌క్రాఫ్ట్‌లపై వేటు పడటంతో పాటు తర్వాతి మ్యాచ్‌నుంచి టిమ్ పెయిన్ ఆస్ట్రేలియాకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అయితే నాటి ఘటనను తన పుస్తకం 'ద పెయిడ్ ప్రైస్'లో గుర్తు చేసుకున్న పెయిన్...తామే కాదు, తర్వాతి టెస్టులో దక్షిణాఫ్రికా కూడా టాంపరింగ్ చేసిందని వ్యాఖ్యానించాడు. అయితే స్థానిక ప్రసారకర్తల సహాయంతో ఆ వీడియోను దాచేశారని అతను ఆరోపించాడు. 'సిరీస్ నాలుగో టెస్టులో ఇది జరిగింది. దక్షిణాఫ్రికా ప్లేయర్ చేతిలో ఉన్న బంతిపై చాలా పగుళ్లు ఉన్న దృశ్యం అక్కడి భారీ స్క్రీన్‌పై కనిపించింది. కానీ ఆ వెంటనే దానిని తొలగించారు. మేం ఈ విషయంపై అంపైర్లతో మాట్లాడినా అసలు ఎవరూ పట్టించుకోలేదు' అని పెయిన్ చెప్పాడు. బాల్ టాంపరింగ్ ఘటన సమయంలో తమ ముగ్గురు క్రికెటర్లకు ఎవరూ అండగా నిలవలేదని విషయాన్ని అతను అంగీకరించాడు. 'సాధారణంగా ఇలాంటి సమయంలో తమ ఆటగాళ్లను సహచర క్రికెటర్లు ఆదుకోవాలి. మానసికంగా వారికి అండగా నిలవాలి. కానీ వారందరినీ వెలి వేసినట్లు చూశారు' అని పెయిన్ చెప్పాడు.

# మళ్లీ ఓడిన తెలుగు టైటాన్స్



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో తెలుగు టైటాన్స్ పేలవమైన ప్రదర్శన కొనసాగుతోంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో 24–42 స్కోరుతో హరియాణా స్టీలర్స్ చేతిలో చిత్తుగా ఓడింది. హరియాణా రెయిడర్ మీతూ శర్మ అదరగొట్టాడు. 18 సార్లు కూతకెళ్లిన మీతూ 13 పాయింట్లు సాధించాడు. మిగతా వారిలో మన్‌జీత్ (7), కెప్టెన్ నితిన్ రావల్ (4), జైదీప్ దహియా (4) రాణించారు. తెలుగు టైటాన్స్‌లో సిద్ధార్థ్ దేశాయ్ చేసిన 5 పాయింట్లే అత్యధిక స్కోరు. ఆదర్శ్, విజయ్ కుమార్ చెరో 4 పాయింట్లు చేశారు. ఈ సీజన్‌లో ఏడు మ్యాచ్‌లాడిన టైటాన్స్ ఒకే ఒక్క మ్యాచ్‌లో గెలిచింది.

# సైనా నెహ్వాల్ పరాజయం

- సాత్విక్–చిరాగ్ ముందంజ
- ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 టోర్నమెంట్‌లో భారత ప్లేయర్ సైనా నెహ్వాల్ ఆట తొలి పోరులోనే ముగిసింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలిరౌండ్ మ్యాచ్‌లో సైనా నెహ్వాల్ 21–13, 17–21, 19–21తో వ్యోనె లీ (జర్మనీ) చేతిలో ఓడింది. తొలి గేమ్‌ను గెలుచుకున్న సైనా, ఆ తర్వాత ప్రత్యర్థి ముందు నిలబడలేకపోయింది. మరో వైపు డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ షెట్టి జంట శుభారంభం చేసింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్ పోరులో కామన్వెల్త్ చాంపియన్స్, ఏడోసీడ్ సాత్విక్–చిరాగ్ ద్వయం ప్రీక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్–చిరాగ్ జోడీ 19–21, 21–9, 21–13తో క్రిస్టో పాపొవ్–తొమా జూనియర్ పాపొవ్ (ఫ్రాన్స్) జంటపై గెలుపొందింది. తొలి గేమ్‌ను కోల్పోయిన భారత జోడీ తర్వాతి గేమ్‌లలో పుంజుకొంది. రెండో గేమ్‌ను చకచకా ముగించగా, నిర్ణాయక గేమ్‌లోనూ ఇదే ఆటతీరు కొనసాగించడంతో స్థానిక ఆటగాళ్లకు పరాజయం తప్పలేదు. ఒక గంటా 8 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో ఫ్రాన్స్ జోడీ తేలిపోయింది. అయితే మిక్స్‌డ్, మహిళల డబుల్స్‌లో భారత షట్లర్లకు చుక్కెదురైంది. మహిళల డబుల్స్ మ్యాచ్‌లో గాయత్రి గోపీచంద్–ట్రెసా జాలీ జంట 21–23, 20–22తో ఆరో సీడ్ జొంగకొల్ఫాన్ కిటితరకుల్–రవిండ ప్రజొంగ్జయ్ (థాయ్‌లాండ్) ద్వయం చేతిలో పోరాడి ఓడింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఇషాన్ భట్నాగర్–తనీషా క్రాస్టో జోడీ 13–21, 16–21తో జపాన్‌కు చెందిన క్యోహెయ్ యమషిత–నరు షినోయా జంట చేతిలో పరాజయం చవిచూసింది.

## ఐదో ర్యాంక్‌కు సింధు

న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మరో సారి టాప్–5లోకి అడుగు పెట్టింది. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) మంగళవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో సింధు ఐదో స్థానంలో నిలిచింది. దాదాపు మూడేళ్ల విరామం తర్వాత ఆమె టాప్–5లోకి వెళ్లడం విశేషం. కామన్వెల్త్ క్రీడల తర్వాత గాయం కారణంగా సింధు ఆటకు దూరమైంది. అయితే గాయంనుంచి కోలుకున్న ఆమె సోమవారమే హైదరాబాద్‌లో ప్రాక్టీస్ మొదలు పెట్టింది. సైనా నెహ్వాల్ ఒక స్థానం దిగజారి 33వ ర్యాంక్‌కు పడిపోయింది. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ ఒక స్థానం మెరుగుపర్చుకొని 12వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. లక్ష్యసేన్, కిడాంబి శ్రీకాంత్ వరుసగా 8, 11వ స్థానాల్లో కొనసాగుతున్నారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి జోడీ కూడా తమ 8వ ర్యాంక్‌ను నిలబెట్టుకుంది.

స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ | 288 | 59,544 |
| నిఫ్టీ ▽ | 74 | 17,656 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి నాలుగు రాత్రి 8.30 గంటలకు)

| సూచీ | విలువ | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 11,122 | △ | 169 |
| డోజోన్స్ | 31,732 | △ | 217 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,013 | ▽ | 1 |
| డాక్స్ | 13,053 | △ | 122 |
| షాంఘై | 2,976 | ▽ | 1 |
| నికాయ్ | 27,250 | △ | 102 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

| ముంబై | |
|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 50,444 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 50,242 |
| వెండి (కిలో) | 56,596 |



## బీఎస్‌ఈలో ఎలక్ట్రానిక్ గోల్డ్ షురూ

ఈజీఆర్ ప్లాట్‌ఫామ్ ద్వారా ట్రేడింగ్



**న్యూఢిల్లీ:** బంగారం ట్రేడింగ్‌లో పారదర్శకతకు తెరతీస్తూ దిగ్గజ స్టాక్ ఎక్స్ఛేంజీ బీఎస్‌ఈ.. ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీప్ట్స్(ఈజీఆర్) ప్లాట్‌ఫామ్‌ను ప్రవేశపెట్టింది. దీపావళి సందర్భంగా నిర్వహించిన ముహూరత్ ట్రేడింగ్ ద్వారా 995, 999 స్వచ్ఛత పేరుతో రెండు ప్రొడక్టులను ప్రారంభించింది. వీటిని 1 గ్రాము పరిమాణంతో ప్రారంభించడంతోపాటు 10 గ్రాములు, 100 గ్రాములలోనూ డెలివరీలకు వీలు కల్పించింది. ఈజీఆర్ ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి గత నెలలో బీఎస్‌ఈకి తుది అనుమతి లభించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలో సూచనప్రాయ అనుమతి లభించాక సభ్యులు ట్రేడింగ్ చేసేందుకు వీలుగా బీఎస్‌ఈ పరీక్షార్థం పలుమార్లు మాక్ ట్రేడింగ్‌ను నిర్వహించింది. కాగా.. ఈజీఆర్‌లో వ్యక్తిగత ఇన్వెస్టర్లతోపాటు..బులియన్ ట్రేడర్లు, వాణిజ్య క్లయింట్లు తదితర సంస్థలు సైతం ట్రేడింగ్‌ను చేపట్టేందుకు వీలుంటుంది. దిగుమతిదారులు, బ్యాంకులు, రిఫైనరీలు, ఆభరణ తయారీదారులు, రిటైలర్లు ఈ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించుకోవచ్చు. దీంతో స్పాట్ ధరల్లో మరింత పారదర్శకత వస్తుందని బులియన్ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 26-10-2022 | |
|---|---|
| విశాఖ | 500-00 |
| చిత్తూరు | 523-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 495-00 |
| విజయవాడ | 495-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| **25-10-2022 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 480-00 |
| వరంగల్ | 482-00 |
| రిటైల్ ధర | 5.40 |

# వాట్సాప్ సేవలకు అంతరాయం

- ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయిన సర్వీసులు
- దాదాపు 2 గంటల తర్వాత మళ్లీ షురూ




**న్యూఢిల్లీ:** పాపులర్ మెసేజింగ్ యాప్ 'వాట్సాప్' సేవలు మంగళవారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు రెండు గంటల పాటు నిల్చిపోయాయి. దీంతో మెసేజీలు పంపలేక, అందుకోలేక యూజర్లు ఇబ్బందిపడ్డారు. చాలా మంది తమ డెస్క్‌టాప్‌లు, ల్యాప్‌టాప్‌లలో ఉపయోగించే వెబ్ వెర్షన్ అయిన 'వాట్సాప్ వెబ్' కూడా పని చేయలేదు. సుమారు రెండు గంటల తర్వాత వాట్సాప్ మాతృ సంస్థ మెటా .. సమస్యను పరిష్కరించి, సేవలను పునరుద్ధరించింది. అయితే, అంతరాయానికి దారి తీసిన కారణాలను మాత్రం వెల్లడించలేదు. 'వాట్సాప్ యూజర్లు మెసేజీలను పంపించడంలో నేడు సమస్యలు ఎదుర్కొన్న విషయాన్ని మేము గమనించాము. సమస్యను పరిష్కరించాము. దీనివల్ల ఏదైనా అసౌకర్యం కలిగితే క్షమించాలని కోరుతున్నాము' అని మెటా ప్రతినిధి చెప్పారు. 2014లో వాట్సాప్‌ను మెటా (గతంలో ఫేస్‌బుక్) కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

**దీపావళి వేళ..:**
సర్వీసుల్లో అంతరాయాలను ట్రాక్ చేసే డౌన్‌డిటెక్టర్ సంస్థ వివరణ ప్రకారం భారత కాలమానం మధ్యాహ్నం 12.47 గంటల నుంచి వాట్సాప్‌లో సమస్యలు తలెత్తాయి. వివిధ ప్రాంతాల్లో చాలా మందికి వాట్సాప్ పనిచేయలేదు. ఆసియా, యునైటెడ్ కింగ్‌డమ్, దక్షిణాఫ్రికా, యూరప్ దేశాల్లోని యూజర్లు.. మెసేజీలు, వీడియోలు పంపడంలోను, అందుకోవడంలోను ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డౌన్‌డిటెక్టర్‌లో ఒక దశలో దేశీయంగా 29,000 పైచిలుకు ఫిర్యాదులు వచ్చాయి. ఎక్కువగా ఢిల్లీ, ముంబై వంటి ప్రధాన నగరాల్లోని యూజర్లపై ప్రభావం పడినట్లు సంస్థ హీట్‌మ్యాప్ చూపింది. దీపావళి, భాయ్ దూజ్ పండుగల సమయంలో ఇలా జరగడంతో యూజర్లు ఇబ్బంది పడ్డారు. పాక్షిక సూర్యగ్రహణం ప్రారంభం కావడానికి కొంత సేపు ముందు ఇలా జరిగింది. అయితే, రెండింటికీ సంబంధం లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2021 అక్టోబర్ 5 తర్వాత వాట్సాప్ సర్వీసులు ఈ స్థాయిలో నిల్చిపోవడం ఇదే ప్రథమం. మెటాలో భాగమైన వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ సేవలు అప్పట్లో కొన్ని గంటల పాటు నిల్చిపోయాయి.

**ట్విటర్‌లో మీమ్‌ల సందడి..**
వాట్సాప్ సేవలు నిల్చిపోవడంపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ట్విటర్ వేదికగా వాట్సాప్‌డౌన్ పేరిట హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అయ్యింది. వాట్సాప్‌ను ఆటపట్టిస్తూ .. 'వాట్సాప్ వర్సిటీ విద్యార్థులారా ఇవాళ సెలవు ప్రకటించాం. రేపటి నుండి తరగతులు మళ్లీ ప్రారంభమవుతాయి', 'వాట్సాప్ పని చేస్తోందో లేదో తెలుసుకునేందుకు యూజర్లు ట్విట్టర్‌ను ఆశ్రయిస్తున్నారు', 'ప్రశ్న: వాట్సాప్ పని చేయడం లేదని యూజర్లకు ఎలా చెప్పాలి? ప్రొఫెసర్ సమాధానం: ఇలాంటప్పుడే ట్విట్టర్ పని కొస్తుంది' అంటూ సరదా మీమ్స్ వెల్లువెత్తాయి.

## డిసెంబర్‌లో నాలుగో విడత భారత్ బాండ్ ఈటీఎఫ్




**న్యూఢిల్లీ:** నాలుగో విడత భారత్ బాండ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్)ను డిసెంబర్‌లో ప్రవేశపెట్టాలని కేంద్రం యోచిస్తోంది. దీని ద్వారా సమీకరించిన నిధులను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్‌ఈ) పెట్టుబడి అవసరాల కోసం వినియోగించనున్నారు. ప్రస్తుతం సీపీఎస్‌ఈల నిధుల అవసరాలపై వాటితో చర్చలను జరుపుతున్నట్లు ఒక అధికారి తెలిపారు. తాజా భారత్ బాండ్ ఈటీఎఫ్ పరిమాణం దాదాపు గతేడాది స్థాయిలోనే ఉండవచ్చని పేర్కొన్నారు. గతేడాది డిసెంబర్‌లో రూ.1,000 కోట్ల కోసం మూడో విడత జారీ చేయగా 6.2 రెట్లు ఓవర్ సబ్‌స్క్రయిబ్ అయ్యి రూ. 6,200 కోట్లు వచ్చాయి. భారత్ బాండ్ ఈటీఎఫ్ దేశీయంగా తొలి కార్పొరేట్ బాండ్ ఈటీఎఫ్. 2019లో దీన్ని తొలిసారిగా ప్రవేశపెట్టగా అప్పట్లో రూ. 12,400 కోట్లు వచ్చాయి. ఇక రెండో విడతలో రూ. 11,000 కోట్లు వచ్చాయి. ఇప్పటివరకు 3 విడతల్లో రూ. 29,600 కోట్లు సమీకరించారు.

# గూగుల్‌కు మళ్లీ జరిమానా

ప్లేస్టోర్ విధానాలపై రూ. 936 కోట్లు విధించిన సీసీఐ




**న్యూఢిల్లీ:** టెక్ దిగ్గజం గూగుల్‌కు వారం రోజుల వ్యవధిలో కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మరోసారి జరిమానా విధించింది. ఈసారి ప్లే స్టోర్ విధానాలకు సంబంధించి ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందన్న అభియోగాలపై రూ. 936 కోట్ల పెనాల్టీ వేసింది. ఆండ్రాయిడ్ మొబైల్ డివైజ్‌ల విషయంలోనూ ఇలాంటి ఆరోపణలపై ఇటీవలే అక్టోబర్ 20న గూగుల్‌కు సీసీఐ రూ. 1,338 కోట్లు జరిమానా విధించిన సంగతి తెలిసిందే. తాజాగా మంగళవారం ఇచ్చిన ఆదేశాల్లో ప్లే స్టోర్ విధానాలకు సంబంధించి గూగుల్ తన ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందని సీసీఐ పేర్కొంది. పెయిడ్ యాప్స్, ఇన్-యాప్ విక్రయాల ద్వారా ఆదాయాన్ని ఆర్జించేందుకు యాప్ డెవలపర్లు .. గూగుల్ ప్లే బిల్లింగ్ సిస్టమ్‌నే (జీపీబీఎస్) తప్పనిసరిగా వాడాలంటూ విధిస్తున్న షరతు అసమంజసమైనదని స్పష్టం చేసింది. ఇలాంటి అనుచిత వ్యాపార విధానాలను మానుకోవాలని సూచించింది. అలాగే యాప్ డెవలపర్లు థర్డ్ పార్టీ బిల్లింగ్ / పేమెంట్ ప్రాసెసింగ్ సర్వీసులను వినియోగించుకోకుండా అడ్డుకోరాదని గూగుల్‌ను ఆదేశించింది. కంపెనీ ఇచ్చిన డేటాలో పలు లొసుగులు ఉన్నందున ఆండ్రాయిడ్ కేసులో ఇచ్చిన ఉత్తర్వుల తరహాలోనే ఈ కేసులోనూ పెనాల్టీ పరిమాణం ప్రాథమికంగా విధించినది మాత్రమేనని, 30 రోజుల్లోగా సక్రమంగా అన్ని వివరాలు అందించాలని సూచించింది. భారతీయ మార్కెట్లో ఆన్‌లైన్ సెర్చి విషయంలో అసమంజస వ్యాపార విధానాలు పాటిస్తోందంటూ 2018 ఫిబ్రవరిలో కూడా గూగుల్‌కు సీసీఐ రూ. 136 కోట్లు పెనాల్టీ విధించింది.

# ఏడు రోజుల ర్యాలీకి బ్రేక్

- ఫైనాన్షియల్, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో లాభాల స్వీకరణ
- బలిప్రతిపద సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు



**ముంబై:** ఫైనాన్షియల్, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో లాభాల స్వీకరణతో స్టాక్ సూచీల ఏడురోజుల వరుస ర్యాలీకి మంగళవారం బ్రేక్ పడింది. ఆసియా మార్కెట్లలోని బలహీన సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు ఒకటిన్నర శాతం పతనమూ సూచీల నష్టాలకు కారణమైంది. సెన్సెక్స్ 288 పాయింట్ల నష్టంతో 59,544 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 75 పాయింట్లు పతనమై 17,656 వద్ద నిలిచింది. ప్రైవేట్ రంగ బ్యాంక్స్, ఎఫ్‌ఎంసీజీ, రియల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ప్రభుత్వరంగ బ్యాంక్స్, ఫార్మా, మెటల్, ఐటీ, ఆటో రంగాల షేర్లు రాణించాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ సూచీ అర శాతం లాభపడగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.35% చొప్పున నష్టపోయింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.247 కోట్ల షేర్లను అమ్మారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.872 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియాలో హాంగ్‌కాంగ్, తైవాన్, కొరియా, ఇండోనేషియా, చైనా దేశాల మార్కెట్లు నష్టపోయాయి. యూరప్ సూచీలు అరశాతం లాభపడ్డాయి. అమెరికా స్టాక్ ఫ్యూచర్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

**60వేల స్థాయి నుంచి వెనక్కి**
సెన్సెక్స్ ఉదయం 171 పాయింట్ల లాభంతో 60,003 వద్ద, నిఫ్టీ 77 పాయింట్లు పెరిగి 17,808 వద్ద మొదలయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 60,081 గరిష్టాన్ని తాకింది. లాభాల స్వీకరణతో నష్టాల్లోకి జారుకుంది. ఒక దశలో 59,489 పాయింట్ల వద్ద కనిష్టానికి దిగివచ్చింది. నిఫ్టీ 17,637-17,812 పాయింట్ల మధ్య కదలాడింది.

**నేడు మార్కెట్లకు సెలవు**
బలిప్రతిపద సందర్భంగా (నేడు)బుధవారం బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ ఎక్స్ఛేంజీలు పనిచేయవు. అయితే కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లు ఉదయం సెషన్‌లో మాత్రమే సెలవును పాటిస్తాయి. సాయంత్రం సెషన్‌లో ట్రేడింగ్ జరుగుతుంది.

**'మూరత్ ట్రేడింగ్'లో లాభాలు**
దీపావళి(హిందూ సంవత్ 2079 ఏడాది)సందర్భంగా సోమవారం జరిగిన 'మూరత్ ట్రేడింగ్'లో దేశీ స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. సాయంత్రం 6.15 నుంచి రాత్రి 7.15 నిమిషాల మధ్య జరిగిన ఈ ప్రత్యేక ట్రేడింగ్‌లో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. ఫలితంగా సెన్సెక్స్ 525 పాయింట్ల లాభంతో 59,831 వద్ద ముగిసింది. నిఫ్టీ 154 పాయింట్లు పెరిగి 17,731 వద్ద స్థిరపడింది.

## భవిత

- ప్రభుత్వ ఉద్యోగాల సమాచారం- జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

దైలీ కరెంట్ అఫైర్స్
అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడే కీలకమైన 'దైలీ కరెంట్ అఫైర్స్' కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

# జాబ్ పాయింట్

### డిగ్రీతోనే ఐఐటీలో కొలువు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)-కాన్పూర్.. పలు ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. దీనిలో భాగంగా జూనియర్ అసిస్టెంట్ విభాగంలో నియామకాలను చేపట్టనుంది. డిగ్రీ విద్యార్హతతోనే ఈ ఉద్యోగాలను సొంతం చేసుకోవచ్చు. వీటికి ఎంపికైతే నెలకు రూ.70వేల వరకు వేతనంగా పొందవచ్చు. అర్హతలు, ఆసక్తి గల అభ్యర్థులు నవంబర్ 9 తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 119(ఎస్సీ-15, ఎస్టీ-02, ఓబీసీ-34, పీడబ్ల్యూడీ-06, ఈడబ్ల్యూఎస్-11, అన్ రిజర్వ్‌డ్ 51 పోస్టులు)

**అర్హతలు**

» కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే వీరికి కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. దీంతోపాటు ఎస్టాబ్లిష్‌మెంట్ మేటర్స్/ఆర్ అండ్ డీ/లీగల్/పర్చేస్ అండ్ ఇంపోర్ట్/అకౌంట్స్ /ఆడిట్/హాస్పిటాలిటీ మొదలైన విభాగాల్లో రెండేళ్ల పని అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తారు.
» **వయసు:** 09.11.2022 నాటికి 21-30 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు వర్తిస్తుంది. ఐఐటీ కాన్పూర్‌లో పనిచేసే ఉద్యోగులకు గరిష్ట వయసు 50ఏళ్లుగా నిర్ణయించారు. వీరికి తగిన విద్యార్హతలు ఉండాలి.
» **వేతనాలు:** ఈ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు పే లెవల్ -03 ప్రకారం-నెలకు రూ.21,700 -రూ.69,100 వరకు వేతనంగా పొందుతారు.
» **ఎంపిక ఇలా:** వచ్చిన దరఖాస్తులను షార్ట్‌లిస్ట్ చేయడం,రాత పరీక్ష/జాబ్ ఓరియెంటెడ్ ప్రాక్టికల్ టెస్ట్‌ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థుల వివరాలను ఈ-మెయిల్ ద్వారా తెలియజేస్తారు.

**ముఖ్య సమాచారం**

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
» దరఖాస్తులకు చివరి తేదీ: 09.11.2022
» వెబ్‌సైట్: www.iitk.ac.in/new/recruitment

### ఐటీబీపీలో 293 హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ పోస్టులు

ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ) గ్రూప్ సి నాన్-గెజిటెడ్(నాన్ మినిస్టీరియల్) విభాగంలో.. హెడ్ కానిస్టేబుల్(టెలికమ్యూనికేషన్), కానిస్టేబుల్ (టెలికమ్యూనికేషన్) పోస్టుల భర్తీకి పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 293
» **పోస్టుల వివరాలు:** హెడ్ కానిస్టేబుల్(టెలికమ్యూనికేషన్)-126(పురుషులు-107, మహిళలు-19); కానిస్టేబుల్(టెలికమ్యూనికేషన్)-167(పురుషులు-142, మహిళలు-25).
» **అర్హతలు:** హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు 12వ తరగతి(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్) లేదా టీఐ(ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రికల్/కంప్యూటర్)/డిప్లొమా (ఎలక్ట్రానిక్స్/కమ్యూనికేషన్ /ఇన్‌స్ట్రుమెంటేషన్/కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఎలక్ట్రికల్). కానిస్టేబుల్ పోస్టులకు మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణులై ఉండాలి. » **వయసు:** 30.11.2022 నాటికి హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు 18-25ఏళ్లు, కానిస్టేబుల్ పోస్టులకు 18-23ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు రూ.25,500 నుంచి రూ.81,100; కానిస్టేబుల్ పోస్టులకు రూ.21,700 నుంచి రూ.69,100 ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంటేషన్, రాత పరీక్ష, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

**ముఖ్య సమాచారం**

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 01.11.2022
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:30.11.2022
» వెబ్‌సైట్: https://itbpolice.nic.in

### ఎన్ఐఓ, విశాఖపట్నంలో ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులు

విశాఖపట్నంలోని సీఎస్ఐఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీకి చెందిన ఎన్ఐఓ ప్రాంతీయ కేంద్రం.. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసోసియేట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ అసోసియేట్1-05, ప్రాజెక్ట్ అసిస్టెంట్-02.
» **అర్హత:** బీఎస్సీ, ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులకు 35 ఏళ్లు, ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టులకు 50 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులకు రూ.25,000, ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టులకు రూ.20,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** hrdg@nio.org
» **దరఖాస్తులకు చివరితేది:** 30.10.2022
» **వెబ్‌సైట్:** www.nio.org

# జాయినింగ్.. జాప్యం అందుకేనా!

» ఐటీ సంస్థల్లో ఆన్ బోర్డింగ్‌లో ఆలస్యం
» ఆఫర్ ఇచ్చినా జాయినింగ్ తేదీలపై అస్పష్టత
» ఆందోళనలో ఆఫర్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు
» నూతన నియామకాలుంటాయంటున్న దేశీయ ఐటీ కంపెనీలు

**ఇంజనీరింగ్ పట్టా సొంతం చేసుకోవాలి. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో నెగ్గి.. ఆఫర్ లెటర్ అందుకోవాలి! ఆ ఆఫర్ లెటర్‌తో సాఫ్ట్‌వేర్ కెరీర్‌లో దూసుకుపోవాలి. ఇది ఎక్కువ మంది ఇంజనీరింగ్ విద్యార్థుల స్వప్నం!! కానీ..గత కొన్ని నెలలుగా పరిణామాలను పరిశీలిస్తే..కొంత భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. కంపెనీలు ఆఫర్ లెటర్లు ఇచ్చినా.. అపాయింట్‌మెంట్ తేదీలు ఖరారు చేయడంలేదు!! ఈ నేపథ్యంలో.. ఐటీ కంపెనీల్లో ఆన్‌బోర్డింగ్‌లో ఆలస్యానికి కారణాలు.. రానున్న రోజుల్లో జాబ్ మార్కెట్ ట్రెండ్స్.. జాయినింగ్ లెటర్స్ చేతికి రాని విద్యార్థుల ముందున్న మార్గాలేమిటో తెలుసుకుందాం..**

- **విక్రమ్..** 2022లో బీటెక్ పూర్తి చేసుకున్నాడు. అంతకుముందు 2021 నవంబర్‌లో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ప్రముఖ ఐటీ సంస్థలో రూ.5లక్షల వార్షిక వేతనంతో ఆఫర్ సొంతం చేసుకున్నాడు. బీటెక్ సర్టిఫికెట్ జూన్‌లోనే చేతికందినా..ఇప్పటివరకూ ఆఫర్ ఇచ్చిన సంస్థ నుంచి ఆన్ బోర్డింగ్(జాయినింగ్) తేదీపై ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నాడు.
- **రమేశ్..** ఓ ప్రముఖ సంస్థ నిర్వహించిన ఆఫ్ క్యాంపస్ డ్రైవ్‌లో విజయం సాధించి.. ఆఫర్ ఖరారు చేసుకున్నాడు. దీనికోసం..అప్పటికే పని చేస్తున్న సంస్థకు రాజీనామా కూడా చేశాడు. కానీ.. రోజులు గడుస్తున్నా.. ఆఫర్ ఇచ్చిన కంపెనీ నుంచి జాయినింగ్ తేదీపై ఎలాంటి స్పష్టత లేదు. దీంతో తన పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారిందని దిగులు చెందుతున్నాడు.
- ఇలా విక్రమ్, రమేశ్‌లే కాకుండా..వేల మంది ఉద్యోగార్థులకు ప్రస్తుతం ఇలాంటి అనుభవమే ఎదురవుతోంది. క్యాంపస్ డ్రైవ్స్‌లో ఆఫర్లు ఖరారు చేసిన సంస్థలు.. జాయినింగ్ తేదీపై జాప్యం చేస్తుండటంతో ఆందోళనకు గురవుతున్నారు.
- క్యాంపస్ డ్రైవ్స్ లేదా ఇతర నియామక విధానాల ద్వారా ఆఫర్ అందుకుని.. ఆన్ బోర్డింగ్ లెటర్స్ అందని వారి సంఖ్య 30 వేలకు పైగా ఉంటుందని అంచనా.
- ఈ సంఖ్య ఐటీ కంపెనీలకు సంబంధించినది మాత్రమేనని.. ఇతర రంగాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే మరింత ఎక్కువగానే ఉంటుందని అంటున్నారు.

**సందిగ్ధ పరిస్థితులు**

- కొన్ని కంపెనీలు గతేడాది ఆఫర్ లెటర్స్ ఇచ్చినా.. ఇప్పటివరకు అపాయింట్‌మెంట్ తేదీలు ఖరారు చేయలేదు.. ▪ ఫేస్‌బుక్, గూగుల్, ఇంటెల్ వంటి టాప్ కంపెనీలు ఉద్యోగుల తొలగింపుపై సంకేతాలు ఇస్తున్నాయి.. ▪ మరోవైపు దేశీయంగా టీసీఎస్, విప్రో వంటి సంస్థలు కొత్త నియామకాలు ఉంటాయని పేర్కొంటున్నాయి..
- పై 3 రకాల పరిస్థితుల కారణంగా ఇటు ఫ్రెషర్స్‌తోపాటు, ఇప్పటికే ఉద్యోగం చేస్తున్న వారు, అదే విధంగా గతేడాది క్యాంపస్ డ్రైవ్స్‌లో ఎంపికైన వారు సందిగ్ధ పరిస్థితికి గురవుతున్నారు.

**ఐటీ దిగ్గజాల నుంచే జాప్యం**

- ఆఫర్ లెటర్లు ఇచ్చినా.. జాయినింగ్ లెటర్స్ జారీలో జాప్యం చేస్తున్న కంపెనీల్లో అధికంగా ఐటీ దిగ్గజ సంస్థలే ఉండడం విద్యార్థులను మరింత ఆందోళనకు గురి చేస్తోంది. అంతేకాకుండా మరికొన్ని సంస్థలు.. ఆఫర్ లెటర్స్ ఇచ్చిన వారికి.. సదరు ఆఫర్‌ను తిరస్కరిస్తున్నట్లుగా సమాచారం కూడా ఇస్తున్నాయి. ఇలా ఆఫర్ తిరస్కరణ సందర్భంలో.. 'మా సంస్థ ప్రమాణాలకు అనుగుణంగా మీ అర్హతలు లేవు' అనో.. లేదా 'మీరు మీ ప్రొఫైల్‌కు సరిపడే సర్టిఫికేషన్స్ పూర్తి చేయలేదు' అనో పేర్కొంటున్నాయి. దీంతో క్యాంపస్ డ్రైవ్‌లో తమ అకడమిక్ ప్రతిభను, మార్కులను, స్కిల్స్‌ను పరిగణనలోకి తీసుకొని ఎంపిక చేసి, ఆఫర్ లెటర్లు ఇచ్చిన సంస్థలు.. ఇప్పుడు వెనక్కి తీసుకోవడం ఏంటి? అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

**ఉద్యోగుల తొలగింపు**

- ప్రస్తుత పరిస్థితుల్లో పలు ఎంఎన్‌సీ సంస్థల్లో ఉద్యోగుల తొలగింపులు ఉంటాయనే సంకేతాలు ఆందోళనకు గురిచేస్తున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.
- ఇప్పటికే ఫేస్‌బుక్ ఆధ్వర్యంలోని మెటా సంస్థలో 12 వేల మందిని పనితీరు ప్రాతిపదికగా తొలగించనున్నట్లు ప్రకటించారు.
- దాదాపు 1.15 లక్షల ఉద్యోగులు ఉన్న ఇంటెల్ సంస్థ.. అంతర్జాతీయంగా 20 శాతం మేరకు ఉద్యోగులను తొలగించనున్నట్లు తెలుస్తోంది.
- దేశీయంగానూ ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ రెండున్నర వేల మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ▪ గూగుల్ సంస్థ కూడా ఈ ఆర్థిక సంవత్సరంలో నికర రాబడిలో తగ్గుదలతో నూతన నియామకాల విషయంలో కొంతకాలం స్వీయ నిషేధం విధించింది.

**మాంద్యం సంకేతాలే కారణమా!**

- ఐటీలో ఆన్‌బోర్డింగ్ ఆలస్యానికి అమెరికాలో ఆర్థిక మాంద్యం తలెత్తుతుందనే సంకేతాలే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మన దేశంలోని సంస్థల్లో అధిక శాతం అమెరికాలోని కంపెనీలకు ఔట్ సోర్సింగ్ విధానంలో సేవలందిస్తున్నాయి. అమెరికా మాంద్యం ముంగిట నిలిచిందనే అంచనాల కారణంగా.. అక్కడి కంపెనీల్లో కార్యకలాపాలు మందగిస్తున్నాయి. ఫలితంగా ఆయా సంస్థలు కొత్త ప్రాజెక్ట్‌ల విషయంలోనూ ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. దీంతో.. సదరు సంస్థలకు సేవలపై ఆధారపడిన మన ఐటీ కంపెనీలపై ఆ ప్రభావం కనిపిస్తోంది. ఇది అంతిమంగా ఆన్ బోర్డింగ్‌లో జాప్యానికి కారణమవుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అంతర్జాతీయ ఒడిదుడుకుల కారణంగా కొత్త ప్రాజెక్ట్‌లు రావడం కొంత కష్టంగా ఉంది. ఇది కూడా ఆన్ బోర్డింగ్‌లో జాప్యానికి మరో కారణమని చెబుతున్నారు.



జాబ్ ట్రెండ్స్

**ఉన్నత విద్యపై ప్రభావం**

- ఐటీ కంపెనీలు జాయినింగ్ లెటర్లు ఇవ్వక పోవడం వల్ల ఆఫర్ లెటర్లు ఖరారు చేసుకున్న విద్యార్థుల ఆర్థిక పరిస్థితితోపాటు, ఉన్నత విద్యపైనా ప్రభావం చూపుతోంది.
- పలువురు విద్యార్థులు ఎడ్యుకేషన్ లోన్స్ ద్వారా కోర్సులు పూర్తి చేసుకున్నారు. ఉద్యోగంలో చేరాక వాటిని తీర్చేయొచ్చని భావించారు. కానీ ఆఫర్లు ఖరారైనా.. ఇప్పటికీ విధుల్లో చేరకపోవడంతో ఆదాయం లేక..లోన్ రీ పేమెంట్ చేయలేని పరిస్థితి నెలకొంది.
- అంతేకాకుండా ఆన్ బోర్డింగ్ జాప్యంతో విద్యార్థులు ఉన్నత విద్య కోర్సుల్లో చేరాలా వద్దా ఎటూ తేల్చుకోలేకపోతున్నారు.

**టైర్-2, 3 ఇన్‌స్టిట్యూట్స్‌లోనే సమస్య**

ఆన్ బోర్డింగ్ తేదీల్లో జాప్యం అనేది ఎక్కువగా టైర్-2, టైర్-3 ఇన్‌స్టిట్యూట్‌ల విషయంలోనే తలెత్తుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. టైర్-1 ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులకు జాయినింగ్ తేదీలను సంస్థలు ఖరారు చేస్తున్నాయని చెబుతున్నారు.టైర్-2, టైర్3 ఇన్‌స్టిట్యూట్స్‌ల విద్యార్థులు సంస్థలు పేర్కొన్న సర్టిఫికేషన్స్ పూర్తిచేయకపోవడం లేదా శిక్షణ తీసుకోకపోవడం ఇందుకు కారణమంటున్నారు.

**నూతన నియామకాలు!**

- ఇటీవల ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసిక ఫలితాలను విడుదల చేసిన టీసీఎస్.. తాము కొత్తగా 12 వేల నియామకాలు చేపట్టనున్నట్లు పేర్కొంది.
- 'మూన్ లైటింగ్'పై నిషేధం విధించిన విప్రో.. ఈ ఏడాది ప్రథమార్థంలో 14 వేల మందిని నియమించినట్లు తెలిపింది. వచ్చే త్రైమాసికంలోనూ నియామకాలు కొనసాగిస్తామని పేర్కొంది. హెచ్‌సీఎల్ కూడా ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం 30 వేల మందిని నియమిస్తామని తెలిపింది. ఇప్పటికే పది వేలకు పైగా ఫ్రెషర్లకు అవకాశం ఇచ్చామని వెల్లడించింది.

**ఇప్పుడేం చేయాలి?**

- ఇప్పటికే ఆఫర్స్ ఖరారు చేసుకున్న వారు.. ఇతర ఉద్యోగాల కోసం అన్వేషణ సాగించొచ్చు. ఈ విషయాన్ని ఆఫర్ ఇచ్చిన మొదటి సంస్థకు తెలియజేయాలి.
- కొత్త ఉద్యోగంలో చేరే సందర్భంలోనూ తమకు అంతకుముందే ఆఫర్ వచ్చిన విషయాన్ని, ఆన్ బోర్డింగ్‌లో జాప్యాన్ని తెలియజేయాలి.
- కొత్త ఉద్యోగంలో ఏదైనా సర్వీస్ బాండ్ వంటి నిబంధనలు ఉంటే.. సంస్థ ప్రామాణికతను పరిగణనలోకి తీసుకుని స్పష్టమైన నిర్ణయానికి రావాలి.
- ఆన్ బోర్డింగ్‌కు మరికొన్ని రోజులు వేచి చూడాలని సంస్థ కోరితే..అభ్యర్థులు ఫ్రీలాన్సింగ్ వర్క్‌పై దృష్టి పెట్టొచ్చు.
- ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానాల్లో తమ నైపుణ్యాలకు పదును పెట్టుకునే కోర్సులు నేర్చుకునే ప్రయత్నం చేయాలి.
- స్వీయ అన్వేషణ మార్గాల ద్వారా కొత్త ఉద్యోగం కోసం యత్నించాలి.

**ఆ ఇన్‌స్టిట్యూట్స్‌కు సమస్య లేదు**

ఫ్రెష్ రిక్రూట్‌మెంట్స్ విషయంలో ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్ విద్యార్థులకు ఎలాంటి సమస్య లేదు. ఇప్పటికే ఐఐటీలు, ఐఐఎంలలో పీపీఓలు, ఎస్‌పీఓలు భారీగా లభించిన సంగతి తెలిసిందే. ఫైనల్ రిక్రూట్‌మెంట్ కూడా ఆశాజనకంగానే ఉంటుంది. మిగతా కాలేజీల విద్యార్థులు తమ అర్హతలకు సరితూగే లేటెస్ట్ నైపుణ్యాలు నేర్చుకుని.. స్వీయ అన్వేషణ మార్గాల ద్వారా ఉద్యోగం సొంతం చేసుకునేందుకు కృషి చేయాలి.

– ప్రొ॥ అభినవ్ కుమార్, ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జ్, కెరీర్ సర్వీసెస్, ఐఐటీ–హైదరాబాద్

# విజయవాడ మీదుగా 100 ప్రత్యేక రైళ్లు

**నవంబర్ 2 నుంచి 2023 జనవరి 1వ తేదీ వరకు..**



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నవంబర్ రెండు నుంచి 2023 జనవరి ఒకటో తేదీ వరకు విజయవాడ మీదుగా 100 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు అధికారులు మంగళవారం ప్రకటించారు. తిరుపతి-ఔరంగాబాద్ (07637) నవంబర్ 6 నుంచి 27 వరకు ప్రతి ఆదివారం, ఔరంగాబాద్-తిరుపతి (07638) నవంబర్ 7 నుంచి 28 వరకు ప్రతి సోమవారం, తిరుపతి-అకోలా (07605) నవంబర్ 4 నుంచి డిసెంబర్ 30 వరకు ప్రతి శుక్రవారం, అకోలా-తిరుపతి (07606) నవంబర్ 6 నుంచి 2023 జనవరి ఒకటి వరకు ప్రతి ఆదివారం, హైదరాబాద్-తిరుపతి (07643) నవంబర్ 7 నుంచి 28 వరకు ప్రతి సోమవారం, తిరుపతి-హైదరాబాద్ (07644) నవంబర్ 8 నుంచి 29 వరకు ప్రతి మంగళవారం, విజయవాడ-నాగర్‌సోల్ (07698) నవంబర్ 4 నుంచి 25 వరకు ప్రతి శుక్రవారం, నాగర్‌సోల్-విజయవాడ (07699) నవంబర్ 5 నుంచి 26 వరకు ప్రతి శనివారం నడపనున్నట్లు తెలిపారు. కాకినాడ టౌన్-లింగంపల్లి (07141) నవంబర్ 2 నుంచి 30 వరకు ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో, లింగంపల్లి-కాకినాడ టౌన్ (07142) నవంబర్ 3 నుంచి డిసెంబర్ 1 వరకు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వివరించారు. కాజీపేట-తిరుపతి (07091), తిరుపతి-కాజీపేట(07092) రైళ్లు నవంబర్ 8 నుంచి డిసెంబర్ 27 వరకు ప్రతి మంగళవారం, మచిలీపట్నం-సికింద్రాబాద్ (07185), సికింద్రాబాద్-మచిలీపట్నం (07186) రైళ్లు నవంబర్ 6 నుంచి డిసెంబర్ 25 వరకు ప్రతి ఆదివారం నడుస్తాయని తెలిపారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.